

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో

ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నల్లగొండ

: fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

24-3-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 51 పేజీలు: 8+16 వెల: 6.50



మతిస్థిమితంలేని బీహార్ సిఎం: ప్రశాంత్ కిశోర్

సరిహద్దుల్లో భద్రతకు రోబోడ్రోన్లు 5




## విజృంభిస్తున్న బర్డ్ ఫ్లూ!

### నిర్ధారించిన పశుసంవర్ధక శాఖ

### రెండు లక్షల కోళ్లను పూడ్చేసిన అధికారులు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తెలంగాణలో బర్డ్ ఫ్లూ మరోసారి విజృంభిస్తోంది. గత నెలలో బర్డ్ ఫ్లూ వైరస్ కలకలంతో ప్రభుత్వంఅప్రమత్తమైంది. కోళ్లఫామ్ యాజమానులను, ప్రజలను అప్రమత్తం చేసింది. తద్వారా అధికారులు బర్డ్ ఫ్లూ పై ప్రజలకు అవగాహన కల్పించారు. అయితే, కొద్దిరోజులకే బర్డ్ ఫ్లూ ప్రభావం తగ్గిపోవటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తాజాగా మరోసారి రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వైరస్ విజృంభిస్తోంది. వరుసగా లక్షలాదికోళ్లు బర్డ్‌ఫ్లూ వైరస్ కారణంగా మృత్యువాత పడుతున్నాయి. రాష్ట్రంలోని భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం ధోతిగూడెంలోని ఓ కోళ్లఫామ్ లో ఇటీవల వందల కోళ్లు చనిపోయాయి. విషయం తెలుసుకున్న వెటర్నరీ అధికారులు శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపడంతో బర్డ్ ఫ్లూగా నిర్ధారణ అయింది. దీంతో అధికారులు రెండు రోజుల క్రితం సుమారు 40 వేల కోళ్లను చంపేసి సంచుల్లో ప్యాక్ చేసి అనంతరం గొయ్యితీసి పూడ్చేశారు. ఫాంలోని దాదాపు 20వేల కోడిగుడ్లను, కోళ్లకు సంబంధించిన వ్యర్థాలను కూడా గొయ్యిలో పూడ్చిపెట్టారు. కోళ్ల ఫామ్ లో ఉన్న దాణాను సీజ్ చేశారు. అలాగే నల్గొండ జిల్లాలోనూ బర్డ్ ఫ్లూతో లక్షలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరు గ్రామ పంచాయతీ పరిధిలో రెండు లక్షలకుపైగా ఉండే ఓ కోళ్ల ఫారంలోని గుడ్లు ఉత్పత్తి చేసే కొన్ని కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన విషయం వెలుగు చూసింది. ఈ కోళ్ల >>2



# డీలిమిటేషన్‌పై కేంద్రానికి తీర్మానం

## నేడు అసెంబ్లీలో వాడి, వేడి చర్చ

### సభ ఆమోదం పొందాక తీర్మానం కేంద్రానికి అందజేత

### ప్రశ్నోత్తరాలు రద్దు, 4 పద్దులపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పునర్విభజనపై సిఎం రేవంత్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. సభ్యుల ఆమోదం తర్వాత కేంద్రానికి పంపనున్నారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, లోకసభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాలతో పాటు నష్టపోయే ఇతర రాష్ట్రాల హక్కులను కాపాడుకునే క్రమంలో రెండో సదస్సుకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. పునర్విభజనకు సంబంధించి చెన్నైలో శనివారం నిర్వహించిన సదస్సు ఈ మేరకు తీర్మానించింది కూడా. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునర్విభజనతో నష్టపోనున్న రాష్ట్రాల ప్రజల అభిమతానికి అనుగుణంగా రెండో సదస్సును హైదరాబాద్‌లో నిర్వహిస్తామని, అనంతరం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని చెన్నైలో తెలిపారు. పునర్విభజనపై దక్షిణాదితో పాటు నష్టపోయే ఇతర రాష్ట్రాల గళాన్ని బలంగా వినిపించేందుకు ఆయా రాష్ట్రాల్లోని అన్ని పార్టీల ఎంపీలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలోనే అన్ని రాజకీయ పరమైన నిర్ణయాలు జరుగుతాయని, ఈ నేపథ్యంలో అక్కడ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ... >>2



## దక్షిణాదికి తీవ్ర అన్యాయం

### జనాభా నియంత్రణ పాటిస్తే సీట్లు తగ్గిస్తారా?: కెటిఆర్

**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:** డిలిమిటేషన్ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆన్నారు. జనాభా నియంత్రణ పాటిస్తే ఆ రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్లు తగ్గిస్తారా అని ప్రశ్నించారు.. ఆదివారం కరీంనగర్‌లో ఆయన పర్యటించారు. కరీంనగర్ బైపాస్ రోడ్డులోని వికన్వెన్షన్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు. వచ్చే నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొని కార్యకర్తలకు, నేతలకు దిశానిర్దేశం చేసారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పదమూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య కార్యకర్తలు, ఈ సమావేశానికి హాజరయ్యారు. వరంగల్ లో వచ్చే నెల 27 వ తేదీన జరిగే పార్టీ రజతోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే కేటీఆర్ సూర్యాపేటలో >>2

## డీలిమిటేషన్‌పై కేంద్రం నిర్ణయం తీసుకోలేదు..



### తప్పడు ప్రచారంలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు పోటాపోటీ

### ఆ రెండు పార్టీల పాత సంబంధం చెన్నైలో బయటపడింది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త:** నియోజకవర్గాల పునర్విభజనపై ఇప్పటివరకు పార్లమెంటులో గానీ, కేబినెట్‌లో ఎటువంటి చర్చ జరగలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కాని, అవకాశవాద పార్టీలు దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని తప్పుడు ప్రచారం చేస్తూ దిగజరారుడు రాజకీయాలకు తెరలేపుతున్నాయంటూ మండిపడ్డారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్, బిఆర్ఎస్ అసలు రంగు బయటపడిందని, చెన్నైలో జరిగిన సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు పోటీపడి మాట్లాడటం, వారి నిజస్వరూపాన్ని బయటపెట్టిందన్నారు. అంతేకాకుండా వారి పాత బంధం బయటపడిందన్నారు. దేశంలో లేని సమస్యను సృష్టించి, భారతీయ జనతా పార్టీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ రెండు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి. తమిళనాడులో డిఎంకే పాలనలో అవినీతి, కుంభకోణాల పాలన చేస్తున్న స్టాలిన్ కుటుంబంపై ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకత కూడగట్టుకుం దన్నారు. దక్షిణాది ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో నరేంద్ర మోడీ ప్రభుత్వం కృషి చేస్తోంది. భవిష్యత్తులోనూ చేస్తుందన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో కర్ణాటకలో, తెలంగాణలో గెలిచేలా, తమిళనాడులో మరింత పట్టు సాధించేలా అంకితభావంతో పనిచేస్తున్నామని, అయితే, దక్షిణాదిలో భారతీయ జనతా పార్టీ బలపడకూడదనే రాజకీయ కుట్రకోణంతో కాంగ్రెస్ పార్టీ, డిఎంకే పార్టీ, బిఆర్ఎస్ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయంటూ మండిపడ్డారు. జనాభా లెక్కల సేకరణ ఇంకా ప్రారంభం కాలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కానీ అవకాశవాద పార్టీలు దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని తప్పుడు ప్రచారంచేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని, >>2


బిఆర్ఎస్ దొంగనోట్లను ముద్రించింది -కేంద్ర మంత్రి బండి సంజయ్ 7


### 4 కేటగిరీలుగా యువ వికాసం

### రుణ రాయితీ 100 % పెంపు

### బిసి సంక్షేమ శాఖ కీలక నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి రుణాల మంజూరు నిబంధనలపై బిసి సంక్షేమ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో అమలు చేసిన స్వయం ఉపాధి స్కీముల కన్నా మెరుగ్గా నిబంధనలు రూపొందించడంతో పాటు, పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. బీసీ సంక్షేమశాఖ అధికారవర్గాలు వెల్లడించిన వివరాలు ప్రకారం ఆర్థికంగా వెనబడిన వర్గాలకు వారికి యూనిట్లు మంజూరు చేయనుంది. ఇందుకుగాను యూనిట్లను నాలుగు కేటగిరీలుగా విభజించి, రాయితీ నిధుల వాటాను పెంచింది. ఈబీసీలకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని నిర్ణయించిన ప్రభుత్వం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. రాజీవ్ యువవికాసం స్కీముపై సమగ్ర నిబంధనలు సోమవారం జారీ కానున్నాయి. స్వయం ఉపాధి పథకాల కింద చిరు వ్యాపారులు చేసేవారి కోసం ప్రత్యేకంగా రూ.50 వేల రుణ పథకాన్ని అమలు చేయనుంది. దీని కింద లబ్దిదారులకు 100 శాతం రాయితీతో రుణాలను మంజూరు చేయనుంది. అలాగే లక్షలోపు యూనిట్లకు గతంలో 80శాతం సబ్సిడీ ఉండేది . దాన్ని ఇప్పుడు 90శాతానికి పెంచాలని నిర్ణయించింది. అంటే లక్షలోపు యూనిట్ కోసం లబ్దిదారుడు కేవలం రూ. 10 వేలు తన వాటాకింద చెల్లించాల్సి >>2



ఆదివారం భద్రాచలంలో ఇందిరమ్మఇళ్ల లబ్ధిదారులకు మిఠాయి తినిపిస్తున్న మంత్రి పొంగులేటి

### ఉగాదిలోగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

### మరికొన్ని ఇళ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు: మంత్రి పొంగులేటి

**భద్రాచలం, ప్రభాతవార్త:** శ్రీ సీతారామచంద్ర స్వామి కొలువై ఉన్న భద్రాచలంలో ప్రతి పేద కుటుంబం సొంతింటి కల నెరవేరడానికి ప్రతి ఒక్క బహు పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు కట్టించి వారి కలను సాకారం చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం భద్రాచలంలోని ఏఎంసీ కాలనీలో అసంపూర్తిగా 117 ఉన్న ఇండ్లను రూ.7,36,50,000లతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు బలరాం నాయకతో కలిసి ప్రారంభించి, లబ్ధిదారులకు అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం లబ్ధిదారులకు అందించిన ఇండ్లకు అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పించి అందించడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేద కుటుంబాలను గుర్తించి 2004 నుండి 2014 వరకు 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందని, గత పది సంవత్సరాల కాలంలో ఇల్లు కట్టించిన అసంపూర్తిగా వదిలి వేయడంతో మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను నెరవేర్చడానికి 1,56 వేల ఇండ్లు అసంపూర్తిగా ఉండడంతో ఇండ్లను పూర్తి చేసి అందించడం జరిగిందని, ఇంకా కొన్ని ఇండ్లు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయించి పూర్తిస్థాయిలో నిర్మించి లబ్ధిదారులకు అందజేస్తామని, ప్రతి పేద వాళ్లకు న్యాయం చేయడానికి మా ప్రభుత్వం ముందు ఉంటుందని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టడానికి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామని, అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.387 కోట్లు మంజూరు చేశారని, ఉగాది లోపు ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. మిగిలిన నాలుగు సంవత్సరాల కాలంలో ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి 20 లక్షల ఇండ్లు లక్ష్యంగా పెట్టుకున్నామని, దశలవారీగా అందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామని అన్నారు. మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలో ప్రతి నిరుపేద గిరిజన కుటుంబానికి తప్పనిసరిగా పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తామని, శ్రీ సీతారామ చంద్రుడు ఆశీస్సులతో తప్పనిసరిగా ఈ నియోజకవర్గానికి అభివృద్ధి దిశగా తీసుకుపోతామని అన్నారు.

## నీరు రాని విద్యుత్ బోర్లు!




### పడిపోతున్న భూగర్భ జలాలు

### ప్రాజెక్టుల ద్వారా అందని సాగు నీరు

### కష్టాలు, నష్టాలతో నలిగిపోతున్న అన్నదాతలు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** సాగు నీరందకపోగా, రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో రాష్ట్రంలోని పంటలు ఎండిపోతుండడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. వివిధ ప్రాజెక్టుల కింద సరిపడా సాగు నీరు అందకపోవడం, భూగర్భ జలాలు పడిపోవడం, నీరు రాని విద్యుత్ బోర్లు తదితర కారణాలతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పలు పంటలు ఎండిపోతున్నాయి. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9 లక్షల ఎకరాల వరకూ పంటలు ఎండిపోతున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈనపంటల్లో ప్రధానంగా వరి పంటే ఎక్కువ ఎండిపోయింది. ఇక ప్రస్తుత యాసంగి సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 53.25 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇందులో నీటి ఎద్దడితో సుమారు 9 లక్షల ఎకరాలకు పైగా ఎండిపోతున్నట్లు అంచనా. ప్రధానంగా పంట చేతికొచ్చే సమయానికి వివిధ ప్రాజెక్టుల ద్వారా శివారు భూములకు నీరందకపోవడం, భూగర్భ జలాలు అడుగంటి బోర్లల్లో నీరు ఇంకిపోతుండడంతో సగానికిపైగా బోరు మోటార్లు నీరుపోయడం పూర్తిగా తగ్గించాయి. దీంతో ప్రాజెక్టులు, బోరు మోటార్లను నమ్ముకొని పంటలను సాగు చేసిన రైతన్నలకు ఎండుతున్న పంటను చూసి ధీనంగా సాయంకోసం ఎదురుచూస్తున్నారు. ఇక ప్రాజెక్టులలో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతుండడంతో కృష్ణ, తుంగభద్ర నదుల మధ్యలో ఉన్న నడిగడ్డకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. తుంగభద్ర నదిలో నీటి లెవెల్ తగ్గిపోవడంతో ఆర్డీఎస్ పంపింగ్ నిలిచిపోయింది. జూరాల ప్రాజెక్టులో కూడా ప్రస్తుతం తాగునీటి అవసరాలకు పోను 1.20 టీఎంసీలు మాత్రమే సాగునీటికి వాడుకునే అవకాశం ఉంది. యాసంగిలో వారబందీ కింద రెండు రోజులు మాత్రమే జూరాల ఆయకట్టుకు నీరు ఇస్తున్నారు. నెట్టెంపాడు ప్రాజెక్టు కింద కూడా ఆశించిన స్థాయిలో నీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే ఆయకట్టు రైతులు ఆందోళనలు చేస్తున్నారు. నెట్టెంపాడు లిఫ్ట్ కింద యాసంగిలో 20 వేల ఎకరాలకు నీటిని ఇస్తామని అధికారులు చెబుతున్నా అది సాధ్యం కావడం లేదు. లెఫ్ట్ కెనాల్ కింద 105వ ప్యాకేజీ, రైట్ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ 5 వరకు 15 వేల ఎకరాలకు, లెఫ్ట్ కెనాల్ కింద 5 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ప్రతిపాదించినా, 104వ ప్యాకేజీ కింద రైతులకు నీళ్లు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కొంతమేర పంట పొలాలు ఎండిపోయాయి. ఇక వరంగల్ జిల్లాలో నీటి ఎద్దడితో రూ.800 చొప్పున వాటర్ ట్యాంకర్లకు డబ్బులు చెల్లించి పంట పొలానికి రైతులు తడులు >>2

# మేడిగడ్డ బాధ్యత ఎల్ & టిదే



## కుంగిన ఏడవ బ్లాక్‌ను ఆ సంస్థ సొంత నిధులతో నిర్మించాలి

### 17 మంది నీటి పారుదల ఇంజినీర్లపై చట్టరీత్యా చర్యలు

### నిర్మాణ పనుల్లో అన్నీ లోసుగులే

### విజిలెన్స్ నివేదిక సిఫారసులు

**హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త:** ఉన్నత స్థానాల్లో ఉండి తప్పుడు విధానపరమైన నిర్ణయాలు తీసుకొన్నవారిని కాదని కార్యక్షేత్రంలో పనిచేసిన తమను బాధ్యులు చేసే విధంగా విజిలెన్స్ నివేదిక వెల్లడైనట్లు బాధిత ఇంజనీర్లు ఆవేదన చెందుతున్నారు. మేడిగడ్డ పునర్నిర్మాణ బాధ్యత ఎల్ అండ్ టి సంస్థదేనని,ప్రైమరీ ఫైల్ వేసిన 48 గంటల్లోపు సీకెంట్‌ఫైల్ వేయాల్సి ఉండాల్సి ఉన్నప్పటికి ఆరేడువారాల వరకు తాత్సారం చేయడంతోనే పునాదిలో లోపం తలెత్తిందని ఏడవ బ్లాక్ కుంగిపోయిందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ రాష్ట్రప్రభుత్వంకు నివేదించింది. మేడిగడ్డ ఎగువన దిగువన జడ్‌టైప్ సీట్ ఫైల్స్ ప్రతిపాదిసేనత ఎల్ అండ్ టి సంస్థ విజ్ఞప్తిమేరకు సీకెంట్‌గా మార్చినారని విజిలెన్స్ విచారణలో తేల్చినారు. సీకెంట్‌ఫైల్ ఏర్పాటులో ఎల్ అండ్ టి వైఫల్యం చెందినది. మేడిగడ్డ బ్యారేజి నిర్మాణం,నిర్వహణ విషయంలో కాంట్రాక్టర్లు నీటిపారుదల ఇంజనీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే లోపాలు తలెత్తి ప్రభుత్వంకు భారీ ఎత్తున ఆర్థికంగా నష్టంవాటిల్లిందని విజిలెన్స్ నివేదిక అభిప్రాయపడింది. సాధారణంగా ప్రైమరీ(ఆడ)ఫైల్స్ సీటులో వేయబడుతాయి,తరువాత ద్వితీయ(మగ)ఒకదానిపై ఒకటి ఉండేలా నిర్మిస్తారు కానీ ఎల్ అండ్ టి కాంట్రాక్టు సంస్థ, ఇంటర్నల్ డాక్యుమెంట్‌నే ప్రకారం ప్రొడక్టివ్ ఇంజనీరింగ్ సర్వీసు అమలు చేయలేదని విజిలెన్స్ తన విచారణలో వెల్లడైన అంశాన్ని నివేదికలో పొందుపరిచింది. నీటిపారుదలశాఖ నిర్మాణ స్థలంలో పర్యవేక్షణ చేసే ఇంజనీర్లు,నాణ్యతా ప్రమాణాలు నియంత్రించే >>2


ఎల్ & టి అధీనంలో ఉన్నప్పుడే దెబ్బతిన్న మేడిగడ్డ 3

ప్రభాకర్ రావు ముందస్తు బెయిలు పిటిషన్ దాఖలు 3



న్యూఢిల్లీలోని మాలవీయ నగర్‌లో ఆదివారం షహీద్ భగత్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా. చిత్రంలో బిజెపి ఎంపి బన్సూరి స్వరాజ్ తదితరులు

## షహీద్ దివస్ సందర్భంగా భగత్‌సింగ్ త్యాగాలను స్మరించుకున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** షహీద్ దివస్ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమ విప్లవ పోరాట యోధులు,మాతృదేశ విముక్తి కోసం ప్రణాలు అర్పించిన వీరులు భగత్‌సింగ్,సుఖ్‌దేవ్,రాజ్‌గురు త్యాగాలను స్మరించుకున్నారు.

## రాష్ట్రంలో పలు ఘటనల్లో 8 మంది మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** రాష్ట్రంలో ఆదివారం జరిగిన పలు ఘటనల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. సూర్యపేట జిల్లా చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద ఆర్టీసి బస్సును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు. కారులోని భార్యా,భర్త, పాప(8),మరొకరు చనిపోయారు. మృతుల్లో గడ్డం రవి,గడ్డం రేణుక,గడ్డం రీతులుగా గుర్తించారు. వీరంతా ఒక కుటుంబానికి చెందిన వారు. కారు నుజ్జునుజ్జు కావడంతో వీరు స్పాట్‌లో మరణించారు. గడ్డం రవి ఇతర బంధువులు కలిసి మోతె మండలం కోటపహాడ్‌లో శుభ కార్యానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అలాగే హానుమకొండ జిల్లా కరీంనగర్ నేషనల్ హైవేపై హసన్‌పర్తి పెద్దచెరువు కట్ట వద్ద మరో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. టూవీలర్‌ను టిప్పర్ ఢీకొట్టగా పవన్,మహేశ్ మృతి చెందారు. నల్లగొండ ఏవూరులో ఈతకు వెళ్లి నవీన్(23), రాఘవేంద్ర(20) నీట మునిగి చనిపోయారు.

## హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హుటాహుటీన ఢిల్లీకి పయనమయ్యారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం ఢిల్లీని ఫోన్ కాల్ రావడంతో హుటాహుటీని బయలు దేరి పయమమయ్యారు. ముందస్తున్న ఉన్న షెడ్యూల్ ప్రోగ్రామ్స్‌ను అన్నింటిని రద్దు చేసుకుని ఢిల్లీకి వెళ్లారు. అయితే హఠత్తుగా ఢిల్లీకి వెళ్లడంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## డీలిమిటేషన్‌పై కేంద్రం నిర్ణయం తీసుకోలేదు..

>> తమిళనాడులో డిఎంకే ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలతో నిండిపోయిందన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను తప్పించుకో వడానికి, డీలిమిటేషన్ పేరుతో బిజెపిపై బురదజల్లే కుట్రలు చేస్తున్నారని, గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా, ఇప్పుడు భాష, ప్రాంతం పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నా రన్నారు. కర్ణాటక, తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బిజెపి అధికారంలోకి వస్తుంది. గత పార్లమెంటు ఎన్నికలతో పాటు, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ప్రజలు బిజెపికి మద్దతుగా తీర్పు ఇచ్చారన్నారు. దక్షిణాదిలో బిజెపి బలపడకూడదన్న కుట్రతో కాంగ్రెస్, డిఎంకే, బిఆర్ఎస్ పార్టీలు కలిసి దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాలకే పరిమితమైందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టబోతున్నారని అన్నారు. కుటుంబ పార్టీలు, అసమర్థ పార్టీలు ముఠాగా ఏర్పడి, మోడీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. కొన్ని కుటుంబ పార్టీలు, అవినీతి పాలిత పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. డీలిమిటేషన్‌కు సంబంధించి ఏవైనా చట్టాలుంటే ఆ చట్టాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో చేసినవేనన్నారు. డీలిమిటేషన్ జరగాలంటే ముందుగా జనాభా లెక్కల సేకరణ జరగాలి. పార్లమెంటులో చట్టం చేయాలంటే మేధావులు, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో ప్రజలకు ఏదో అన్యాయం జరుగబోతోం దంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కెటిఆర్ ఒకే సమావేశం పాల్గొని ఆరోపణలు చేయడాన్ని మేం ఖండిస్తున్నాం. వారి ఆరోపణలన్నీ అసత్యాలే అన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే విధంగా సమర్థవంతమైన పరిపాలనతో దేశ గౌరవాన్ని, అభివృద్ధిని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెడితే బాగుంటుందని, అంతేకాని కేంద్రంపై డీలిమిటేషన్ పేరుతో విమర్శలు చేయడం తగదు. విమర్శలు చేసినంత మాత్రాన ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి పోదనేది గుర్తుంచుకోవాలన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ, మజ్లిస్ పార్టీలు ఒక్కటైనా తెలంగాణ ప్రజల మద్దతుతో ఆ మూడు పార్టీలను సమర్థవంతంగా బిజెపి ఎదుర్కొంటుందన్నారు. జనాభా లెక్కల సేకరణ చేయాలంటేనే కనీసం సంవత్సరం సమయం తీసుకుంటుంది. ఆ తర్వాత పార్లమెంటులో చర్చకు వస్తుంది. కేవలం తమిళనాడులో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ స్టాలిన్‌ను ముందుపెట్టి నాటకమాడుతుందన్నారు. ఈ నాటకంలో కెటిఆర్ భాగస్వామ్యమయ్యారు. కేవలం బిజెపి మరింత బలపడకుండా ప్రజల్లో తప్పుడు సంకేతాలను పంపేందుకే ఆయా పార్టీలు నాటకమాడుతున్నాయని మండిపడ్డారు.

## నీరు రాని విద్యుత్ బోర్లు!

>> పెట్టుకుంటున్నారు. తండాల్లో వందల ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోయాయి. దూప తండాలో 45 మంది రైతుల పొట్ట దశలో ఉన్న వరి, కంకి దశలో ఉన్న మొక్కజొన్న వందల ఎకరాల్లో ఎండిపోయింది. వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన పంటలను పశువుల మేతకు వదిలేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో సాగుచేసి ఎండిపోయిన వరి పంట పొలాలను చూసి రైతాంగం కన్నీటి పర్యాంతమవుతోంది. మెదక్ జిల్లాలో భూగర్భ జలమట్టాలు రోజురోజుకి దిగువకు పడిపోతున్నాయి. ఇది యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నీటి తడులు అందక వరి పొలాలు బీటలు వారుతున్నాయి. పలు చోట్ల పంట ఎండిపోతోంది. మార్చిలోనే ఎండల తీవ్రత పెరిగి, బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే నల్గొండ జిల్లాలో ఇటీవల సాగు నీటి కోసం అన్నదాతలు రోడ్డెక్కారు. వివిధ గ్రామాల్లో గత 20 రోజులుగా సాగు నీరు అందక పొట్టదశలో ఉన్న పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ధర్నా నిర్వహించారు. ముఖ్యంగా ఎస్ఎల్ బీసీ కింద, డీ 40, ఎల11 తూముల ద్వారా తమకు సాగు నీళ్లు వచ్చేవని, కానీ ఇరిగేషన్ అధికారులు తమకు నీళ్లు ఇవ్వకుండా తూములకు సీల్ వేశారని ఆరోపించారు. ఇలా రాష్ట్రం రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, మెదక్ తదితర జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు.

## విజృంభిస్తున్న బర్డ్ ఫ్లూ!

>> ఫామ్ లో గత మూడు రోజుల నుంచి కోళ్లు మృతి చెందుతుండగా పశువైద్య శాఖ అధికారులు వైద్య పరీక్షలు చేశారు. మృతిచెందిన కోళ్ల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి పరీక్షి ంచడంతో బర్డ్ ఫ్లూ వ్యాధితోనే కోళ్లు మృతి చెందినట్లు తేలింది. దీంతో ఫారంలోని మిగిలిన కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకకముందే వాటిని పూడ్చివేశారు. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫామ్‌కు మూడు కిలో మీటర్ల వరకు వ్యాధి ప్రభావిత జోన్ గా ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నమోదైన మూడు బర్డ్ ఫ్లూ కేసులు ఉమ్మడి నల్గొండ జిల్లాలోనివే కావటంతో చికెన్ ప్రియులు, పౌల్ట్రీ ఫారాల యాజమానులు భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలాఉంటే గత నెలలో చౌటుప్పల్ మండలం నేలపట్లలో రాష్ట్రంలోనే మొదటి బర్డ్ ఫ్లూ కేసు నమోదైంది. ఉమ్మడి నల్గొండ జిల్లా హైదరాబాద్‌కు సమీపంలో ఉంది. ఇక్కడి పౌల్ట్రీ ఫారాల నుంచే పెద్దెత్తున చికెన్ హైదరాబాద్ లోని పలు ప్రాంతాలకు సరఫరా అవుతుంది. ఈ క్రమంలో గత నెలలో హైదరాబాద్ లో చికెన్ విక్రయాలు భారీగా తగ్గిపోయాయి. ఇటీవల బర్డ్ ఫ్లూ ప్రభావం తగ్గడం, రంజాన్ మాసం కావడంతో చికెన్ విక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మళ్లీ బర్డ్ ఫ్లూ విజృంభిస్తుండటంతో పౌల్ట్రీ యాజమానులు దిక్కుతోచని స్థితిలో ఉండగా చికెన్ ప్రియులు ఆందోళ చెందుతున్నారు.

## 4 కేటగిరీలుగా యువ వికాసం

>> ఉంటుంది. ఇక రూ. 1 నుంచి 2 లక్షల్లోపు వ్యయం కలిగిన యూనిట్లకు రాయితీని 80శాతానికి పెంచింది. రూ. 2 4లక్షల యూనిట్లకు రాయితీ 70శాతంగా నిర్ణయించింది. స్వయం ఉపాధి పథకాల కోసం ఎదురుచూస్తున్న వారికి మెరుగైన ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ మేరకు సబ్సిడీ వాటా పెంచినట్లు తెలుస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈబీసీ), ఆర్థికంగా బలహీనవర్గాల (ఈడబ్ల్యూఎస్)కు చెందిన వారికి సైతం రాజీవ్ యువ వికాసం పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన వ్యక్తులు ఆర్థిక సాయం కోసం ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

### వారం - వర్జ్యం

తేది : 24-03-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
దశమి తె.5.06
ఉత్తరాషాఢ తె.4.26
వర్జ్యం మ.12.20-1.57
దు.మ.12.47-1.36, 2) మ.3.13-4.02
శుభసమయం: ఉ.4.30-5.15
సా.7.30-8.00
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. మిత్రుల నుంచి శుభవార్తలు అందుకొంటారు.

**వృషభం :** దూరప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ధన,వస్తు లాభాలు పొందుతారు.

**మిథునం:** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కర్కాటకం:** కొత్త మిత్రులు పరిచయమై సాయం అందిస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**సింహం:** అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**కన్య :** ముఖ్యమైన పనులలో స్వల్ప ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. ఔషధ సేవనం.

**తుల :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. ఖర్చులు పెరుగుతాయి. జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. అనుకోని ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు:** ఊహించని ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కుంభం:** ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి. వృత్తి, వ్యాపారాలు లాభ సాటిగా సాగుతాయి. వాహనసౌఖ్యం.

**మీనం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పండి

## తెలంగాణ స్పీకర్ కార్యాలయానికి సుప్రీం కోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం అసెంబ్లీ కార్యాలయానికి చేరుకున్నది. తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలంటూ గతంలోనూ నోటీసులు ఇచ్చింది. ఇందుకు సుప్రీంకోర్టు గడువు కూడా విధించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పిటీషనర్ల తరఫు న్యాయవాదులు అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి నోటీసులు అందించారు. ఒక పార్టీ బీ ఫామ్‌పై గెలిచి మరో పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో అఫిడవిట్ రూపంలో వివరణ ఇవ్వాలని స్పీకర్ కార్యాలయాన్ని సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా ఆదేశించింది. పిటీషనర్ల తరఫు న్యాయవాదులకు కూడా ఆదేశాలు ఇచ్చి స్పీకర్ కార్యాలయంలో నోటీసులను అందజేయాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల్లో భాగంగా పిటీషనర్లుగా ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపి వివేకానందగౌడ్, కౌశిక్‌రెడ్డి తరఫున న్యాయవాదులు స్పీకర్ కార్యాలయంలో నోటీసుల్ని అందజేశారు. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. ప్రజలు కారు గుర్తుపై గెలిపించాక పార్టీ మారడం వారి నమ్మకాన్ని వమ్ము చేయడమేనని బీఆర్ఎస్ విమర్శించింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ స్పీకర్‌ను ఆదేశించాలని కోరింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం,అసెంబ్లీ కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. గత వారం విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం తదుపరి విచారణను 25వ తేదీకి వాయిదా వేసింది.

## తిరుమలలో మళ్లీ ప్లాస్టిక్‌సీసాల నీరు!

### గాజుసీసాలకు బ్రేక్

### నేడు పాలకమండలిలో చర్చ



**తిరుమల,మార్చి 23 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులు నాణ్యమైన, తక్కువ ధరకు మంచినీరు అందుకునే దిశగా టిటిడి పాలమండలి, అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా మళ్ళీ తిరుమలకొండపై ప్లాస్టిక్ సీసాల నీటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆలోచనచేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంగా టిటిడి అధికారులు, పాలకమండలి సానుకూలంగా వున్నట్లు తెలుస్తోంది. కలియుగవైకుంఠం తిరుమలకొండపై పర్యావరణ పరిరక్షణ, కాలుష్యనియంత్రణలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధిస్తూ 2022 జూన్‌లో నిర్ణయం తీసుకున్నారు. దీన్ని అమలుచేస్తున్నారు కూడా. అంతకంటే ముందే 2021లోనే తిరుమలలో ప్లాస్టిక్‌సీసాల నీటిని విక్రయించడం నిషేధించారు. అప్పట్లోనే దీనిపై అత్యధికమంది భక్తులు కూడా వ్యతిరేకించారు. ప్లాస్టిక్‌సీసాలో నీరు తక్కువ ధరకే విక్రయిస్తారు. అరలీటరు సీసానీరు 110రూపాయలు, లీటరు సీసానీరు 20రూపాయలు, 2లీటర్ల సీసానీరు 35రూపాయలకు అందుబాటులో ఉండేది. అయితే గతంలో వైసిపి టిటిడి పాలకమండలి ఏకంగా దీన్ని రద్దుచేశారు. ఆస్థానంలో తొలుత స్టెయిన్‌లెస్ స్టీల్,రాగి నీటిసీసాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిని టిటిడినే స్వయంగా విక్రయించింది కూడా. అయితే ఇవేమీ సామాన్యభక్తులకు అందుబాటులో లేకపోవడంతో ఆ స్థానంలో గాజుసీసాల నీటిని విక్రయించాలని ఆదేశాలిచ్చారు. దీనివెనుక అప్పటి టిటిడి పాలకమండలి పెద్దల హస్తం కూడా ఉందనే ఆరోపణలు వినిపించాయి.మెల్లమెల్లగా గత మూడేళ్ళుగా గాజుసీసాల నీటినే భక్తులు కూడా కొనుగోలుచేస్తున్నారు. ఈ సీసాల ధర 65రూపాయలకు విక్రయిస్తుండటంతో భక్తులకు భారంగా మారింది. ఖాళీగాజుసీసాలు ఏ దుకాణంలో తిరిగి వచ్చినా 30రూపాయలు డిపాజిట్ ఇచ్చేవారు.ఇలా భారంగా మారడంతో బాటు గాజుసీసాలతో ప్రమాదంగా మారింది. కొందరు భక్తులు, అనదికార హాకర్లు గాజుసీసాలతో దాడులుకు దిగారు.ఈ నేపథ్యంలో ప్రస్తుత పాలకమండలి భక్తుల సౌలభ్యం కోసం తిరిగి ప్లాస్టిక్‌సీసాల నీటిని విక్రయించేలా నిర్ణయం తీసుకోనున్నారు. సోమవారం నేడు జరిగే బోర్డు సమావేశంలో దీన్ని చర్చించి ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకోనున్నారు. మరీ ప్లాస్టిక్‌సీసాలను పర్యావరణానికి ప్రమాదంగా కాకుండా ఎలా తరలిస్తారనేది చూడాల్సిందే. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా అలిపిరి వద్ద ప్రతిరోజూ 10బస్తాలు ప్లాస్టిక్ నీటి సీసాలు ప్రోగవుతున్నాయి.అంతేగాక కొండపై టిటిడి జలప్రసాదిని అందుబాటులో ఉంది. వేసవికాలం కావడంతో ఇక్కడ అవసరాలకు తగ్గట్లు ప్లాస్టిక్‌సీసాల నీటిని భక్తులకు మళ్లీ అందుబాటులోకి తేవాలని చూస్తుండటంపై భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



ఉత్కరాఖండ్ రాష్ట్ర సర్కార్ మూడేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం డెహ్రాడూన్‌లో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో సైకిల్ తొక్కిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి

## బాధ్యత ఎల్&టిదే

>> ఇంజనీర్లు కాంట్రాక్టు సంస్థ పిఇఎస్ అమలు చేయపోయినా ప్రేక్షకపాత్ర వహిస్తూ నిర్లక్ష్యం చేశారని విజిలెన్స్ నివేదికలో ఎత్తిచూపింది. సీకెంట్‌ఫైల్ విధానం దేశంలో కాళేశ్వరంలోనే మొదటిసారి అన్వయించడంతో తెలంగాణలోని నీటిపారుదలశాఖ ఇంజనీర్లకు సీకెంట్‌ఫైల్స్‌పై అరకొర అవగాహన ఉందని,ఉన్నతస్థానాలలో ఉన్న ఇంజనీర్లు కూడా ఉదాసీనంగానే ఉండటంతో మేడిగడ్డ కుంగిందని తుది నివేదికలో నివేదించారు.దేశంలో భారీ, మధ్య,చిన్న నీటి ప్రాజెక్టుల నిర్మాణం కూడా సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఆమోదంతో కూడిన డ్రాయింగ్‌లు అమలు చేస్తారు.కానీ మేడిగడ్డ బ్యారేజిలలో సిడివో డ్రాయింగ్‌లను అమలు చేయలేదు,ఫలితంగా సీకెంట్ ఫైల్స్ నిర్మాణంలో రాఫ్ట్ కింద కోతకు (పైపింగ్) గురై పెద్దపెద్దగోతులు పడ్డాయని ఏడవ బ్లాక్ కుంగుబాటుపై విజిలెన్స్ నివేదికలో అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆనకట్టల భద్రత చట్టం–2021,ప్రభుత్వ ఆస్థుల నష్టనియంత్రణ చట్టం– 1984 అవినీతి నియంత్రణ చట్టం –1988 ప్రయోగించి నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జాకు సిఫార్సు చేసింది. కుంగిన ఏడవ బ్లాక్‌ను కొత్తగా ఎల్ అండ్ టి సంస్థ తన సొంత నిధులతో నిర్మించాలని విజిలెన్స్ సూచించింది.17 మంది నీటిపారుదల ఇంజనీర్లపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొంది. నీటిపారుదలశాఖ అధికారులు పని పూర్తి కాకముందే కంప్లీషన్ సర్టిఫికెట్ జారీచేయడం బ్యారేజి మరమ్మతులు చేయకపోయినా పట్టించుకోకపోవడం విజిలెన్స్ శాఖ తీవ్రంగా అభిశంసించింది. ప్రభుత్వ ప్రయోజనాలకు భిన్నంగా నీటిపారుదలశాఖ కాంట్రాక్టు సంస్థతో కలిసి కుట్రలు చేసినట్లుగా విజిలెన్స్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. పాలనపరమైన అనుమతుల కంటే అధిక పరిమాణంలో అనవసరంగా పనులు చేసి బిల్లులు ఎక్కువ మొత్తం తీసుకొన్నారని విజిలెన్స్ పరిశీలనలో గుర్తించారు. రూ.1343.76కోట్లు వ్యత్యాసంకు చీఫ్ ఇంజనీర్ ఆమోదం తెలిపినట్లు విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నారు. పరిపాలన అనుమతి ఇచ్చిన దానికంటే వ్యయం పెరిగితే 15వరకు వ్యత్యాసాన్ని ప్రభుత్వంకు సమాచారం ఇచ్చి చీఫ్ ఇంజనీర్ సవరించి సాంకేతిక అనుమతితో ఇచ్చే అవకాశం ఉంది. రెండు పర్యాయాలు ఇలా సవరించారు. మొదటి సారి పంపిన పెరిగిన వ్యయ వ్యత్యాసం ప్రభుత్వం నుంచి ఆమోదం లభించకముందే అందులో సవరించిన పనులు చేయకుండానే బిల్లులు పొందారని విజిలెన్స్ ఎత్తిచూపింది.23 జూన్ 2018 న 3,260కోట్లు సవరించిన అంచనాకు ఆమోదం రాగా అంతకు ముందే 14జూన్ 2018లో చీఫ్ ఇంజనీర్ 1343.76కోట్ల వ్యయ వ్యత్యాసంను ఆమోదించారు. మొదటి సారి సవరించిన అంచనా,రెండోసారి సవరించిన అంచనాపై ఒప్పందం కుదుర్చుకున్న పనులు పూర్తిచేయకుండానే బ్యారేజీపనులుపూర్తిచేసినట్లు నిర్మాణ సంస్థ పేర్కొనడం కేవలం ప్రభుత్వ ఖజానాకు గండికొట్టాలని కుట్ర ఉందని విజిలెన్స్ అభిప్రాయపడింది. క్వాలిటీ కంట్రోల్ కు సంబందించిన 188257 క్యూబిక్‌మీటరలన టెస్ట్ రిజిష్టర్లు లేవని ఇందులోనే అవకతవకలకు పునాది ఉందని విజిలెన్స్ పేర్కొంది.

## దక్షిణాదికి తీవ్ర అన్యాయం

>> పర్యటించిన సంగతి తెలిసిందే.వరుసగా అన్ని జిల్లాలను కేటీఆర్ పర్యటిస్తున్నారు. కార్యక ర్తలలో, నేతల్లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. కేటీఆర్ కరీంనగర్ రాకతో పార్టీ కార్య కర్తలు పెద్దయెత్తున భారీ ర్యాలీని ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని రాంనగర్ చౌరస్తా నుంచి ర్యాలీ ప్రారంభమై, తెలంగాణచౌక్, కమాన్‌మీదుగా సభాప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం కేటీఆర్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు...రాబోయే రోజుల్లో మళ్ళీ అధికారం బిఆర్ఎస్ పార్టీదే అని ధీమా వ్యక్తంచేశారు.నాయకులు,కార్యకర్తలు అందరూ కలిసి సమిష్టిగా పనిచేయాలన్నారు.గతంలో అసెంబ్లీ స్థానాలు పెంచాలంటే దక్షి ణాది ఎందుకు పెంచలేదు అని ప్రశ్నించారు..బీజేపీ బలంగా ఉన్న చోట్ల అసెంబ్లీ స్థానాలు పెంచుతుందన్నారు.గతంలో బిఆర్ యస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బిజెపి చేసిన బిల్లులకు ఆమోదం తెలిపామని అన్నారు. దక్షి ణాది రాష్ట్రాలు ఏం తప్పు చేశాయో బిజెపి చెప్పాలన్నారు.దక్షి ణాది రాష్ట్రాలు ఎక్కువగా పన్నులు కేంద్రానికి చెల్లిస్తున్నాయని గుర్తుచేశారు.కేవలం తెలంగాణ తో బిజెపి అధికారంలోకి ఈ కుట్ర చేస్తుందని తెలిపారు.గతంలో కేంద్రం మెడలువంచి తెలంగాణ తెచ్చుకున్నము అలాగే డిలిమిటేషన్ పై కూడా పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు,ఉమ్మడి జిల్లా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా హరిశంకర్ గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (బీసీ) పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా సూదగాని హరిశంకర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం టూరిజం ప్లాజాలో జరిగిన బీసీ జేఏసీ కోర్‌గ్రూప్ సమావేశంలో బీసీ నాయకులు ఆయనను ఈ పదవికి ఎంపిక చేశారు.ఈ సమావేశంలో రాష్ట్రంలోని బీసీ ఉద్యమ భవిష్యత్‌కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

## నేడు పలు జిల్లాల్లో వర్షాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.ఆసిఫాబాద్, మంచిర్యాల, జగత్యాల,సిరిసిల్ల, కరీంనగర్,భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి,ఖమ్మం,నల్లగొండ,వరంగల్,జనగామ,సిద్దిపేట,రంగారెడ్డి,హైదరాబాద్ తదితర జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది. 2రోజుల పాటు ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతాయని, ఆ తర్వాత క్రమంగా 2-3 డిగ్రీలు పెరుగుతాయని పేర్కొంది.

## డీలిమిటేషన్‌పై కేంద్రానికి తీర్మానం

>> పరస్పరం సమన్వయం చేసుకుంటూ.. భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు ఎంపీలతో కూడిన కమిటీ పని చేయాలని, ఇందుకు ప్రత్యేక కార్యాలయం ఢిల్లీలో ఏర్పాటు చేయాలని సదస్సులో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన సూచనను ఆందరూ అంగీకరించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి చరిత్ర.. వర్తమాన పరిస్థితులతో పాటు జనాభా దామాషా, ప్రొరేట్ ప్రకారం పునర్విభజన జరిపితే దక్షిణాది రాష్ట్రాలు, పంజాబ్,ఒడిశా నష్టపోయే తీరును సీఎం రేవంత్ రెడ్డి చెన్నై సదస్సులో వివరించారు. నియోజక వర్గాల పునర్విభజన చేపట్టినా లోక్‌సభ సీట్లు పెంచకుండా శాసనసభ సీట్లు పెంచుకునే అవకాశం రాష్ట్రాలకు కల్పించాలని చేసిన సూచన ప్రతి ఒక్కరిని ఆకర్షించింది. మహిళలకు 33 శాతం సీట్లు, ఎస్సీ,ఎస్టీ సీట్ల పెంపుపైనా చేసిన సూచనలు చాలా అర్థవంతంగా ఉన్నాయని సదస్సులో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా సోమవారం అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం పొందిన తర్వాత కేంద్రానికి పంపనున్నారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న జనాభా ఆధారిత లోక్‌సభ స్థానాల పునర్విభజన విధానంపై మా రాష్ట్ర శాసన సభలో తీర్మానం ఆమోదిస్తాం... మేం మా రాష్ట్రంలో ఎలా చేస్తున్నామో మీ మీ రాష్ట్రాల్లోనూ అలానే చేయాలని సహచర ముఖ్యమంత్రులు, ఇతర నాయకులకు చెన్నైలో సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. కాగా తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 27తో ముగియనున్నాయి.ఉగాది పండుగ తర్వాత లోక్‌సభ స్థానాల డీలిమిటేషన్ విధానానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో రేవంత్ సర్కార్ పెద్ద ఎత్తున సదస్సు నిర్వహించనుంది. దీనికి దక్షిణాది రాష్ట్రాలతో పంజాబ్,ఒడిశా రాష్ట్రాల నుంచి అన్ని పార్టీ నేతలను,ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తున్నారు. ఇదిలా ఉండగా, అసెంబ్లీలో ప్రభుత్వ తీర్మానం కోసం ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. అసెంబ్లీ అజెండా షెడ్యూల్ ప్రకారం పద్దులపై చర్చ, తర్వాత ప్రభుత్వ తీర్మానం, రెండు ప్రభుత్వ బిల్లులపై చర్చ ఆమోదం జరుగనున్నాయి.


## రహీం ఆగాఖాన్‌కు సిఎం రేవంత్ అభినందనలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 23: షియా ఇస్మాయిలీ ముస్లిం సమాజానికి 50వ వారసత్వ ఇమామ్‌గా,ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలను స్వీకరించిన యువరాజు రహీం ఆగాఖాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తెలంగాణలో చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణ, విద్య, స్థిరమైన అభివృద్ధి కోసం ఎకెడిఎన్ చేస్తున్న కృషి ఎంతో అమూల్యమైనదని ఆయన గుర్తు చేశారు. యువరాజు రహీంఖాన్ నాయకత్వంలో రాష్ట్రానికి ఎకెడిఎన్ సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మానవాళి సేవలో యువరాజు రహీంఖాన్ గొప్ప విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి అభిలషించారు.

### ముగ్గురు టాలీవుడ్ హీరోలు

## బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేసినట్లు ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌ల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు బహుభాషా నటుడు ప్రకాష్ రాజ్‌తో పాటు దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండతోపాటు యూట్యూబర్లు, టీవి నటులపై హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్ కమిషనరేట్లలో కేసులు నమోదవడం తెలిసిందే. ఇందులో యూట్యూబర్లు, టీవి నటుల్లో కొందరిని పంజాగుట్ట పోలీసులు విచారించగా సైబరాబాద్‌లోని మి యాపూర్‌లో నమోదైన కేసులో ఇంకా విచారణ మొదలుకాలేదు. కాగా బెట్టింగ్ యాప్‌లను సంబంధించి టాలీవుడ్‌కు చెందిన ముగ్గురు నటులపై రామారావు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఇందులో ఇద్దరు హీరోలు అగ్ర నటులు కాగా మరో హీరో మిడ్ రేంజ్ హీరోగా వుండడం గమనార్హం. దీనిపై పోలీసులు ఇంకా అధికారికంగా స్పందించలేదు.



## భద్రతా బలగాలపై మావోయిస్టుల మెరుపుదాడి

### నలుగురు జవాన్లకు తీవ్రగాయాలు

చర్ల, ప్రభాతవార్త: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భూపాలపట్నం జాతీయ ప్రధాన రహదారిపై గొర్లనల్ల గ్రామ సమీపంలో భద్రతా బలగాల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు మందుపాతర పేల్చారు. భద్రతా బలగాల రాకపై నిఘా పెట్టిన నక్సల్స్ ప్రధాన రహదారిపై ముందస్తుగానే మందుపాతరను అమర్చి ఆదివారం మధ్యాహ్నం ఈ దాడి ఘటనకు పాల్పడ్డారు. ఆ మందు పాతర పేల్చిన అనంతరం భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. ఇరువురి మధ్య కొద్దిసేపు కాల్పులు జరిగాయి. అనంతరం ఆ ప్రాంతం నుంచి మావోయిస్టులు వెను తిరిగారు. దాడి ఘటన తెలుసుకున్న బస్తర్ ఐజీ పీ.సుందర్‌రాజ్, బీజాపూర్ ఎస్పీ జితేంద్రయాదవ్, అదనపు బలగాలను ఘటన స్థలానికి పంపించారు. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గాయపడిన జవాన్లను జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

### దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేయడానికి వ్యవసాయ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించడానికి చర్యలు చేపట్టింది. ఇందుకు అర్హులైన రైతులను గుర్తించి వారికి సబ్సిడీపై పరికరాలను అందజేయనున్నది. దీని నిమిత్తం ధరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. పట్టా పాస్ పుస్తకం కలిగిన ఎస్సీ, ఎస్టీ, జనరల్, మహిళలు మాత్రమే అర్హులు. ఇక ఎస్సీ, ఎస్టీ, రైతులకి 50 శాతం రాయితీ, జనరల్ రైతులకి 40 శాతం రాయితీ, అందించబడుతుంది. రూ.1 లక్ష లోపు లబ్ది పొందు రైతులు కనీసం ఒక ఎకరం లోపు భూమి కలిగి ఉండాలి. రూ.1 లక్ష లేదా అంతకన్నా ఎక్కువ లబ్ది పొందు రైతులు ఖచ్చితంగా ఒక ఎకరం భూమి కలిగి ఉండాలి. ఇక వ్యవసాయానికి సంబంధించి నాప్‌సాక్ స్ప్రేయర్, బ్యాటరీ స్ప్రేయర్, రోటవేటర్, సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్, పవర్ టిల్లర్ తదితర వ్యవసాయ పరికరాలను మంజూరు చేయనున్నారు. ధరఖాస్తు చేసుకున్న అనంతరం మండల స్థాయిలో నియమించిన కమిటీ సమక్షంలో లబ్దిదారుల ఎంపిక జరుగుతుంది. ఈ కమిటీకి కన్వీనర్‌గా మండల వ్యవసాయాధికారి, సభ్యులుగా తహసీల్దారు, ఎంపిడిఒలు వ్యవహరిస్తారు.



## మట్టి తవ్వకాలు, డీవాటరింగ్ వేగవంతం

### నిరంతరాయంగా కొనసాగుతున్న సహాయకచర్యలు

నాగర్ కర్నూల్ ప్రతినిధి, మార్చి 23, ప్రభాతవార్త: నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదివారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో టన్నెల్ లోపల కొనసాగించవలసిన సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్ చర్చించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ టన్నెల్ లోని డి 1, డి 2 ప్రదేశాలలో మట్టి తవ్వకాలు, ఊట నీటిని బయటకు పంపే ప్రక్రియ నిరంతరాయంగా, వేగంగా జరుగుతున్నాయని, సహాయక బృందాలు పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. టన్నెల్‌లో అత్యంత ప్రమాద ప్రదేశంగా భావిస్తున్న ప్రాంతంలో తప్ప మిగిలిన ప్రదేశాలలో సహాయక పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు సంఘటన జరిగిన నాటి నుండి అవిశ్రాంతంగా ప్రతికూల పరిస్థితుల్లో 24 గంటల పాటు సహాయక చర్యలలో పాల్గొంటూ టన్నెల్ లోపల ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు జిల్లా యంత్రాంగం, సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్న తీరును జిల్లా కలెక్టర్ అభినందించారు. టిబిఎం కత్తిరించిన భాగాలను పక్కకు తొలగిస్తూ వాటర్ జెట్ ద్వారా బురదను తొలగిస్తూ, ఎక్స్‌వేటర్ ద్వారా మట్టిని కన్వేయర్ బెల్ట్, గుండా బయటికి తరలించే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. సహాయక బృందాల వారిగా అప్పగించిన పనిని వారు విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ ,దక్షిణ మధ్య రైల్వే బృందాలు నిరంతరం శ్రమిస్తున్నట్లు వివరించారు. ప్రమాద ప్రదేశం వరకు పూర్తిస్థాయిలో విద్యుత్, వెంటిలేషన్, పనులను పునరుద్ధరించినట్లు తెలియజేశారు. సహాయక చర్యల్లో నిరంతరం పాలు పంచుకుంటున్న సహాయక బృందాలకు కావలసిన సదుపాయాలను వసతులను పర్యవేక్షిస్తూ వారికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

# ఎల్ అండ్ టి అధీనంలో ఉన్నప్పుడే దెబ్బతిన్న మేడిగడ్డ

### కాఫర్‌డ్యామ్ నిర్మాణ వ్యయం పెంచి నిధుల దుర్వినియోగం

### నీళ్లు నింపిన మొదటి సీజన్‌లో కొట్టుకుపోయిన అఫ్రాన్ సిసి బ్లాకులు

### 17 మందిపై క్రిమినల్ చర్యలకు విజిలెన్స్ సిఫార్సులు

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: ఎల్ అండ్ టి అధీనంలో ఉన్నప్పుడే మేడిగడ్డ బ్యారేజ్ శిథిలమవడం మొదలైంది. మొదటి సీజన్ పూర్తయ్యాక 11నవంబర్ 2019లో గేట్లు మూసిన తరువాత దిగువ అఫ్రాన్ సమీపంలోని సిసి బ్లాకులు కొట్టుకుపోయినట్లు గుర్తించారు. బ్యారేజ్ మరమ్మత్తు విషయంలోనూ నీటిపారుదల శాఖ అటు ఎల్ అండ్ టి సంస్థ ఉదాసీనత ప్రదర్శించారు. మేడిగడ్డ కుంగుబాటు తరువాత ఎల్ అండ్ టి ప్రమాదంతో తనకు సంబంధంలేదని బుకాయిస్తూ వచ్చింది. కానీ కాంట్రాక్టు సంస్థ బాధ్యత నుంచి తప్పించుకోలేని ఆధారాలు విజిలెన్స్ విచారణలో వెల్లడైనాయి. 20 ఫిబ్రవరి 2020లో ఎల్ అండ్‌టి కంట్రోల్ రూమ్ బ్యారేజీని నీటిపారుదలశాఖకు అప్పగించిందని ఆ సంస్థ పిఆర్‌ఓలో నీటి నిర్వహణ శాఖ అధీనంలో ఉన్నప్పుడు నష్టం జరిగిందని చెప్పడం తప్పని విజిలెన్స్ ఆధారాలతో పేర్కొంది. బ్యారేజీ నిర్మాణంలో జరిగిన లోపాలకు అక్రమాలకు కాంట్రాక్టు సంస్థ బాధ్యత వహించాల్సి ఉంటుంది . ఎదువబ్లాకులో ఎగువన దిగువన సీకెంట్ పైల్ అమర్చిన విధానం జాప్యం జరిగిన విధానం నివేదికలో సవివరంగా పేర్కొన్నారు. సిడిఓ డ్రాయింగ్ ప్రకారం పనులు చేశామని సంస్థ చెప్పడం తప్పని ఆ సంస్థ తనకు అనుకూలంగా డ్రాయింగ్స్ మార్చడంలో పాత్ర ఉందనడానికి ఆధారాలతో సహా వివరించింది. 5 ఏప్రిల్ 2018లో కాఫర్‌డ్యామ్ తొలగింపుకు అంగీకరించి నీటిని నిల్వచేయడానికి ముందు దానినితొలగించలేదని కాఫర్ డ్యామ్ తొలగింపుకు అనుమతి ఇవ్వలేదని కాంట్రాక్టు సంస్థ అనడం అసత్యమని విజిలెన్స్ వివరించింది. కాఫర్‌డ్యామ్ తొలగించకపోవడం కూడా నీటి ప్రవాహ తీవ్రతలో మార్పుజరిగి కుంగుబాటుకు కారణమైంది. వ్యర్థపదార్థాలు తొలగించినీటిప్రవాహం వెళ్లేలా చేయాలనే అంశం కాంట్రాక్టు సంస్థకు తెలుసని విజిలెన్స్ నివేదించింది.15 మార్చి 2021లో పని పూర్తయినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన కంప్లీషన్ సర్టిఫికెట్ వెల్లువడవని పేర్కొంది. కాఫర్ డ్యాం వ్యయం కూడా తొలుత 12.95కోట్లుగా నిర్ణయించారని రెండోసారి సవరించి కాఫర్‌డ్యామ్ అంచనా వ్యయం 61.21 కోట్లకు పెంచారని విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నారు. 9డిసెంబర్ 2019లో ఇలా పెంచారని పేర్కొన్నారు.ఇది ప్రభుత్వ నిధులను అపహరించే ఉద్దేశంతో చేసినదే అని పేర్కొన్నారు.

**17 మందిపై క్రిమినల్ చర్యలకు విజిలెన్స్ సిఫార్సులు**

విజిలెన్స్ విచారణలో 17 మంది అధికారులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు చేయాల్సి ఉంటుందని విచారణ అధికారులు తేల్చిచెప్పారు. ఇఎన్‌సి జనరల్ గా పనిచేసి పదవి విరమణ పొందిన సి.మురళీధర్, ఒ అండ్ ఎం రిటైర్డు ఇఎన్‌సి బి.నాగేందర్‌రావు, సిఇ టి.శ్రీనివాస్, వర్క్స్ అకౌంట్ డైరెక్టర్ వి.ఫణిభూషణ్‌శర్మ, డిప్యూటి సిఇ ఎం.అబ్దుల్‌ఖాన్ కాళేశ్వరం రిటైర్డు ఇఎన్‌సి ఎన్ వెంకటేశ్వర్లు , కాళేశ్వరం సిఇ కె.సుధాకర్‌రెడ్డి, మేడిగడ్డ ఇఇ ఎస్ఇ గా పనిచేసి ప్రస్తుతం మహబూబ్‌నగర్ సిఇగా ఉన్న బి.వెంకటరమణరెడ్డి, రిటైర్డు ఇఇ సర్దార్ ఓంకార్‌సింగ్, మేడిగడ్డ ఇఇ సిహెచ్ తిరుపతిరావు, నాణ్యతనియంత్రణ విభాగం రిటైర్డుసిఇబి బి.వెంకటేశ్వర్లు, వి.అజయ్‌కుమార్, క్యూసి సిఇ పిఎ వెంకటకృష్ణ, క్వాలిటీకంట్రోల్ ఇఇ ఎం రఘురాం,సిడిఓ రిటైర్డు ఇఎన్‌సి ఎ.నరేందర్‌రెడ్డి, సిడిఓ ఎస్ఇ కెఎస్ఎస్ చంద్రశేఖర్, సిడిఓ ఇఇగా పనిచేసిన ఎస్ఇ హెచ్ బసవరాజ్‌లను ప్రాసిక్యూషన్ చేయాలని సూచించారు.పదవి విరమణ పొందిన వారికి పెన్షన్ రూల్ ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నారు.



**డిపార్టుమెంట్ చర్యలు**

మేడిగడ్డ నిర్మాణంలో ఉదాసీనంగా వ్యవహరించిన 22 మంది వివిధ స్థాయి కులకు చెందిన ఇంజనీర్లపై శాఖపరమైన చర్యలకు తీసుకోవడంకు సిఫార్సు చేశారు. రిటైర్డు సిఇ జి.హరిహరరావు,డిప్యూటీ ఎస్ఇ ఎన్ సత్యనారాయణ, డిఇఇ బానోతునంద, డిఇఇ అబ్జర్ సురేశ్‌కుమార్,డిఇఇ ఎల్ భీమరాజు, ఎఇఇలు పలేషేక్, బి.శ్రీనివాస్, ఎరవెలంత్, ఆర్ విజయ్, గంగాధర్, ఎం ప్రసాద్, బిఇపిష్, ఎ.కృష్ణమోహన్, జి.కృష్ణారెడ్డి, ఇ.సుకుమార్, పిత్రవణేకుమార్ డిఇ ఎరాజు, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ రిటైర్డు ఎస్ఇ సి.గంగాధర్, ఎస్ఇ కె. దేవేందర్‌రెడ్డి డిఇఇ బి.కిరణ్‌కుమార్‌రెడ్డి, టి.హేమలతను విజిలెన్స్ విచారణలో బాధ్యులుగా గుర్తించారు.

## హైకోర్టులో ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు

### ఫోన్‌ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

### కౌంటర్ దాఖలు చేయనున్న పోలీసులు

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మొదటి ముద్దాయి గా వుండి ఎవరికి ఫైగా అమెరికాలో వున్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అనూహ్యరీతిలో హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు ఇంతకు ము ందు నాంపల్లి కోర్టులో తనపై నమోదైన కేసుకు సంబంధించి విచారణకు హాజరయ్యేందుకు గడువు కావాలని పిటిషన్ దాఖలు చేసిన ప్రభాకర్ రావు ఈసారి ఏకంగా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తాను అమాయకుడినని, తనను అన్యాయంగా ఇందులో ఇరికించారని, తాను ఏ తప్పు చేయలేదని ప్రభాకర్ రావు తన పిటిషన్‌లో తెలిపారు. తనపై కావాలనే ఈ కేసును బలవంతంగా యించారని, ఇందులో నిందితులుగా వున్న నలుగురు పోలీసు అధికారు లు ఇచ్చిన వాంగ్మూలం మినహా తనపై మోపిన కేసులో పోలీసుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఆయన పేర్కొన్నారు. గతంలో తాను మావోయిస్టు, ఉగ్రవాద వ్య తిరేక విభాగాల్లో సుదీర్ఘకాలం పనిచేశానని, తనకు ఉగ్రవాదులతో పాటు నక్సలైట్ల నుంచి ముప్పు వుందని ఆయన తెలిపారు. తాను అమెరికాకు పారిపోలేదని, అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆ దేశానికి వెళ్లానని ఆయన తెలిపారు. క్యాన్సర్‌తో పాటు ఊపిరితిత్తుల వ్యాధితో తాను బాధపడుతు న్నానని, ఇలాంటి పరిస్థితి ల్లో తనపై అక్రమంగా కేసు నమోదు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పోలీసుల విచారణకు తాను సహకరిస్తానని, తనకు వెంటనే ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ప్రభాకర్ రావు హైకోర్టును కోరారు. కాగా ఆయన పిటిషన్‌పై ఈ నెల 24వ తేదీన హైకోర్టులో విచారణ జరగనుంది. మరోవైపు ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై పోలీసులు ఒకటి రెండు రోజుల్లో హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయనున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు నిందితుడని, ఈ కేసు వెలుగుచూడక ముందే అన్ని విషయాలను ముందుగానే తెలుసుకున్న ఆయన అమెరికాకు పారిపోయారని, విచారణకు ఎన్నిసార్లు పిలిచినా సమాధానం ఇవ్వలేదని, హైదరాబాద్‌లో వుంటున్న ఆయన బంధువులకు కూడా సమాచారం ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని పోలీసులు హైకోర్టుకు నివేదించనున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు జరిగిన విచారణ తాలూకు వివరాలు, ప్రభాకర్ రావు పాత్ర, ఆయనకు పోలీసు శాఖ నుంచి జారీ అయిన నోటీసుల వివరాలను కూడా పోలీసు శాఖ హైకోర్టుకు అందించనుంది.

## 'స్థానిక' ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

### కాంగ్రెస్ నేతల పిలుపు

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రజల సమస్యలను గుర్తించి,వాటి పరిష్కార మార్గాలు అన్వేషిస్తూ పనిచేయాలని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్" కార్యక్రమం లో భాగంగా ఆదివారం గాంధీ భవన్లో సికింద్రాబాద్ పరిధి లోని ఐదు నియోజకవర్గాల నాయకుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి డివిజన్ లోనూ స్థానిక నాయకులు పాదయాత్ర చేపట్టాలన్నారు. సంవత్సరమంతా ఈ జైబాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం చేయాలన్నారు. జనవరి 26, 2026 వరకు నిరంతరాయంగా జరుపుకుంటూ ప్రజల్లోకి వెళ్ళాలని ఆయన కోరారు.డా. కోట నీలిమ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పెంచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. రాజ్యాంగానికి బీజేపీ తూట్లు పొడుస్తోందని విమర్శించారు.అదే రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పాటుపడుతున్నదని అన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న సికింద్రాబాద్ కాంటోన్మెంట్ శాసనసభ్యులు గణేష్ మాట్లాడుతూ ఈ కేంద్ర కార్యక్రమం లో భాగంగా త్వరలో తన నియోజకవర్గం లో పాదయాత్ర చేస్తానన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

హన్మకొండ బ్యూరో, మార్చి 24, ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన ఆదివారం వసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పట్టి చేరాలు కథనం ప్రకారం... మండలంలోని సీతంపేటకు చెందిన బొక్క మహేష్ (20), దుర్గం పవన్ కళ్యాణ్ (22) ఇద్దరు మిత్రులు. వీరు తమ ద్విచక్ర వాహనంపై సీతంపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో వాసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ అతివేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి విషయం తెలిసిన ఇన్ స్పెక్టర్ పట్టి చేరాలు, ఎస్సైలు దేవేందర్, శీలం రవి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఎంజీఎం మార్చురీకి తరలించారు. అనంతరం ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. టిప్పర్ డ్రైవర్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు వెల్లడించారు.





# ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

### సూర్యాపేట జిల్లాలో ఘోరప్రమాదం

### ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతి.. ఆరుగురికి గాయాలు

ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట): సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుభ కార్యానికి వెళ్లి తిరిగి హైదరాబాద్ ప్రయాణిస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీ గూడెం గ్రామ శివారులో విజేత ఫైపుల కంపెనీ ముందు ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. ఆత్మకూరు ఎస్ మండలం కోటపహాడ్ గ్రామంలో శుభకార్యానికి హాజరై హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఖమ్మం ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టడంతో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంటాయపాలెం కు చెందిన గద్దం రవీందర్(34), అతని భార్య రేణుక(28), వారి కూతురు రిషిత(8) అక్కడికక్కడే మృతి చెందారు. కారు నుజ్జు నుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ఏడుగురు నలుగురు పిల్లల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రవీందర్ హైదరాబాద్‌లో నివాసముంటూ కార్ డ్రైవర్ గా జీవనం కొన సాగిస్తున్నాడు. శుభ కార్యానికి వెళ్లి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కదారి పుష్ప, గంధం మధు, కదారి హారిత, గంధం సాన్విక, గంధం గగన్ చందర్, గంధం మల్లికార్జున్, కదారి జస్విన్, గద్దం రిషి కృష్ణ గాయపడ్డట్లు పోలీసులు తెలిపారు. గాయపడ్డ వారికి చికిత్స చేస్తున్నారు. జరిగిన సంఘటన చూసేవారి హృదయాలను కలచివేసింది. జరిగిన సంఘటన తెలవడంతో చుట్టుపక్కల వారు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటన పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షి ంచారు. చివ్వెంల పోలీసులు విచారణ చేస్తున్నారు.





## నేటి నుంచి డిఇఇ సెట్-2025

### దరఖాస్తుల స్వీకరణ

#### మే 15 దరఖాస్తులకు తుదిగడువు

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: రాష్ట్రంలో రెండేళ్ల డీఈడీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే డీఈఈసెట్-2025కి సంబంధించిన దరఖాస్తులను నేటి(సోమవారం మార్చి24) నుంచి స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 21న జారీ చేసిన విషయం తెలిసిందే. దరఖాస్తులను నేటి నుంచి మే 15 వరకు స్వీకరించనున్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు. దరఖాస్తులో తప్పులను సరి చేసుకోవడానికి మే 17, 18 తేదీల్లో అవకాశం కల్పించినట్లు డీఈఈ సెట్ కన్వీనర్ జి రమేష్ ప్రకటనలో తెలిపారు. మే 25న ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. ఈ ఏడాది గత ఏడాది కంటే రెండున్నర నెలలు ముందుగానే నోటిఫికేషన్‌ను జారీ చేశారు. గత ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ జారీ చేయగా.. ఈ ఏడాది మార్చి 21న జారీ చేశారు. మే 20నహాల్ టికెట్లను జారీ చేయనున్నారు. మే 25న పరీక్షను నిర్వహిస్తారు. జూన్ 5న ఫలితాలను విడుదల చేయనున్నారు. జూన్ 7 నుంచి 11 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. జూన్ 13 నుంచి 16 వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 20న సీట్ల కేటాయింపు చేసి.. జూన్ 21 నుంచి 24 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించారు. జూలై 1 నుంచి మొదటిరోజు ఇన్‌స్ట్రక్షన్‌ను ప్రారంభించనున్నట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, డిఇఇ కన్వీనర్ రమేష్ తెలిపారు.

# ఫోర్టిఫైడ్ సన్నబియ్యం పిడిఎస్‌లో పంపిణీ

### సివిల్ సప్లయ్ కమిషనర్ డిఎస్ చౌహాన్

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: తెలంగాణలో ఫోర్టిఫైడ్ సన్నబియ్యం ఏప్రిల్ నెల నుంచి పంపిణీకి స్వీకారం చుట్టబోతున్నామని సివిల్ సప్లయ్ కమిషనర్ డిఎస్ చౌహాన్ తెలిపారు. ఆదివారం చత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ ఐఐఎంలో అంతర్జాతీయ నాయకత్వం సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో సివిల్‌సప్లయ్‌శాఖలో అక్రమాలు అరికట్టడతూ పారదర్శకత పెంచుతున్నామని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో కొత్త విధానాలు ఆచరిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు సకాలంలో అందిస్తున్నామని తెలిపారు. నాణ్యతకలిగిన సరుకులతో ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరిచామని తెలిపారు. 409కోట్ల రూపాయల విలువగల పిడిఎస్‌బియ్యం ఇప్పటి వరకు అక్రమ రవాణా జరుగకుండా పట్టుకొని సీజ్‌చేశామని తెలిపారు. గతంలో పోలీస్ తొమ్మిదిరెట్లు నిఘా పట్టుకొన్నామని వివరించారు. వరిధాన్యం సేకరణలో కూడా వాతావార్ సాంకేతిక పరిజ్ఞానం జోడించామని దీనితో స్కోచ్ అవార్డు 2024లో లభించిందని వివరించారు. పిలిప్పీన్స్ దేశంలో బియ్యం ఎగుమతి ఒప్పందాలు చేసుకొన్నామని తెలిపారు. తెలంగాణాలో ప్రతి రవాణా మార్గంలో వ్యయాలు తగ్గించే విధంగా రూపొందించి నిత్యవసరవస్తువుల పక్కదారి పట్టకుండా నిఘా ఏర్పాటు చేసి 12 నుంచి 15కోట్ల రూపాయల ఆదా చేస్తున్నామని తెలిపారు. స్మార్ట్ చౌకధరల దుకాణం జనపోషక్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

## మావోయిస్టుల భారీడంప్ స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు



చర్ల, ప్రభాతవార్త : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని మర్కన్‌గూడ, మెట్టగూడ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాచిఉంచిన భారీ ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డ్యూటీ క్యాంపు పరిధిలోని మార్కన్‌గూడ అటవీ ప్రాంతంలో నక్సల్స్ ఆయుధ సంపతిని నిల్వ చేశారని సమాచారం అందుకున్న భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ఎక్కడికక్కడ మావోల డంప్‌ను గుర్తించి వెలికి తీశారు. ఈ సోదాల్లో ఆరు తుపాకులు, 18 బీజీఎల్ (బారెల్ గ్రనేడ్ లాంచర్) సెల్స్, సెల్‌ఫోన్లు, డిటోనేటర్లు, సెమీకండక్టర్ స్యూట్‌కేస్‌లు, ఇనుక ఊసలు, నక్సల్స్ సాహిత్యాలు, యూనిఫాంలు, కిట్ బ్యాగులు, ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మరియు మెట్టగూడ అడవుల్లో మరో డంప్ స్వాధీనమైంది. వీటిలో 3 తుపాకులు, 2 బీజీఎల్ రౌండ్లు, 6 కంట్రీమేడ్ రైఫిల్లు, 6 డిటోనేటర్లు, 100 గ్రాముల గన్‌పౌడర్, స్టీల్ పైపులు, నక్సలైట్ జెండాలు, కంట్రీమేడ్ బాంబు, మిక్సర్‌జార్, ఇతర వస్తువులను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆ ప్రాంతంలో మావోయిస్టులు డంప్‌ను ఏర్పాటు చేయడం వెనుక పెద్ద వ్యూహమే వున్నట్లు తెలుస్తుంది. సెర్చ్ ఆపరేషన్‌కు వచ్చే భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని దాడి చేసేందుకే ముందస్తుగా పథకం ప్రకారం ఆ ప్రాంతంలో దాచి ఉంచినట్లు తెలిసింది. ఈ సోదాల్లో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, 203 కోబ్రా కార్ప్స్ మరియు 131 కోబ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో సోదాలు చేశారు.

## పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

### సమర్థ వినియోగానికి చర్యలు

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త : రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ ఏర్పడుతున్న దృష్ట్యా సమర్థవంతమైన వినియోగానికి కేంద్రం చర్యలు చేపట్టింది. ఈ వేసవిలో భారతదేశం రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్‌ను ఎదుర్కొంటున్నందున, కేంద్ర ప్రభుత్వం ఇంధనసామర్థ్యంతమైన శీతలీకరణ పరిష్కారాలను కోసం తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఎయిర్ కండిషనర్ తయారీదారులను 5స్టార్ రేటెడ్ మోడళ్ల స్వీకరణను వేగవంతం చేయాలని కోరింది, విద్యుత్ వినియోగాన్ని తగ్గించడంలో మరియు గ్రిడ్ స్థిరత్వాన్ని నిర్ధారించడంలో వారి కీలక పాత్రను నొక్కి చెబుతుంది. భారతదేశంలో ఎయిర్ కండిషనింగ్ కోసం డిమాండ్ పెరుగుతుంది.

వార్త

ఆశలకు, శక్తిసామర్థ్యాలకు మధ్య అగాధం ఉంటుంది. దాన్ని అర్థం చేసుకున్నవారు ఎప్పుడూ సుఖపడతారు.

-గాథే

# ట్రంప్‌కు పగ్గాలెప్పుడు?


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అమలు చేస్తున్న, తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ దేశాలను నివ్వెరపరుస్తున్నాయి. ఓపక్క న్యాయస్థానాల్లో ఇటీవల అమలుచేసిన అన్ని నిర్ణయాలపైనా చురకలువేసి వాటన్నింటిపైనా బాధితులకు ఉపశమనం కల్పించినప్పటికీ ట్రంప్ వైఖరి మాత్రం మారలేదు. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నామని చెప్పిన ట్రంప్ విడతల వారీగా అందరినీ వారివారి దేశాలకు పంపిస్తున్న సంగతి తెలిసిందే. జన్మతఃపౌరసత్వ హక్కును రద్దుచేసి న్యాయస్థానంలో మొట్టికాయలు తిన్నారు. సైన్యంలో ట్రాన్స్‌జెండర్ల నియామకాలు, క్రీడల్లో ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష చూపించారంటూ ఆయనపై పలు కేసులు దాఖలయ్యాయి. ఇక తాజాగా తనఅనుంగు మిత్రుడు, బిలియనీర్ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌కు కష్టం వస్తే చాలు తనకు కష్టమొచ్చిందన్నట్లుగా ట్రంప్ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆయనకు ఉన్న టెస్లా కార్ల సంస్థపై ఎవరు దాడులుచేసినా వారికి 20 ఏళ్ల జైలుశిక్ష అంటూ న్యాయస్థానాల కంటే ముందుగా ఆయనే శిక్షలు కూడా నిర్ణయించేసారు. ట్రంప్ నియమించిన డోజ్‌కు ఛీఫ్‌గా ఉన్న మస్క్ వేలాదిమంది ఉద్యోగులపై వేటువేసారు. ప్రభుత్వశాఖల్లో ఉద్యోగులపైనా కఠిన కార్యాచరణఅమలు చేసారు. మీరేం పనిచేసారో చెప్పాలంటూ వారికి ఇమెయిల్స్ పంపించడంతో ఈ ఉదంతంకూడా న్యాయస్థానాలకు పోయింది. ఇక దేశంలో ప్రక్షాళన, వృథా వ్యయం అరికట్టే నెపంతో చేపట్టిన కార్యాచరణ ఓపక్క కొనసాగుతుంటే మరోపక్క విదేశాల నుంచి వచ్చి నివసిస్తున్నవారిపైనా కార్యనిర్వాహక ఉత్తర్వులపేరిట మరో వెన్నుపోటు పొడిచారు. నిజానికి ఏదేశంలో అయినా అనిశ్చితి, అంతర్యుద్ధం వంటివాటితో భయపడి ఇతర దేశాల్లో ఆశ్రయం పొందాలని వచ్చినవారికి అమెరికా వెసులుబాటు కల్పిస్తున్నది. అందుకు ఆ రాజ్యాంగంలోనే పొందుపరిచారు. అమెరికా గుర్తించిన కొన్ని దేశాల పౌరులు రెండేళ్లపాటు అమెరికాలో ఉంటూ ఉపాధి పొందవచ్చు. అయితే ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకుని అక్రమ వలసదారులు పెరిగిపోయారని ట్రంప్ భావించారు. ఇప్పుడు వారిపైనా వేటువేసారు. తాత్కాలిక నివాస హోదాను రద్దుచేస్తు ఉత్తర్వులు విడుదలచేయించారు. డిపార్టుమెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఈమేరకు ప్రకటన జారీచేసింది. క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజులా దేశాలకు చెందిన లక్షలాది మంది వలసదారులకు ఈ నిర్ణయం వల్ల చట్టపరమైన రక్షణ కరువవుతుంది. నెలరోజుల్లో వారందరినీ దేశం నుంచి బహిష్కరించనున్నట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. గడచిన మూడేళ్లుగా అంటే 2022 అక్టోబరు తర్వాత ఆ దేశాల నుంచి అమెరికాకు వలసదారులుగా వచ్చిన సుమారు 5.32 లక్షలమందికి ఇప్పుడు ఈ ఉత్తర్వులు అమలవుతాయి. ఖచ్చితంగా వారిపై బహిష్కరణ వేటు పడుతుంది. వీరంతా ఇతరుల సాయంతో అమెరికాకు వచ్చారని, మానవతాదృక్పథంతో కూడిన పెరోల్‌పై వీరంతా తాత్కాలిక ఉపాధిపొందుతూ రెండేళ్లపాటు అమెరికాలో నివసించేందుకు తాత్కాలిక అనుమతులు మాత్రమే పొందినట్లు అమెరికా వలసల విభాగం చెపుతోంది. వీరందరిపైనా వచ్చేనెల 24 లేదా ఫెడరల్ రిజిస్టరులో నోటీసులు ప్రకటించిన 30 రోజుల తర్వాత అమెరికాలో ఉండేందుకు న్యాయపరమైన హోదాను కోల్పోతారు. ఎన్నికల ప్రచారంలోనే 'హ్యుమానిటీ పెరోల్' పేరిట ఇచ్చే ఈ తాత్కాలిక సదుపాయం భారీగా దుర్వినియోగం అవుతోందని, తాను అధికారంలోకి రాగానే చెక్ పెడతానని ట్రంప్ ప్రకటించారు. అమెరికాలో సుదీర్ఘ కాలంగా అంటే ట్రంప్ రాజకీయాల్లోకి రాక కొన్ని తరాల ముందు నుంచే ఈ వెసులుబాటు ఉంది. యుద్ధం, రాజకీయ అస్థిరత, అంతర్యుద్ధాలతో సతమతం అవుతున్న దేశాల్లోని ప్రజలు అమెరికాలో తాత్కాలికంగా నివసించి ఉపాధిపొందేందుకు వీలుగా నేరుగా అధ్యక్షుడే వీరికి చట్టపరమైన హోదా ఇస్తారు. ఇప్పుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత హోంల్యాండ్ సెక్యూరిటీ అక్రమ వలసలతోపాటు ఈ హ్యుమానిటీ పెరోల్‌పైనా దృష్టిసారించింది. మొత్తం నివేదికలు క్రోడీకరించి మస్క్‌చీఫ్‌గా ఉన్న డోజ్‌కు పంపించిందో ఏమోకానీ వీరందరిపైనా ఇక ఏప్రిల్‌నెలాఖరు నుంచి వేటుపడుతోంది. అమెరికాను వీరంతా వీడి వెళ్లిపోవాల్సి ఉంటుంది. నిజానికి ఈవీసా పొందినవారు రెండేళ్లు ముగిసిన తర్వాత కొనసాగాలంటే శరణార్థిగా కానీ లేదా వీసాకోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. ఇప్పుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దరఖాస్తుల ప్రక్రియ మొత్తం నిలిపివేసారు. వీటిపైనా ఫెడరల్ కోర్టుల్లో లెక్కలేనన్ని పిటిషన్లు దాఖలు అయ్యాయి. అమెరికా ఫస్ట్, అమెరికన్ ఫస్ట్ నినాదాన్ని పదేపదే గుర్తుచేస్తున్న ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అన్న నినాదంతో మొత్తం రిపబ్లికన్ అమెరికన్ల గుండెల్లో నిలిచిపోయారు. దీనితో ఇతర దేశాలవారు వలసలు వచ్చితమ ఉపాధికి గండికొడుతున్నారన్న దుగ్ధ అమెరికన్లలో పెరిగిపోతోంది. అందుకే తుపాకీ సంస్కృతి కూడా పెరిగిపోయింది. అమెరికా ఆవిర్భావమే వలసల రాజ్యంగా వచ్చిందన్న అంశాన్ని ట్రంప్ విస్మరిస్తున్నారు. పాలకులే కొన్ని తరాలకు ముందు వలసలు వచ్చిన సంగతి ఆయనకు తెలియందీ కాదు. కానీ ఆయన కొనసాగిస్తున్న ఈ అనిశ్చితి కార్యాచరణ వల్ల లక్షలాదిమంది ఇప్పుడు దేశం వీడి వెళ్లాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ట్రంప్ దూకుడును కట్టడిచేసే చర్నకోల ఝుళిపించకపోతే రానురాను అమెరికా నియంతరాజ్యంగా మారిపోయే ప్రమాదం ఉంది. కొంతలో కొంత అక్కడి ఫెడరల్‌కోర్టులకు మాత్రమే ట్రంప్‌ను కట్టడిచేయగలిగే సామర్థ్యం ఉందని చెప్పుకోవాల్సిన తరుణం మళ్లీ వచ్చింది.

వినడంలో మనిషి తొందర పడాలి, కానీ మాట్లాడటంలో తొందర పడకూడదు.



జేమ్స్ జ్యూడిత్

కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మ గౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

# ప్రజావాక్కు



### సినిమాలు వివాదాస్పదం కారాదు

ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ జీవిత ఘట్టాలతో రాసినఒక చారిత్రాత్మక నవలఆధారంగా నిర్మించిన ఛావా సినిమా చుట్టూ తొలుత వివాదం రాజుకుని నాగ్‌పూర్‌లో గత సోమవారం చెలరేగిన హింసలో 33మంది పోలీసులు, ఐదుగురు పౌరులు గాయపడగా రెండు బుల్డోజర్లతో సహా అనేక వాహనాలకు దుండగులు నిప్పంటించారు. ఈఘటనల వెనుక ముందస్తు పథకం ఉన్నదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి అంటున్న మాటలు వాస్తవమేనా?. కానీ ఈ నెల మొదటి వారంలో సమస్య రాజుకున్నప్పటి నుండి ఇంటిలిజెన్స్‌వర్గాలు, పోలీసులు ఏం చేశారు? దుండగుల కదలికలను అంచనా వేయటంలో ఎందుకు విఫలమయ్యారు?. ఏదిఏమైనా చరిత్రను ఆధారంగా చేసుకొని నిర్మించినట్లు చెబుతున్న ఈ సినిమా ఈ విధంగా వివాదాస్పదం కావడం చాలా బాధాకర విషయం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### పర్యావరణ పరిరక్షణపై దృష్టిసారించాలి

సుప్రీం కోర్ట్ ఇటీవల ఒక తీర్పును ఇస్తూ పర్యావరణ పరిరక్షణ ఎంత అవసరమో పారిశ్రామిక అభివృద్ధి అంతే అవసరం అనితేల్చింది. అయితే అభివృద్ధి అన్ని దేశాలకు అవసరమే. అన్నిప్రాంతాలకు అవసరమే. అయితే అభివృద్ధి కాసారాలను విషకాసారాలుగా మార్చకుండా ఎక్కువ మందికి ఉద్యోగఉపాధి అవకాశాలు కల్పించేవిధంగా ఉండాలి. ఉదాహారణకు గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేస్తూ స్వయం సహాయక బృందాలద్వారా అభివృద్ధి జరిగేట్టుగా చూడాలి. ఇక అంత మాత్రమే కాదు. ఆ అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలలో ఒకే విధంగా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

### పెన్షన్ ఫండ్ చెల్లించాలి

కోల్ ఇండియా, సింగరేణి బొగ్గగని అధికారులకు కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా దాదాపు ఐదు లక్షల మందికి పింఛన్ చెల్లిస్తున్నారు. అధికారులు, కార్మికుల వద్ద బేసిక్ నుంచి ఏడు శాతం వసూలు చేసి యాజమాన్యాలు ఏడుశాతం కలిపి పెన్షన్ ఫండ్‌కు జమ చేసున్నారు. పదవి విరమణ తర్వాత వారి బేసిక్, మారేడు కరువు భత్యంపై ఇరవై శాతం పెన్షన్ చెల్లిస్తున్నారు. చెల్లింపుల మధ్య ఆంతర్యం పెరుగుతుంది.

- ఎ.వేణుమాధవ్, హైదరాబాద్

### ప్రజల సమస్యలు పట్టించుకోండి

రెండువేలపధ్నాలుగులో కేంద్రప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి దేశంలోని దాదాపు డబ్బై లక్షల మంది ఐ.పి.ఎస్95 స్కీంలో రిటైరైన ఉద్యోగులు తమకు కనీసపెన్షన్ను రూ.7,500కు పెంచమని అనేక అర్జీలుచేసుకున్నా, పార్లమెంటులో అనేకసార్లు ఈ ప్రస్తావన ఎమ్.పి.లు పదేపదే తీసుకొచ్చినా, హేమమాలిని మొదలగు ఎమ్.పి.లు ప్రధానినికలసినా, వారెన్ని వాగ్దానాలు చేసినా, ఈ పదేళ్ల శ్రమ, పోరాటాలు, నిరాహార దీక్షలు ప్రభుత్వ హామీలు అన్నీనీటి మాటలయ్యాయి. ఈ మధ్య ఫిబ్రవరి 28న జరిగిన ఇ.పి.ఎఫ్.ఓ. మీటింగులో ఈ ఐ.పి.ఎస్. ఫించను పెంపుదలను నిర్ణయిస్తారని వార్తలొచ్చినా అదీ జరుగలేదు. అంతకు ముందు లేబర్ మినిస్టరు నేషనల్ ఏజిటేషన్ కమిటి లీడర్లను పిలిచి మీరు ఇక ఆందోళనలను చేయకండి, పెన్షను పెంపుదల ఆలోచన ప్రభుత్వానికి ఉందని కల్లబొల్లి కబుర్లు చెప్పారు. మరల దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయడానికి ఈ వయోవృద్ధులైన అభాగ్య రిటైరీలు సన్నద్ధం అవుతున్నారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### గురుకులాలపై అధ్యయనం అవసరం

తెలంగాణ రాష్ట్రంలో ఉంది ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలపై అధ్యయనం అవసరం. గురుకులాలలో అమలులో ఉన్న కోర్సులు, ఎక్కడసాంక్షన్ అయితే అక్కడ ఉండే విధంగా చూడాలి. ఇంటర్మీడియట్లో సామాజిక శాస్త్రాలను కూడా ప్రవేశ పెట్టాలి. పార్ట్ టైం టీచర్ల సమస్యలు, నైట్ స్టడీ సమస్యలు, వికలాంగులైన టీచర్స్, లెక్చరర్స్ సమస్యలు, వసతి గృహాల కేటాయింపులు, డిప్యూటీ వార్డెన్ విధులు, స్టేట్ సిలబస్, సెంట్రల్ సిలబస్, గురుకులాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సెలవులు, అమలు విధానం, సమయపాలన పాటించని సిబ్బంది, ఉద్యోగులు వాడుకున్నసెలవులు, వంటి విషయాలపై 2025–2026 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి గురుకులాలలోని లెక్చరర్‌లచేత అధ్యయనం చేయించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### మండలి సభ్యుల వల్ల ఏమి ప్రయోజనం?

ప్రభుత్వపాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఈ శాసనమండలి సభ్యులవల్ల ఏమీ పెద్దగా ప్రయోజనం ఉండదు. ముఖ్యమంత్రి ఏం తలుచుకుంటే అదే అవుతుంది. శాసనమండలి సభ్యులు మంచి ఆలోచనాలు ముఖ్యమంత్రికి అందించలేరు. ఒకవేళ ఇచ్చినా ముఖ్యమంత్రులు వినరు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఉపాధి లేమికి ఏదీ సరైన పరిష్కారం!

**నిరుద్యోగానికి, ఉపాధి లేమికి కారణమైన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవటం లేదు. సమగ్ర భూసంస్కరణలు అమలు జరిపి పేదలకు భూమి లభించినప్పుడే గ్రామీణ నిరుద్యోగం తగ్గుతుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలకు అనుగుణమైన పారిశ్రామిక అభివృద్ధి జరగటం ద్వారా దేశంలో నిరుద్యోగ సమస్య అదుపులోకి వస్తుంది. ఇలాంటి విధానాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకం. అందువల్లే దేశంలో నిరుద్యోగ సమస్య తగ్గటం లేదు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరుద్యోగ యువత, గ్రామీణ, పట్టణ పేదలు దేశవ్యాప్తంగా సమైక్యంగా ఉద్యమించాలి.**

'స్వాతంత్ర్యం' వచ్చిందని చెబుతున్న దగ్గర నుండి యువత ప్రధానంగా ఎదుర్కొంటున్న ఉద్యోగ, ఉపాధి కల్పనలో పాలక ప్రభుత్వాలన్నీ ఉద్దేశపూరిత వైఫల్యం చెందాయి. గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలను తీర్చే ఉత్పత్తిపరిశ్రమలను నెలకొల్పకుండా, సామ్రాజ్యవాద దేశాలపరిశ్రమలకు కావాల్సిన ముడివస్తువులను, చిన్న చిన్న యంత్రాలను తయారు చేసే పరిశ్రమలు, సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలకు అనుగుణమైన కొన్ని బడా పరిశ్రమల స్థాపన అనేవిధానాలు నేటికీ అమలు జరుపుతూ వస్తున్నాయి. ఫలితంగా పారిశ్రామిక అభివృద్ధిలోనూ, ఉద్యోగ, ఉపాధికల్పన వైఫల్యంలో దేశం కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ప్రచారంలో పాలక పార్టీలు, ఏర్పడిన ప్రభుత్వాలు దేశంలో నిరుద్యోగ, ఉపాధి సమస్యను పరిష్కరించి యువతకు మంచి భవిష్యత్తును అందించేందుకు, ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పే మాటలు, మాటలకే పరిమితంకాగా, నిరుద్యోగం మాత్రం పెరుగుతూనే ఉన్నది. జీవితం పట్ల యువతలో నిరాశ, నిస్పృహలు మాత్రం పెరుగుతూ ఉన్నాయి. పాలకుల విధానాల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గటంతో నిరుద్యోగశాతం పెరుగుతూ ఉంది. 1980లో ప్రపంచబ్యాంక్ డేటా ప్రకారం నమోదు అయిన నిరుద్యోగరేటు 2.8శాతంగా ఉంది. అందుకు కారణం ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయ రంగంలో ఉపాధి పొందటమే కారణమని పేర్కొంది. 1990లో సరళీకరణ ఆర్థిక విధానాల కాలంలో కార్మిక మార్కెట్లో తీవ్ర మార్పులు జరిగాయి. సరళీకరణ ఆర్థిక విధానాల ద్వారా సృష్టించబడిన పరిస్థితులు గ్రామీణ ప్రాంతం నుండి ప్రజలు ఉపాధికోసం నగరాలకు వలసలు పోయేలా చేసింది. అంతేకాకుండా నిరుద్యోగరేటు 2.8శాతం నుంచి 6శాతానికి పెరిగింది. నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాల కార్యక్రమాల మంత్రిత్వశాఖ నిర్వహించిన కార్మిక శక్తి సర్వేల ప్రకారం 2009–10లోఉపాధిరేటు 39.2శాతం నుండి2011–12లో 36.6శాతానికి పడిపోయింది. 2013–2014లో 5.42 శాతంగా ఉన్న నిరుద్యోగం కరోనా పరిస్థితుల కారణంగా 2020లో 8శాతం కాగా 2022లో 7.33శాతం తగ్గి, 2023లో 8.4శాతం పెరిగింది. 2024 మే నాటికి 6.3 శాతంగా ఉన్న నిరుద్యోగం అదే సంవత్సరం జూన్ నాటికి 9.2 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాలకన్నా, గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగం ఎక్కువగాఉంది. గ్రామీణ ప్రాంతంలోనే కాకుండా పట్టణ ప్రాంతంలో కూడా నిరుద్యోగం పెరుగుతూ ఉంది. 2024 మేలో 8.6శాతం ఉండగా, జూన్ నాటికి 8.9శాతానికి పెరిగింది. దేశవ్యాప్తంగా మహిళల విషయం చూస్తే పట్టణ ప్రాంతంలో ఉంటే, గ్రామీణ ప్రాంతంలో 17.1శాతం నిరుద్యోగులుగా ఉన్నారు. 48.6శాతం మహిళల నిరుద్యోగులతో జమ్మూ కాశ్మీర్ మొదటిస్థానంలో ఉండగా, కేరళ 46.6శాతంతో రెండవ స్థానంలో ఉంది. 39.4శాతంతో ఉత్తరాఖండ్ మూడవస్థానంలో, 35.9శాతంతో హిమాచల్‌ప్రదేశ్‌లు కొనసాగుతున్నాయి. పురుష నిరుద్యోగంలో కూడా 24.3శాతంతో కేరళ మొదటిస్థానంలో ఉండగా తర్వాత స్థానాలు ఒడిశా, రాజస్థాన్, హిమాచల్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలున్నాయి. భారతదేశంలో నిరుద్యోగం తాండవిస్తున్నదని అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐఎల్వో) మానవాభివృద్ధి సంస్థ (ఐహెచ్డీ) సంయుక్త అధ్యయనం వెల్లడించింది. 'భారత నిరుద్యోగ నివేదిక 2024లో పలు కీలక విషయాలను వెల్లడించింది. ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థికసలహాదారు విడుదలచేశారు. ఈ నివేదిక చదువుకున్నయువత ఉద్యోగాలు లేక నిస్సాహాయస్థితిలో ఉన్నారని తెలిపింది. 2022 నాటికి దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో 83శాతం యువకులేనని నివేదిక పేర్కొంది. దేశం మొత్తం నిరుద్యోగుల్లో చదువుకున్న యువత 2000 సంవత్సరం నాటికి 54.2శాతం ఉండగా 2022 నాటికి 67.7శాతానికి పెరిగింది. ఇదిదేశానికి తీవ్రసమస్యగా మారిందని నివేదిక చెప్పింది. ప్రస్తుతం నిరుద్యోగులైన యువ

బొల్లిముంత సాంబశివరావు



విద్యావంతుల్లో మహిళలు 67.7 శాతం ఉంటే, పురుషులు 62.2 శాతంగా ఉన్నారని నివేదించింది. ఇవన్నీ చెబుతూనే నిరుద్యోగాన్ని తగ్గించటంలో ప్రభుత్వాలే అన్ని చేయలేవని ప్రభుత్వ సలహాదారు నాగేశ్వర్ చెప్పటం కేంద్రప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేయటమే. భారత రాజ్యాంగంలో పని చేయగల వారికి ఉద్యోగ, ఉపాధి కల్పించటం ప్రభుత్వాల బాధ్యతగా పేర్కొంది. ఉద్యోగ కల్పనను ప్రభుత్వాలే పూర్తిగా చేయలేవని ఆయన చెప్పటం రాజ్యాంగ విరుద్ధం కాదా! ప్రభుత్వమే బాధ్యత వహించి పబ్లిక్, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించి ఉద్యోగుల, కార్మికుల హక్కులను పరిరక్షించాల్సింది కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలే. అందుకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక చట్టాల పేరుతో, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి, వారిని పారిశ్రామికవేత్తలకు బానిసలను చేయచూస్తున్నది. 2014లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రతిసంవత్సరం 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోడీనాయకత్వాన ఉన్న ఎన్డీఏ కూటమి వాగ్దానం చేసింది. మోడీనాయకత్వంలో ఉన్న ప్రభుత్వ పాలనకు 10సంవత్సరాల, 9నెలలు గడిచిపోయింది. ఎన్డీఏ వాగ్దానం ప్రకారం20 కోట్లకుపైగా ఉద్యోగాలు కల్పించాలి. చేసిన వాగ్దానం ప్రకారం ఉద్యోగాలు కల్పించకపోగా గత ఐదుసంవత్సరాల్లో 12 కోట్ల ఉద్యోగాలను కేంద్రప్రభుత్వం తీసివేసింది. ఉపాధి కల్పించానని చెప్పుకుంటున్న దానిలో కూడా సగం మంది యువతస్వయం ఉపాధి ద్వారానే ఉపాధి పొందారు. 2012తో పోల్చుకుంటే కేంద్ర పాలనలో నిరుద్యోగం మూడురెట్లు పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నిరుద్యోగం తీవ్రంగానే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగంతో యువత కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చేసిన యువత ఉద్యోగాలు లేక అల్లాడుతున్నారు. 2024 మే నెలలో లేబర్ బ్యూరో విడుదల చేసిన పీరియాడిక్లేబర్ఫోర్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) గణాంకాలు ఈ వాస్తవాన్ని వెల్లడించాయి. రాష్ట్రంలో నిరుద్యోగ రేటు 17.5శాతం నమోదు అయిందని సర్వే గణాంకాలు తెలిపాయి. ఇందులో పురుషుల నిరుద్యోగం 16.4శాతం కాగా, మహిళల నిరుద్యోగం 19.7శాతంగా నమోదైయింది. నిరుద్యోగంలో ఏపీ 10 వస్థానంలో ఉంది. మూడు పార్టీల కూటమి అధికారంలోకివస్తే20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఎటువంటి ఉద్యోగాలు భర్తీచేయలేదు. ఉద్యోగాలు భర్తీ చేయకపోగా, 2లక్షల, 60 వేలమంది వాలంటీర్లకు ఉపాధిని దూరం చేసింది. బేవరేజ్ కార్పొరేషన్లో పనిచేసే 20 వేల మంది ఉద్యోగులను చంద్రబాబు ప్రభుత్వం తొలగించింది. తెలంగాణలోనూ నిరుద్యోగంతో యువత అల్లాడుతున్నారు. 2023 ఎన్నికల ప్రచారంలో 2 లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలో భర్తీచేస్తానని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. జాబ్ క్యాలెండర్ల హామీ ఇచ్చింది. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా 2022 లెక్కల ప్రకారం తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగరేటు 34శాతంగా ఉంది. పట్టణప్రాంతంలో 65 శాతంగా ఉంది. తెలంగాణ ఏర్పడిన 10సంవత్సరాల్లో 60 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. చదువుకున్న 15–29 ఏళ్ల యువతలో ప్రతి నలుగురిలో ఒకరు నిరుద్యోగులుగా ఉన్నారు. త్వరలో 35వేల ఉద్యోగాలు భర్తీచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పే మాటలు కార్యాచరణలోకి రావటంలేదు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా రెండు లక్షల ఉద్యోగాల కల్పన ఆచరణలో విఫలమైంది. మోడీ నాయకత్వాన ఉన్న ఎన్డీఏ, తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్, ఏపీలో చంద్రబాబునాయకత్వాన ఉన్న మూడు పార్టీల కూటమి యువత ఓట్లను పొందేందుకు ఉద్యోగకల్పన అనే ఎరను ముందుపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తూనే ఉన్నాయి. నిరుద్యోగానికి, ఉపాధి లేమికి కారణమైన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవటం లేదు. సమగ్ర భూసంస్కరణలు అమలు జరిపి పేదలకు భూమి లభించినప్పుడే గ్రామీణ నిరుద్యోగం తగ్గుతుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలకు అనుగుణమైన పారిశ్రామిక అభివృద్ధి జరగటం ద్వారా దేశంలో నిరుద్యోగ సమస్య అదుపులోకి వస్తుంది. ఇలాంటి విధానాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకం. అందువల్లే దేశంలో నిరుద్యోగ సమస్య తగ్గటం లేదు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరుద్యోగ యువత, గ్రామీణ, పట్టణ పేదలు దేశవ్యాప్తంగా సమైక్యంగా ఉద్యమించాలి. •

# భద్రతా మండలిలో సంస్కరణలు జరిగేనా!

పంతొమ్మిదివందల నలభైఐదు అక్టోబర్ 24 న ఏర్పడిన ఐక్యరాజ్య సమితిలో, సమితి ఏర్పడిన నాటి నుంచి కేవలం ఐదు దేశాలు మాత్రమే శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్నాయి. దాదాపు సమితి ఏర్పడి 80 సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు శాశ్వత సభ్య దేశంగా 6వ దేశం ఏదీ చేరకపోవడం శోచనీయం. ఐక్యరాజ్య సమితిలో కనీసం 10 దేశాలకైనా శాశ్వత సభ్యత్వంఉండాలి. అగ్రరాజ్యం ఈ విషయంలో చొరవచూపాలి. ఐక్యరాజ్యసమితి మొత్తం అమెరికా చుట్టే తిరుగుతూ ఉంటుంది. అమెరికా తలచుకుంటే 6 వ, 7 వ దేశాలుగా భారత్, దక్షిణాఫ్రికా సిద్ధంగా ఉన్నాయి. మిగతా దేశాల మాటేమో కాని భారత్ చేరికపై ప్రయత్నాలు జరుగుతున్న, తెరపై పేరువచ్చినా కొన్ని రాజకీయాలు పొడచూపడం, ముఖ్యంగా చైనా, పాక్ అడ్డుపడటం తెలిసిందే. చైనా తన ప్రాభవం కోల్పోతాననే భయంతో ఉన్నట్లు కనిపిస్తోంది. పొరుగున ఉన్న పాక్‌కు భారత్‌కు శాశ్వత సభ్యత్వ విషయం సహించలేదు. ఆది భారత్ చేరకుండా రాజకీయం చేస్తుంది. ఆసియాలో నాదే పెత్తనం సాగాలి అనే ఆశ చైనాకు ఉంది. భారత్ చేరితే తన వాణి బొంగురు పోతుందని దాని భయం. రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ భారత్‌ను ఆహ్వానిస్తాయి. రష్యా మాత్రం భారత్ చేరికకు ఎప్పటికి మద్దతు ఉండనే ఉంటుంది. ఎన్నోసార్లు భారత్ భద్రతా మండలిలో చేరాలి అని ఊటంకించింది. భారత్ చేరిక గతంలో ట్రంప్ అధికారంలో ఉన్నపుడే జరగాల్సింది. ట్రంప్ ఇప్పుడు మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఉన్నారు. కనుక 6వ దేశంగా భారత్ చేరాలి అనే ప్రకటన చేయాలి. ఇప్పటికే ఎన్నో సంస్కరణలు చేస్తున్న ట్రంప్ భద్రతా మండలిని కూడా ప్రక్షాళన చేయాలి. ట్రంప్ మాట అన్ని దేశాలు శిరసా వహిస్తాయి. చైనా కొంచెం తాటాకు శబ్దాలు చేసినా

కనుమ ఎల్లారెడ్డి





ఆది ట్రంప్ ముందు పారదు. ఉక్రెన్‌కు, హమాస్‌కు కాల్పుల విరమణ ఆగాలి. శాంతికోసం మనం ప్రయత్నంచేయాలి అని ట్రంప్ ఉద్దేశంగా ఉంది. ఆ దిశలో ప్రయత్నాలు చేసినా, హమాస్ పెడ చెవిన పెడుతోంది. ఉక్రెన్ పూర్తిగా అమెరికా అదుపు, ఆజ్ఞలో ఉంది. ట్రంప్ మాట వినకపోతే ఇక హమాస్ కొన్ని చిక్కులు ఎదురుకొక తప్పదు. ఆది తెలిసే ఉక్రెన్ అధ్యక్షుడు జెలెన్ స్కి అమెరికా చెప్పినట్లు నడుచుకునే స్థాయికి వచ్చాడు. ఇక్కడ రష్యా కూడా ట్రంప్ చెప్పినట్లు కాల్పుల విరమణ ఆపాలి. రెండు దేశాలు కూడా విశ్వంలోనే పెద్దవిగా ఉన్నాయి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలు. ట్రంప్ రష్యా వైపే మొగ్గుచూపుతున్నారు. చిన్న దేశమైన ఉక్రెన్ అభివృద్ధిచెందాలన్నా, మౌలికవసతులు సమకుర్చుకోవాలన్నా అమెరికా అండ ఎప్పటికి ఉండాలన్నా అమెరికా చెప్పినట్లు నడచుకోవాలి. అదే ఉక్రెన్ దేశానికి ఉత్తమం. దేశాలు ఏకమైనా అమెరికాను ఏమి చేయలేవు. ఊరికే మాటలు దాడి తప్పితే ఏమి, ఏదీ ఏ దేశానికి చేత కాదు. అమెరికా చెప్పి చూస్తుంది. మాట వినకపోతే ఇక ఆ దేశానికి చుక్కలే. సుంకలా విషయం ఆయాదేశాల వాణిజ్య సంబంధం. దేశ రక్షణ విషయంలో మాత్రం అమెరికా తన మార్క్ చూపిస్తుంది. కనుక భద్రతా మండలిలో ఇక దేశాలు రాజకీయాలు ప్రక్కన పెట్టాలి. అమెరికా చొరవ తీసుకుంటేనే భారత్‌కు మార్గం సుగమం కావొచ్చు. ట్రంప్, మోడీ ఇద్దరూ స్నేహితులు కనుక భారత్ చేరికకు ఏ దేశం అడ్డు చెప్పే సాహసంచేయదు. ఒకవేళ ఏ దేశమైనా అడ్డుచెబితే అమెరికా సహించదు. భద్రతా మండలిని సంస్కరించడం ట్రంప్ తోనే సాధ్యం. అన్ని హంగులు భారత్‌కు ఉన్నా భద్రతా మండలిలో రాజ్యాల అనైక్యతతో చర్చకు వచ్చి మరుగున పడింది. ట్రంప్ రావడంతో 6 వ దేశం భారత్ చేరికకు ఏ డోకా ఉండదు. ట్రంప్ అధ్యక్ష పదవి నుంచి దిగిపోయే లోపు భారత్‌ను భద్రతా మండలిలో 6 వ దేశంగా చేరుస్తాడని నమ్ముదాం. రాబోయే కొద్ది నెలలలో కాని రెండు, మూడు సంవత్సరాలలో కాని భారత్ ఖచ్చితంగా భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చేరుతుందని ఆశిద్దాం. •

# మానవాళిపై పర్యావరణ ప్రభావం

భారతదేశంలో ఉష్ణోగ్రతల పెరుగుదల రూపంలో వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, గత కొన్ని దశాబ్దాలతో పోల్చుకుంటే దేశంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భవిష్యత్తులో ఇవి మరింత ప్రమాదకర స్థాయికి చేరే అవకాశం ఉంది. 1901 నుండి 2018 వరకు, భారతదేశ సగటు ఉష్ణోగ్రత దాదాపు 0.7 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. ఈ పెరుగుదల వడగాల్పులు, కరువు పరిస్థితులు, తీవ్రమైన వర్షపాతం వంటి విపరీత వాతావరణ సంఘటనలను ప్రోత్సహిస్తోంది. వడగాల్పులు భారతదేశంలో ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయి. డాక్టర్‌సౌమ్య స్వామినాథన్ ప్రకారం, వాతావరణ మార్పుల ప్రభావం ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, ఆర్థిక, సామాజిక రంగాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు, వృద్ధులపై ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా నీటి సంక్షోభం కూడా తీవ్రమవుతోంది. 2025 నాటికి భారతదేశం నీటి ఒత్తిడికి గురవుతుందని ఐక్యరాజ్య సమితి అంచనా వేస్తోంది. తలసరి నీటి లభ్యత ఏటా తగ్గిపోతున్నందున, తక్షణ చర్యలు అవసరమవుతున్నాయి. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు, పునర్వినియోగ ఇంధనాలపై దృష్టి సారించడం అవసరం. పర్యావరణ పరిరక్షణ చర్యలను చేపట్టడం, వాతావరణ మార్పులను తగ్గించే విధానాలను అమలు చేయడం అవసరం. ప్రజలందరూ కలిసి చర్యలు తీసుకుంటే, భవిష్యత్తులో వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించవచ్చు. 2024 సంవత్సరం ప్రపంచంలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డులకెక్కింది. ఈ సంవత్సరం గ్లోబల్ ఉపరితల ఉష్ణోగ్రతలు ప్రాక్కృతిక పారిశ్రామిక స్థాయిలకంటే 1.6శాతం పెరిగాయి. ఈ ఆందోళనకరమైన ట్రెండ్, వాతావరణ మార్పుల వేగవంతమైన ప్రభావాలను స్పష్టంగా చూపుతోంది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉత్పత్తి అతి తీవ్రస్థాయికి చేరుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, దీనిపై అప్రమత్తం చేస్తున్నారు. ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రధానంగా మనుషులచే ఉత్పత్తి చేసే గ్రీన్‌హౌస్ వాయువులు, ప్రకృతిక వాతావరణ మార్పుల కారణంగా ఏర్పడింది. 2024లో వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు 420పీపీఎమ్‌ను దాటి ప్రాక్కృతిక పారిశ్రామిక స్థాయిలైన 280 పీపీఎమ్‌తో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. వ్యవసాయం, ఎమిషన్ గ్యాస్ ఉత్పత్తుల ద్వారా మెథేన్, నైట్రస్ ఆక్సైడ్ కూడా ఈ వేడి పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ సంవత్సరం తీవ్ర వాతావరణ మార్పులు మానవ జీవితాలపై తక్షణ ప్రభావాలను చూపించాయి. యూరోప్ తన చరిత్రలోనే అత్యంత వేడి వేసవిని అనుభవించింది. ఇందులో కొన్ని నగరాల్లో ఉష్ణోగ్రతలు 45 శాతాన్ని మించినాయి. ఆసియాలో, భారత్, పాకిస్థాన్ వంటి దేశాల్లో తీవ్రమైన వేడి తరంగాలు వేలాదిమంది ఆరోగ్య సమస్యలకు గురిచేశాయి. ఈ దేశాల్లో 47 డిగ్రీల వరకు వేడిపెరిగింది. అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణ యూరోప్ వంటి ప్రాంతాల్లో అడవుల అగ్నిప్రమాదాలు తీవ్ర నష్టం కలిగించాయి. ఉష్ణోగ్రతల పెరుగుదల మానవ సమాజాలపై, పర్యావరణ వ్యవస్థలపై తీవ్రమైన ప్రభావాలను చూపుతాయి. ధ్రువ ప్రాంతాల మంచుకుప్పలు వేగంగా కరుగుతున్నాయి. ఇది సముద్ర మట్టాన్ని పెంచుతోంది. మియామి, జకార్తా, వెనిస్ వంటి తీరనగరాలు భారీ వరదలకు గురవుతున్నాయి. సముద్రజలాల ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల గొప్ప బారియర్ రీఫ్ వంటి సముద్ర జీవవైవిధ్య ప్రదేశాల్లో పుష్కలంగా ఉండే జీవులు ప్రభావితమయ్యాయి. వ్యవసాయ ప్రాంతాల్లో పొడిబారిన వాతావరణ పరిస్థితులు పంట ఉత్పత్తి తగ్గుదలకు దారితీశాయి. ఇది ప్రపంచ ఆహార భద్రతకు ముప్పుగా మారింది. వాతావరణ మార్పులకు పరిష్కారం ఇవ్వడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. గ్రీన్‌హౌస్ వాయువుల ఉత్పత్తిని తగ్గించడానికి సౌర, గాలివిద్యుత్ వంటి పునర్వినియోగ ఇంధనాలను ప్రోత్సహించాలి. అంతర్జాతీయ స్థాయిలో సహకారం ముఖ్యమైంది. ఎందుకంటే వాతావరణ మార్పులు సరిహద్దుల్ని దాటిపోయే సమస్య. 2024లో నమోదైన వేడిఉష్ణోగ్రతలు మానవాళికి ఒక హెచ్చరికగా నిలిచాయి. ఈ సమస్యను పరిష్కరించడంలో దేశాలకు సామర్థ్యం ఉన్నప్పటికీ, చర్యలు తీసుకోవడం అత్య వసరం. సమష్టిగా, నిర్దిష్టంగా వ్యవహరించి, వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను తగ్గించడానికి ప్రయత్నించాలి. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించడానికి మనం ప్రయత్నించాలి. భారతదేశంలో వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల అనేది మనసమాజానికి ఒక హెచ్చరిక. దీనిప్రభావం ప్రపంచవ్యాప్తంగా స్పష్టంగాకనిపిస్తున్నది. దీని పరిష్కారంగా మనం పర్యావరణ పరిరక్షణ చర్యలను సీరియస్‌గా తీసుకోవడం, పునర్వినియోగ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం అవసరం. అంతర్జాతీయ స్థాయిలో సమగ్రచర్యలు చేపట్టడం అత్యవసరం. మనం తీసుకునే చర్యలు భవిష్యత్తులో వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను తగ్గించడానికి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి ఎంతో అవసరం. ఈసమస్యను పరిష్కారించినప్పుడే భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించగలుగుతాం. •


ఎం కె కుమార్



# ఆ నోట్ల గుట్టలు ఎవరివి?

### ఆ సొమ్ముతో తనకు సంబంధంలేదన్న జస్టిస్ వర్మ
### కాలిన నగదు విడియో విడుదల చేసిన 'సుప్రీం'
### కొనసాగుతున్న అంతర్గత దర్యాప్తు

**న్యూఢిల్లీ, మార్చి 23:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌వర్మ అధికార నివాసంలో ఈనెల 14న హోలీరోజున జరిగిన అగ్నిప్రమాదంలో కరెన్సీ నోట్ల కట్టలు కాలినట్లు ఆరోపణలు వచ్చినసంగతి తెలిసిందే. స్టోర్‌రూమ్‌లో కాలిన డబ్బులకు సంబంధించిన ఫోటోలు విడియోక్లిప్‌ను శనివారం రాత్రి సుప్రీంకోర్టు విడుదలచేసింది. వీటితోపాటు సంబంధిత నివేదికను కూడా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా ఆధ్వర్యంలో ఈసంఘటనపై అంతర్గత దర్యాప్తుజరుగుతోంది. ఈ క్రమంలోనే జస్టిస్ యశ్వంత్‌వర్మకు న్యాయపరమైన విధులు అప్పగించవద్దని ఢిల్లీ హైకోర్టుప్రధాన న్యాయమూర్తి డికె ఉపాధ్యాయను సుప్రీం కోర్టు సిజె ఆదేశించారు. అయితే కాలిన సొమ్ముతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి వర్మ స్పష్టం చేసారు. తనను కించపరిచేందుకు ఉద్దేశ్య పూర్వకంగా జరిగిన కుట్రగా ఆయన ఆరోపించారు. కాలిన నగదు ఫోటోలు, విడియోక్లిప్‌ల ప్రామాణికతను ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తనకు కేటాయించినన ఇవాసంలోని స్టాఫ్ క్వార్టర్స్‌కు సమీపంలో ఉన్న స్టోర్‌రూమ్‌లో మంటలు చెలరేగాయని అన్నారు. పాత ఫర్నీచర్ గృహోపకరణాలు తోటపనికి వినియోగించే వస్తువులు ఉంచేస్టోర్‌రూమ్ అని తెలిపారు. తాళం వేయని ఈ స్టోర్‌రూమ్‌కు తన నివాసానికి నేరుగా అనుసంధానంలేదని చెప్పారు. మరోవైపు తాను, తనభార్య మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు వెళ్లినపుడు ఆరోజు రాత్రివేళ ఆ స్టోర్‌రూమ్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌వర్మ తెలిపారు. తన కుమార్తె వృద్ధురాలైన తల్లి ఆసమయంలో ఇంట్లో ఉన్నట్లు చెప్పారు. ఆస్టోర్‌రూమ్‌లో మంటలు చెలరేగడంతో తన కుమార్తె ప్రైవేటు కార్యదర్శి అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారన్నారు. మంటలను ఆర్పినపుడు తన కుటుంబసభ్యులు సిబ్బంది దూరంగా ఉన్నారని చెప్పారు. ఆ సమ యంలో అక్కడ ఎలాంటి నగదు కనిపించలేదని అన్నారు. తాను కాని తన కుటుంబసభ్యులుకానీ ఎప్పుడూ ఆస్టోర్‌రూమ్‌లో డబ్బులు నిల్వచేయ లేదని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌వర్మ తెలిపారు. అలాగే కాలిన కరెన్సీ అవశేషాలు ఏవీ కూడా ఫైర్‌సిబ్బంది తమకు చూపించలేదని చెప్పారు. ఒకవేళ అంతపెద్ద నగదును నిజంగా రికవరీచేసి ఉంటే దాని గురించి తమకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. తమ నివాసంనుంచి వేరుగా ఉన్న స్టోర్‌రూమ్‌లో డబ్బుల మూటలు కాలి నట్లుగా వచ్చినఆరోపణలు నిరాధారమైనవి అశాస్త్రీయమైనవని జస్టిస్ యశ్వంత్‌వర్మ ఖండించారు.







# మతిస్థిమితంలేని బీహార్ సిఎం

### నితీష్‌కుమార్‌పై ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యలు

**సమిస్తిపూర్, మార్చి 23:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌పై జన్‌సూరజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నితీష్ శారీరకంగా అలిసిపోయారని, మానసిక పరిస్థితి సరిగా లేదని, దీంతో ఆయన పాలన విషయంలో రాజీ పడుతున్నారని ఆరోపించారు. సిఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ మీడియాతో ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ 'నితీష్‌కుమార్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన మిత్రపక్షం నేత సుశీల్‌కుమార్ మోడీ తొలిసారి మాట్లాడారు. ఆ తర్వాత పలువురు బీహార్ మంత్రులు కూడా వ్యాఖ్యానించారు. గత జనవరి వరకూ నేను ఎలాంటి కామెంట్లు చేయలేదు. కానీ బిపిఎస్‌సి నిరసనల తర్వాత నితీష్‌కుమార్ మానసిక స్థితి క్షీణించిందని తెలిసింది. ఆ కారణంగానే రాష్ట్రంలో ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితిలో ఆయన ఉన్నారు. ఆయన శారీరకంగా అలసిపోయారు. మానసికంగా ఫిట్‌నెస్‌తో లేరు. ఇందుకు సాక్ష్యం కావాలంటే ఆయన కౌన్సిల్‌లో మంత్రుల పేర్లు అడిగి చూడండి. ముఖ్యమంత్రి పదవికి నితీష్‌కుమార్ రాజీనామా చేయడం మంచిది.'అని సూచించారు. ఇందులో బిజెపికి కూడా సమానబాధ్యత ఉందని, నితీష్‌కుమార్ మానసిక స్థితి కోల్పోయిన విషయం ప్రధానికి కానీ, హోంమంత్రికి కానీ తెలిసినట్లు లేదని అన్నారు.

**తేజస్వీది అదే మాట..:** కాగా, నితీష్ మానసిక, శారీరక దారుఢ్యాన్ని కోల్పోయారని ఆర్జేడి నేత తేజస్వియాదవ్ ఇటీవల కాలంలో పలుమార్లు విమర్శలు గుప్పించారు. నితీష్‌కుమార్ రాజీనామాకు డిమాండ్ చేశారు. ఒక కార్యక్రమంలో జాతీయ గీతం ఆలపిస్తుండగా నితీష్ మాట్లాడుతున్న విడియోను గత గురువారం ఆయన షేర్ చేశారు. యువకులు, విద్యార్థులు, మహిళలు, వయోవృద్ధులను ప్రతిరోజూ అవమానించే ముఖ్యమంత్రి కనీసం జాతీయ గీతాన్నైనా అవమానించకుండా ఉంటే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

# సంభాల్‌మసీదు కమిటీ చీఫ్ అరెస్ట్



**సంభాల్(యుపి), మార్చి 23:** షాహి జమా మసీదుకమిటీ అధ్యక్షుడు జాఫర్ ఆలీని పోలీసులు ఆదివారం అరెస్టుచేసారు. గత ఏడాది నవంబరులో పెచ్చుమీరిన హింసకు సంబంధించి ఆయనప్రమేయం ఉందని పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాలతో మసీదులో సర్వే సందర్భంగా చెలరేగిన హింసాత్మక ఘటనల్లో ఆయనప్రమేయం లేకపోలేదన్నారు. స్థానిక సిట్ అధికారుల ఆధ్వర్యంలోమసీదు కమిటీ ఛీఫ్‌ను అదుపులోకి తీసుకని ఆయన వాంగ్మూలం నమోదుచేసినట్లు వెల్లడించారు. యుపి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ముగ్గురుసభ్యుల జ్యుడిషియల్ కమిషన్ సోమవారంనుంచి విచారణప్రారంభిస్తుంది. గత ఏడాదిజరిగిన అల్లర్లలోముగ్గురు వ్యక్తులు చనిపోగా అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముఘల్‌చక్రవర్తుల కాలంనాటి మసీదు ప్రాచీనకాలంలో హిందూ దేవాలయం కూల్చివేసి నిర్మించారన్న ఆరోపణలున్నాయి. సంభాల్ ఎస్‌పి కృషన్‌కుమార్ బిష్ణోయి మాట్లాడుతూ షాహిజామా మసీదు చీఫ్ జాఫర్ ఆలీని అరెస్టు చేసామని ఆయన్ను విచారిస్తున్నట్లు తెలిపారు. సంభాల్ కొత్వాలి ఇన్‌ఛార్జి అనుజ 'కుమార్ తోమర్ కూడా మసీదు కమిటీ అధ్యక్షుడిని సిట్ అదుపులోకి తీసుకుందని తెలిపారు. జాఫర్ ఆలీ అన్న తాహిర్ ఆలీ మాట్లాడుతూ పోలీసులు అక్రమంగా తన సోద రుడిని జైలుకు పంపిస్తున్నారని, జ్యుడిషియల్ ప్యానెల్‌ముందు ఆయన వాంగ్మూలం రికార్డు చేయాల్సి ఉండగా ముందుగానే కుట్రపూరితంగా అరెస్టుచేసారని ఆరోపించారు. ఉదయం 11.15 గంటలకు ఇన్‌స్పెక్టర్ మా ఇంటికి వచ్చి సర్కిల్ అధికారి కుల్‌దీప్‌సింగ్ మీతో మాట్లాడాల నుకుంటున్నారని చెప్పారని ఆయన మాతో మాట్లాడారని గత రాత్రికూడా మాట్లాడారన్నారు. ఈలోపే అదుపులోకి తీసుకుని మాసోదరుడిని జైలుకు పంపించారని అన్నారు. జాఫర్ ఇప్పటికే తన సాక్ష్యం చెప్పాడని, పోలీసులు కాల్పుల్లోనే నలుగురు చనిపోయారని చెప్పినట్లు గుర్తుచేసారు. పోలీసులు తన సోదరుడిని తీసుకెళ్లేముందు కూడా తనకు చెప్పాడని తాను జైలుకు వెళ్లడా నికిసైతం సిద్ధమేనని నిజాన్ని దాచి మాట్లాడ బోనని చెప్పాడన్నారు. బయటినుంచి నిధులు అందాయన్నది పూర్తిగా అవాస్తవమని ఒక్క పైసాకూడా రాలేదన్నారు. ఈకేసును కోర్టులోనే పోరాడతామని, విజయం మాదే అవుతుందని అన్నారు. సంభాల్ యంత్రాంగం కావాలనే ప్రజల్లో మతం చిచ్చురేపుతోందని ఆరోపించారు. ఇక్కడ ఉన్న అశాంతిని సర్దుబాటుచేయకపోగా అందరినీ రెచ్చగొడుతున్నారన్నారు. తాహిర్ ఆలీ, జాఫర్ ఆలీ, మసూద్ ఫరూఖీ, ఖాసిమ్ అడ్వకేట్‌లు కూడా తమ వాంగ్మూలాలను సోమ వారం జ్యుడిషియల్ కమిషన్‌ముందు ఇవ్వాల్సి ఉంది.



## అన్నామలై వ్యాఖ్యలపై కర్ణాటక డిప్యూటీ సిఎం ఫైర్

### రాష్ట్రంకంటే పార్టీపెద్దల ఆదేశాలే ఆయనకు ఎక్కువని ఎద్దేవా

**బెంగళూరు, మార్చి 23:** నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ అధ్యక్షతన జరిగిన జెఎసి సమావేశంపై బిజెపి రాష్ట్రచీఫ్ అన్నామలై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వీటిపై కర్ణాటక డిప్యూటి సిఎం డికె శివకుమార్ స్పందించారు. అన్నామలై రాష్ట్రానికి కాకుండా పార్టీకి విధేయుడుగా ఉన్నారన్నారు. జెఏసి సమావేశంలో పార్టీనేతలతో కలిసి అన్నామలై నిరసన చేసారని ఆసమయంలో కేరళ, కర్ణాటక రాష్ట్రాలనుద్దేశించి ఆరోపణలుచేసారన్నారు. వీటిపై తాజాగా శివకుమార్ స్పందించారు. అన్నామలైకి రాష్ట్రవిషయాలకంటేప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షాలు దేశానికి ఏంచెవుతున్నారనేదే ముఖ్యం. ఆయనకు ఏదీ తెలియదు. అన్నామలై రాష్ట్రానికి కాకండా పార్టీకి విదేయత చూపుతున్నారని ఆయన విమర్శించారు. జెఎసి సమావేశంలో పార్లమెంటు స్థానాలు తగ్గించడంద్వారా రాష్ట్రప్రాతినిధ్యాన్ని కుదించేందుకు ఆమోదిస్తే మాతృదేశంలోనే రాజకీయ అధికారంలేని పౌరులుగా ఉంటామని స్టాలిన్ వ్యాఖ్యలు చేసారు. పునర్విభజనకు వ్యతిరేకం కాదని, న్యా యంగా నియోజకవర్గాల పునర్విభజన జరగా లని కోరుతున్నట్లు స్టాలిన్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందుకోసమే ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో మృత్యుఘోష..

### 50 వేలు దాటిన మరణాలు : గాజా ఆరోగ్య శాఖ వెల్లడి



**టెల్‌అవీవ్, మార్చి 23:** ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 50 వేల మంది పాలస్తీనీయన్ల ప్రాణాలు కోల్పోయినట్లుగా గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. మరో 1.13 లక్షల మంది గాయపడినట్లు తెలిపింది. ఇటీవల కాల్పుల విరమణ ముగిసిన తర్వాత వారం వ్యవదిలోనే మళ్లీ దాడులు మొదలుకాగా వీటిలో దాదాపు 673 మంది చనిపోయారు. అయితే, మొత్తం మరణించిన వారిలో సామాన్య పౌరులు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై గాజా ఆరోగ్య శాఖ స్పష్టత ఇవ్వలేదు. అయితే, ఇజ్రాయెల్ మాత్రం దాదాపు 20 వేల మంది మిలిటెంట్లను చంపినట్లు పేర్కొంది. కాల్పుల విరమణ ముగిసిన తర్వాత మళ్లీ దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయెల్ తాజాగా దక్షిణ గాజాపై భీకర దాడులకు పాల్పడుతోంది. శనివారం రాత్రి జరిపిన దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. హమాస్ రాజకీయ నేత సహా పలువురు మహిళలు, చిన్నారులు చనిపోయారు. రఫా నగరాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ఇప్పటికే ఆదేశించింది. దీంతో పాలస్తీనా వాసులు తమ సామగ్రిని పట్టుకొని దుమ్ము రోడ్లపై బారులు తీరిన పరిస్థితి కనిపించింది.

# వాణిజ్య ఒప్పందాలు వాస్తవం..

### భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం: విదేశాంగ మంత్రి జైశంకర్




**న్యూఢిల్లీ, మార్చి 23:** అంతర్జాతీయ ఒప్పందాలపై ఒవైపు చర్చ జరుగుతుండటం, ప్రతీకర వాణిజ్య సుంకాలకు అగ్రరాజ్యం అమెరికా గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్య ఒప్పందాలు వాస్తవమని, అయితే భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం అనే విధానాన్ని తాము అనుసరించనున్నామని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు చాలా కీలకమని, అయితే ఇందువల్ల ఒనగూరే ప్రయోజనాలను చాలా జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలని ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ అన్నారు. ప్రధానంగా సున్నితమైన టెక్నాలజీ విషయంలో ఇలాంటి ఒప్పందాల వల్ల ఇరువైపులా ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. భారత్ ప్రభుత్వం ప్రస్తుతం మూడు కీలక వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతోందని విదేశాంగమంత్రి జైశంకర్ తెలిపారు. వీటిలో ఒకటి యుఎస్‌తో జరుగుతోందని చెప్పారు. 'అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు కీలకం. ఇప్పుడు వీటి ప్రాధాన్యత కూడా పెరిగింది. దీనిని భారత్ గుర్తించింది. ప్రస్తుతం, మనం మూడు వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతున్నాం. ఐరోపా సమాఖ్య, యుకె, అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందంతో చర్చలు జరుపుతున్నాం. న్యూజిలాండ్‌తో కూడా ఈ వారమే చర్చలు ప్రారంభించాం. మరికొందరితో కూడా చర్చలు జరపనున్నాం' అని జైశంకర్ తెలిపారు. భారతదేశం 'ఇండియా ఫస్ట్' విధానాన్ని అనుసరించనుందని జైశంకర్ భరోసా ఇచ్చారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ఇండియా ఫస్ట్ పాలసీని అనుసరించనున్నట్లు చెప్పారు. గతంలో ఎక్కువగా ఆసియా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఎ)లు చేసుకునే వాళ్లమని, వాణిజ్యం పోటాపోటీగా ఉండేదని అన్నారు. అమెరికా ఫస్ట్ పాలసీలో భాగంగా డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రతీకార సుంకాలను కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. భారత్‌తో మంచి సంబంధాలే ఉన్నాయని, అయితే భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరించారు.

### అమెరికాలో మళ్లీ కాల్పులు

## భారత్‌కు చెందిన తండ్రి, కుమార్తె మృతి



**వర్జీనియా, మార్చి 22:** అమెరికాలో ఇదనదరు భారతీయులపై కాల్పులు జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వర్జీనియాలోని ఓ డిపార్టుమెంటల్ స్టోర్‌లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో అక్కడే పనిచేస్తున్న భారత్‌కు చెందిన ఉర్మి (24), ఆమె తండ్రి ప్రదీప్ పటేల్ మృతి చెందారు. కాల్పులకు తెగబడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం మద్యం కొనేందుకు స్టోర్‌కు వెళ్లిన దుండగుడు ముందురోజు రాత్రి స్టోర్‌ను మూసేశారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెంటనే కాల్పులు జరపగా ప్రదీప్ పటేల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఊర్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. భార్య కుమార్తెతో కలిసి ఆరేళ్ల క్రితం ప్రదీప్ పటేల్ గుజరాత్ నుంచి అమెరికా వెళ్లినట్లు సమాచారం.

#### న్యూమెక్సికోలో రెండు గ్రూప్‌ల మధ్య కాల్పులు.. ముగ్గురు మృతి

**వాషింగ్టన్:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. న్యూమెక్సికోలోని లాస్ క్రూసెజ్‌లో శుక్రవారం రాత్రి రెండు గ్రూప్‌ల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. 15 మంది గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం ఈ ఘటన రాత్రి 10 గంటలకు జరిగింది. మృతుల్లో ఇద్దరు టీనేజర్లు ఉన్నారు. గాయపడిన వారిలో అంతా 16 నుంచి 36 యేళ్ల వయసు మధ్యలోనే ఉంటారని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. అనుమతి లేని ఓ కారు ప్రదర్శన సందర్భంగా రెండు గ్రూప్‌ల మధ్య ఈ కాల్పులు జరిగినట్లు లాస్‌క్రూస్ పోలీసు చీఫ్ జెరేమీ స్టోరీ పేర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# సరిహద్దుల్లో భద్రతకు రోబో డ్రోన్లు



**న్యూఢిల్లీ, మార్చి 23:** అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి భద్రత కొనసాగించేందుకుగాను అస్సాంలోని గువాహతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు అధునాతన రోబోలను అభివృద్ధిచేసారు. అత్యంత సవాళ్లతో కూడిన అంతర్జాతీయ సరిహద్దులను నిరంతర గస్తీకి ఈ ఎఐ ఆధారిత నిఘాతో అత్యంత ప్రయోజనం ఉంటుందని ఐఐటి పరిశోధకులు చెపుతున్నారు. ఐఐటి గువాహతిలో డిఎస్పాటియో రోబోటిక్ లేబ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్ అభివృద్ధిచేసిన ఈ రోబోలు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థనుంచి గుర్తింపు పొందినట్లు తెలుస్తోంది. భారత సైన్యం ఇప్పటికే ఈ నిఘా వ్యవస్థ ఫీల్డ్‌ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిఎస్ఆర్ఎల్ సిఇఒ అర్జున్‌కుమార్ బర్మన్ మాట్లాడుతూ మనుషుల గస్తీపై ఆధారపడే భద్రత కార్యాచరణకు భిన్నంగా ఈ రోబోలు స్వయంప్రతిపత్తి వ్యవస్థను కలిగి ఉంటాయన్నారు. అన్నివాతా వరణ పరిస్థితుల్లోను సమర్థంగా పనిచేస్తా యన్నారు. నేవిగేషన్ ఎఐ ఆధారిత నిఘాతో కూడిన ఈ వ్యవస్థ సరిహద్దు రక్షణ కీలకమైన మౌలిక సదుపాయాల నిఘా వ్యూహాత్మక రక్షణ విషయాల్లో ఓ విప్లవాత్మక మార్పుకానుంది. జాతీయ అంతర్జాతీయ భద్రత విషయంలో ఎదురవుతున్న సవాళ్లను తట్టుకో డానికి ఎఐ ఆధారిత అత్యాధునిక పరికరాలను అభివృద్ధిచేయాలనేదే మా లక్ష్యం అన్నారు. దుండుగులు అంతర్జాతీయ సరిహద్దుల్లోకి డ్రోన్‌లను పంపించి చొరబాట్లకు ప్రయత్నించడం వంటివిచేస్తే ఈరోబోల సెన్సార్లు వెంటనే గుర్తించి అప్రమత్తం చేస్తాయి. ఈ రక్షణ జాతీయభద్రతను బలోపేతంచేసే మరిన్ని ఆవిష్కరణలుచేసేందుకు నిరంతరం ఐఐటి కృషిచేస్తుందని ఆయన చెప్పారు.

### బోల్తాపడి ఇ రిక్షాను ఢీకొన్న యాపిల్ పళ్ల ట్రక్కు

## ఇద్దరు మృతి, ట్రక్కు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

**హాత్రాస్(యుపి), మార్చి 23:** యాపిల్ పళ్ల లోడుతో వెళుతున్న ఒక ట్రక్కు ఓవర్‌టర్న్ అయి ఈరిక్షాను ఢీకొనడంతో ఇద్దరు చనిపోయారు. ఆలిఘర్ ఈటా రోడ్డులో ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ఉదయం 9.30 గంటలప్రాంతంలో ట్రక్కు ఒడిశావైపునకు వెళుతుండగా అదుపుతప్పి ఈరిక్షాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఈరిక్షా డ్రైవర్, ప్యాసింజర్ ఒకరు ఇద్దరూ చనిపోయారు. ట్రక్కు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సికిందర్‌రావు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు డ్రైవర్‌ను తరలించారు. మృతులు 20 ఏళ్ల గోపాల్, 21 ఏళ్ల కన్హయ్యగా గుర్తించారు. కొత్వాలిపోలీస్‌స్టేషన్ ఎస్ఐ అరవింద్ రాథి కేసునమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రులకు తరలించినట్లు చెప్పారు.

# ఏప్రిల్ 28న కెనడా పార్లమెంటుకు ఎన్నికలు




**ఒట్టావా, మార్చి 23:** ప్రధానమంత్రిగా మార్క్ కార్నీ ప్రమాణస్వీకారంచేసిన కెనడాలో ముందస్తు ఎన్నికలకు సిద్ధం అయ్యారు. ఏప్రిల్ 28న ఫెడరల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంటులో మొత్తం 338 స్థానాలున్నాయి. వీటికి ఏప్రిల్ 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు కార్నీ ఆదివారం ప్రకటించారు. ప్రధాని కార్నీ కెనడా రాజధాని ఒట్టావానుంచి బరిలోకి దిగేందుకు సిద్ధం అయ్యారు. లిబరల్‌పార్టీ ఈఅంశం ధృవీకరించింది. జనవరిలో జస్టిన్‌ట్రూడో ప్రధానిపదవికి రాజీనామాచేయడంతో లిబరల్‌పార్టీసభ్యులు తదుపరి ప్రధానిగా కార్నీని ఎన్నుకున్నారు. కొత్త నాయకత్వం ఏర్పడిన తర్వాత గ్లోబల్‌న్యూస్ నిర్వహించిన పోల్ సర్వేల్లో ఓటర్లు అధికార పార్టీవైపు మొగ్గుచూపుతున్నట్లు వెల్లడి అయింది. 42శాతంమంది ఓటర్లు లిబరల్‌పార్టీకి మద్దతివ్వగా 36శాతం మంది కన్సర్వేటివ్‌కు అనుకూలంగా ఉన్నారు. ఇక 48శాతం మంది కార్నీ నాయకత్వం ఆమోదిస్తున్నారు. 30శాతం వ్యతిరేకిస్తున్నారు. అతిపెద్ద వాణిజ్యభాగస్వాములైన కెనడా, మెక్సికోలనుంచి వచ్చే దిగుమతులపై మార్చి 4నుంచి అమెరికా 25శాతం సుంకాలు వసూలుచేస్తున్న సంగతి తెలిసిందే. వలసలు,డ్రగ్స్ అక్రమ రవాణానున సరిహద్దుల్లోనే కట్టడిచేయడంలో విఫలమైతే కెనడా యుఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ చురక లంటించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆదేశంలో జరగనున్న ఎన్నికలు కీలకంగా మారుతున్నాయి.

## రిమోట్ ఐఇడిలతో భద్రతా దళాలకు మరింత ముప్పు


### ఛత్తీస్‌గఢ్‌లో బటయపడుతున్న అధునాతన మందుపాతరలు



**రాయ్‌పూర్, మార్చి 23:** మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతాదళాలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చికల్లా నక్సల్స్ రహిత దేశంగా మారుస్తామన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో గాలింపులు ముమ్మరంచేసాయి. గడచిన మూడునెలల వ్యవధిలోనే 120 మందికిపైగా మావోయిస్టులు మృతిచెందారు. అయితే యాంటి నక్సల్స్ ఆపరేషన్‌ల వేళ రక్షణదళాలకు మందుపాతరలు సవాల్ చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో ఐఇడి పేలుళ్లు స్వాధీనం ఘటనలుపెరిగాయి. మరోవైపు సిగ్నల్స్‌ద్వారా దూరం నుంచి పేల్చగల ఆర్‌సిఐఇడిలు కూడా లభిస్తున్నాయి. గత ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతరలకు సంబంధించి 78 పేలుళ్లు స్వాధీనం సంఘటనలు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో మార్చి మధ్యనాటికే ఈ సంఖ్య 100 దాటింది. 2020-22లో సెక్యూరిటీ క్యాంపులకు 3-7 కిలోమీటర్ల పరిధిలో ఐఇడిలు లభ్యమయ్యేవని 2023-24 మధ్యకాలంలో అవిమూడు కిలోమీటర్లలోపే వెలుగుచూస్తున్నట్లు నివేదికలో తేలింది. 2020-21తో పోలిస్తే 2022-24లో ఈతరహా ఘటనలు 25శాతంపెరిగాయని తెలింది. గత ఏడాది కాలంలో ఛత్తీస్‌గఢ్ ఝార్ఖండ్‌లలోని నక్సల్స్ ప్రభావితప్రాంతాల్లో 70కి పైగా కొత్త ఫార్వర్డ్ ఆపరేటింగ్‌బేస్‌లు వచ్చాయి. వీటిసంఖ్య పెరిగిన కొద్దీ ఐఇడి ఘటనలూ పెరుగుతున్నట్లు ఒక అధికారి వెల్లడించారు. ఈమధ్యకాలంలో ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఆర్‌సీ ఐఇడిల ముప్పు ఆందోళనకరంగా మారింది. గతవారంలోనే బీజాపూర్‌జిల్లాలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్ సమీపంలో ఐదు కిలోల పేలుడు పదార్థం వెలుగుచూడటం కలకలం రేపింది. బాంబు వద్దరెండు ఖాళీ గాజుసీసాలతోపాటు దూరంనుంచి పేల్చేందుకువీలుగా సమీపంలోని ఒకచ ఎట్టుకింద వైర్‌తోఅనుసంధానమై ఉన్న చిన్న యాంటెన్నా కూడా లభించింది. ఇదే జిల్లాలో ఒక వంతెనకింద తొలిసారి ఈ తరహా ఐఇడిని సిఆర్‌పిఎఫ్ స్వాధీనంచేసుకుంది. వీటివాడకం మరింతగాపెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దూరంనుంచి వీటిని పేల్చే ఛాన్స్ ఉండటంతో ఇవి మరింత ప్రమాదకరమని చెపుతున్నారు.

## జమ్ము అమర్‌నాథ్ గుహాలకు రోప్‌వేకు బిడ్లు

**జమ్ము, మార్చి 23:** అమర్‌నాథ్ ఆలయ మార్గం సహా మూడుచోట్ల రోప్‌వేలు నిర్మించేందుకు సమగ్ర పథకనివేదిక రూపకల్పనకోసం బిడ్‌లు ఆహ్వానించామని జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వం వెల్లడించింది. బాల్‌టాల్‌నుంచి 3880 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్‌గుహ వరకూ 11.60 కిలో మీటర్ల మేర ఓరోప్‌వేతోపాటు బుద్‌గాంవ్, రాంబన్ జిల్లాల్లో నిర్మించాల్సిన రెండు రోప్‌వేలు ఈజాబితాలో ఉన్నాయి. శంకరాచార్య ఆలయం వద్ద రోప్‌వే నిర్మాణప్రక్రియ డిపిఆర్‌దశలోనే ఉందని పేర్కొంది.



# 120 అడుగుల ఎత్తయిన రథం కూలి ఒకరి మృతి, అనేకమందికి గాయాలు

**బెంగళూరు, మార్చి 23:** మద్దూరమ్మ జాతరలో నిర్వహించిన ఊరేగింపులో 120 అడుగుల ఎత్తయిన రథం కూలింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా పలువురు గాయపడ్డారు. కర్ణాటకలోని బెంగళూరురూరల్ జిల్లాలో ఈసంఘటన జరిగింది.

అనేకల్‌లోని హుస్కూర్‌లో మద్దూరమ్మ జాతర సందర్భంగా వంద అడుగు లకుపైగా ఎత్తయిన రెండు రథాలను ఆలయ నిర్వాహకులు తయారుచేయించారు. ఊరేగింపు సందర్భంగా రెండు రథాలను తాళ్లసాయంతో భక్తులు లాగారు. అయితే ఈదు రుగాలులకు 120 అడుగుల ఎత్తయినరథం అదుపు తప్పి ఒక పక్కకు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తిమరణించాడు. పలువురు గాయపడ్డారు. పలు వాహనాలుకూడా ధ్వంసం అయ్యాయి. మరోవైపు పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మృతుడిని తమిళనాడు లోని హోసూర్‌కు చెందిన లోహిత్‌గా గుర్తించారు. ఎత్తయిన రథం కూలిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ విడియోక్లిప్ సోషల్‌మీడియాలో వైరల్ అయింది.



ఆదివారం సిఎం నివాసంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు

# శ్రీరామనవమి ఉత్సవాలకు రండి

## సిఎంను ఆహ్వానించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే తిరుకళ్యాణ, బ్రహ్మోత్సవాలకు రావాలని సిఎం రేవంత్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం దేవస్థానం అర్చకులు, అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు వారు ఆదివారం సిఎం నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందచేశారు. ఆ సందర్భంగా వారు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అవసరమైన భూసేకరణ, నిధులకు సం బంధించి పూర్తి వివరాలను అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్‌బాబు, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**పంచాంగాన్ని ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ**

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖధూప దీప నైవేద్య అర్చన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన విశ్వవసు నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అర్చకులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దానికి భగవంతుని కృప ఉండాలని దానికి అర్చకులుగా మీ వంతు సహకారంగా క్షేమంగా సుభిక్షంగా ఉండేందుకు ప్రతినిత్యం భగవంతుని అర్చన చేయాలన్నారు.
ఈ కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శులు అన్న వజ్జల ప్రసాద్‌శర్మ తిరునగరి వెంకటాద్రి స్వామి కోశాధికారి నందనం హరికిషన్ శర్మ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణి కుమార్ శర్మ కన్వీనర్ అమరేశ్వరశర్మ విశాలాక్షి ఉపాధ్యక్షులు మహేషు, రవికుమార్ లక్ష్మీకాంతాచార్యులు అధికార ప్రతినిధులు భార్గవాచార్యులు సంతోష్ శర్మ వివిధ జిల్లాల అధ్యక్షులు రమేష్ శర్మ మునగలేటి త్రిపురారి మనోహర్ శర్మ పార్థసారథి జంగం మహేష్ జయతేర్థ చారి సుబ్రహ్మణ్య శర్మ శిరేష్ శర్మ అంజనప్ప స్వామి రాజప్ప స్వామి అడవయ్య స్వామి సిద్ధాంతి గణేష్ జ్ఞానేశ్వర్ ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివిధ జిల్లాల నుండి కార్యవర్గ సభ్యులు అర్చకులు తిదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల విషయంలో కార్పొరేట్ కంపెనీలు జాగ్రత్తగా ఉండాలి

### టిజిసిఎస్‌బి హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** కార్పొరేట్ కంపెనీలు సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తగా వుండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) హెచ్చరించింది. కార్పొరేట్ కంపెనీల్లో ఉన్నత పదవుల్లో వున్న వారు తమకు వచ్చే మెయిల్స్ విషయంలో జాగ్రత్తగా వుండాలని టిజిసిఎస్‌బి డిజి శిఖా గోయల్ తెలిపా రు. ఈ మేరకు ఆమె ఆదివారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు కార్పొరేట్ కంపెనీల సిఎండిలు, సిఈఓలు మాట్లాడుతున్నట్లు ఉన్నత పదవుల్లో వున్న వారికి ఫోన్‌లు చేయడం, తమ నంబర్లు ఇస్తూ కంపెనీ సమాచారం కోసం ప్రయత్నించడం ఇటీవల కాలంలో పెరిగిందని ఆమె తెలిపారు. ఇదే సమయంలో ఫి షింగ్ మెయిల్స్ విషయంలోనూ ఉద్యోగులు, ఉన్నత పదవుల్లో వున్న వారు జాగ్రత్తగా వుండాలని ఆమె కోరారు. ఈ విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా కంపెనీకి సంబంధించి బ్యాంకుల ఖాతాల్లో వున్న నగదును సైబర్ నేరగాళ్లు కాజేసే ప్రమాదం వుందని, ఇదే సమయంలో కంపెనీకి చెందిన విలువైన సమాచారం గల్లంతయ్యే అవకాశం వుందని ఆమె తెలిపారు. కార్పొరేట్ కంపెనీలు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌ల విషయంలో జాగ్రత్తగా వుండాలని, ఏమైనా అనుమానం వస్తే 1930కి ఫిర్యాదు చేయాలని శిఖాగోయల్ కోరారు.

## 26 నుంచి ఎస్‌ఎస్‌సి మూల్యాంకనం ప్రారంభం

### 19 కేంద్రాల్లో కొనసాగనున్న స్పాట్ వ్యాల్యుయేషన్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమైన 10వ తరగత వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుంది. ఏప్రిల్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నప్పటికీ.. లాంగ్వేజెస్ పరీక్షలు ముగియగానే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించనున్నారు. ప్రతి ఏడాది ఇలాగే మూల్యాంకనాన్ని కొనసాగిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 కేంద్రాల్లో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను కొనసాగించనున్నారు. హైదరాబాద్‌లో రెండు కేంద్రాలను కొనసాగిస్తూ.. మిగిలిన కేంద్రాలను జిల్లాల్లో కొనసాగించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలకు 5.05 లక్షల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఎస్‌ఎస్‌సి మూల్యాంకనాన్ని ఈ నెల 26 నుంచి మొదలుపెట్టి.. ఏప్రిల్ 13 వరకు ముగించాలని అధికారులు భావిస్తున్నారు. అయితే ఏప్రిల్ 13 వరకు పూర్తికాకపోతే మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి.. ఏప్రిల్ నెలాఖరులోగానీ.. మే మొదటి వారంలోగానీ ఎస్‌ఎస్‌సి ఫలితాలను విడుదల చేయడానికి పాఠశాల విద్య శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో ఆదిలాబాద్, మంచిర్యాల్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్, హన్మకొండ, కరీంనగర్, సంగారెడ్డి, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్(మేజర్), హైదరాబాద్(మైనర్), రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం కేంద్రాల్లో మూల్యాంకనాన్ని కొనసాగించనున్నారు.

# ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

## రవాణా కార్యాలయాల్లో ట్రాఫిక్ అవగాహన పార్కులు

### మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, నూతన స్క్రాప్ పాలసీ, ఎలక్ట్రిక్ వెహికల్ విధానం, ట్రాఫిక్ అవగాహన పార్కుల నిర్మాణం వంటివి ఇందులో భాగమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణంలో జువ్వాడి చొక్కారావు ట్రాఫిక్ అవగాహన పార్కును మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఇక్కడ రూ. 8 కోట్లతో నిర్మించనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రవాణా కార్యాలయాల్లో ట్రాఫిక్ అవగాహన పార్కులను ఏర్పాటు చేయనున్నామని అన్నారు. ఈ పార్కుల వల్ల విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకొని భవిష్యత్తులో ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని అన్నారు. ఏఐ టెక్నాలజీ ద్వారా వాహనాల ఫిట్నెస్ ను నిర్ధారించేందుకు గాను ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొట్టమొదటిగా కరీంనగర్ లోనే ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణానికి ప్రారంభోత్సవం జరిగిందని అన్నారు. నూతన స్క్రాప్ పాలసీ విధానం ద్వారా 15 సంవత్సరాలు దాటిన వాహనాల స్థానంలో కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే రాయితీ ఇస్తామని తెలిపారు. కాలుష్య నివారణకు దేశంలోనే మొదటిసారిగా ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీని తీసుకొచ్చామని అన్నారు. ప్రజలను ప్రమాదాల నుండి రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అయినప్పటికీ ప్రజల్లోనూ ట్రాఫిక్ రూల్స్ పట్ల అవగాహన ఉండాలని, అందరూ నిబంధనలను పాటించాలని, తద్వారా ప్రమాదాల నివారించవచ్చని అన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తిమ్మాపూర్ లోని ట్రాఫిక్ పార్క్ విద్యార్థులందరూ సందర్శించి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాల విద్యార్థి ఈ పార్కును సందర్శించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అనేక రోడ్డు భద్రతాచర్యలను




ఆదివారం తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## నాలుగు జిల్లాల్లోనూ క్యాంప్ ఆఫీసులు

### నిత్యం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటా

### కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని.. నిత్యం ఉపాధ్యా తి యులకు అందుబాటులో ఉంటానని కరీంనగర్-మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ముల్క కొమరయ్య తెలిపారు. నాలుగు జిల్లాల్లోనూ క్యాంప్ ఆఫీసులను ఏర్పాటు చేసి.. నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. నిత్యం అందుబాటులో ఉంటూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమరయ్యకు మద్దతు తెలిపిన టీచర్ల సంఘాలు ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా మల్క కొమరయ్య మాట్లాడుతూ.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల సమస్యలను ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్ కేటగిరిల కింద విభజించి వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. వాటిపై నివేదికను ప్రభుత్వానికి అందజేసి ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. టీచర్ల సమస్యలపై ప్రభుత్వానికి ఒక డెడ్ లైన్ ఇచ్చి, అప్పటిలోగా ప్రభుత్వం నుంచి స్పందన లేకుంటే వివిధ మార్గాల్లో ఉద్యమం, పోరాటాలు, ఆందోళనలు చేపడుదామన్నారు. ఎమ్మెల్సీగా తనకు టీచర్లు అందించిన గెలుపు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్, హైదరాబాద్‌లో నాలుగు ఆఫీసులు ప్రారంభించి టీచర్ల సమస్యలపై స్పందిస్తానని, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని కొమరయ్య తెలిపారు. 317 జీవో రద్దు కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్, తపస్ చేసిన పోరాటం టీచర్లను ఆలోచింపజేసిందని మల్క కొమరయ్య అన్నారు.

# వ్యవస్థీకృత అణిచివేతపై పోరాటం చేయాలి

## కేరళలో దళిత ప్రగతి సదస్సులో మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 23 ,ప్రభాతవార్త :** దళితుల హక్కుల కోసం మాట్లాడుతున్న ఈ సమయంలో, మన పోరాటాలు సమానత్వం, సామాజిక న్యాయం మాత్రమే ఉండకూడదని, సమాజం లోతుగా చొచ్చుకొని ఉన్న వ్యవస్థీకృత అణచివేత పైన పోరాడాల్సిన సమయం వచ్చిందని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం కేరళ రాజధాని తిరువంతపురంలో ప్రారంభమైన దళిత ప్రగతి సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ..ఒక ఆదివాసి మహిళాగా అణగారిన వర్గాలు ఎదుర్కొనే కష్టాలు, అన్యాయాల్ని ప్రత్యక్షంగా ఎదుర్కొన్నాను అన్నారు.
నేను, ఈ రోజు మీ ముందు అధికారానికి ఉదాహరణగా నిలబడ్డాను అన్న సీతక్క మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడమే కాదు, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా స్త్రీ సంక్షేమం మంత్రి గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు. మనం సాధించిన విజయాల్ని సంబరంగా చేసుకోవలసిన అవసరం కూడా ఉందని, ఆ విజయాలు ఎంత చిన్నవి అయినా సంబరంగా జరుపుకోవాలి, ఎందుకంటే అమరుల త్యాగాల్ని, వారు సాధించిన విజయాల్ని స్మరించాల్సిన అవసరం ఉందన్నారు. అయ్యంగర్ పోరాటం మొదలు నంగేలీ వరకు ఎన్నో పోరాటాలు చేశారు. వారు భావి తరాల బాగు కోసం పని చేశారని మంత్రి సీతక్క ఈ సంద ర్భంగా గుర్తు చేశారు దేశ దళిత ఆది వాసులుగా, మనకి ఒక గొప్ప ప్రతిఘటన, విప్లవ చరిత్ర ఉందని, బ్రిటిష్ మొదలు ఈ రోజు కి మార్పు కోసం చేస్తున్న అస్తిత్వ ఉద్యమాలు అందులో భాగమే అన్నారు. చరిత్ర నుండి మనం స్ఫూర్తి పొంది, సమసమాజం కోసం పోరాడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు.

## డీలిమిటేషన్‌తో తీవ్రంగా నష్టపోయే అవకాశం

### ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు వ్యాఖ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 23:** కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న డీలిమి టేషన్ విధానంపై కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు కె.కేశవ రావు కీలక వ్యాఖ్యలు చేశారు.



ఆదివారం ఆయన తన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే మాట్లాడుతూ డీలిమిటేషన్ విధానంపై అన్ని రాష్ట్రాలతో చర్చించాకే ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ విధానం ద్వారా దక్షిణాదిలో రాష్ట్రాల భాగస్వామ్యం పెరగాలి గాని తగ్గ కూడదు అని ఆశించారు. పార్ల మెంట్ ఆమోదంతోనే చట్టం చేయాలి తప్ప,మొండిగా ముందుకు వెళ్లకూడదు అని పేర్కొన్నారు. ఇది సీట్ల గురించి పోరాటం కాదని, పార్ల మెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాధాన్యత ఉండాలన్నదే అభిప్రాయం అని తెలిపారు. ఈ అంశంపై దక్షిణాది నేతలు అంతా ఒక్కటి కావాలని... లేదం టే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని కేశవరావు వెల్లడించారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయ త్నిస్తుండగా ఆదాయం ఎక్కువ, జనాభా తక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం ఇంకా పెరగాలని కేశవరావు ఆకాంక్షించారు.

# త్వరలో ఎఐసిసి ఆధ్వర్యంలో పాదయాత్రలు

## పార్టీలో కష్టపడిన వారికి ప్రత్యేక గుర్తింపు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

### జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం

### పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు




సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్(అత్తాపూర్), మార్చి 23, ప్రభాతవార్త:** రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ పేరుతో రాజ్యాంగాన్ని అంతం చేసే కుట్ర చేస్తుందని, రాజ్యాంగం కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తామని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం రాజేంద్ర నగర్ పరిధిలోని ఆరంఘర్‌లో టియుఎఫ్ఐడిసి చైర్మన్, డిసిసి అధ్యక్షుడు రంగారెడ్డి జిల్లా చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జైబాపు జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజ రయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఐసీసీ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలో జైబాపు జైభీమ్, జైసమవిధాన్ అభియాన్ సనాక సమేశాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు పేర్కొ న్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో అంబేద్కర్ ను అడుగడుగునా అవమాన పరుస్తూ రాజ్యాంగానికి కించపరచిన అమిషాను వెంటనే బర్తరఫ్ చేయాలని పలుమార్లు డిమాండ్ కేంద్ర ప్రభుత్వం పెడ చెవిన పెడుతుందని పేర్కొన్నారు. కొత్త సవ రణల పేరుతో బిజెపి రాజ్యాంగాన్ని తీసుకు రావ డానికి మోడీ ప్రయత్నిస్తున్నారని రాజ్యాం గాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందని రాజ్యాంగాన్ని పరి రక్షించుకోవడానికి ఏఐసీసీ పెద్దఎత్తున పాద యాత్రలు చేపట్ట బోతుంద న్నారు. బిజెపి ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై చిన్నచూపు చూస్తుందని చెన్నైలో జరి గిన డిలిమిటేషన్ ఈ కార్యక్రమంలో తెలంగాణకు అన్యాయం ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పడం జరిగిందన్నారు. డీ లిమిటేషన్ పేరుతో రాష్ట్రంలో ఎంపీ సీట్లను తగ్గించడానికి ప్రయత్నం చేస్తే తగిన గుణపాఠం చెప్తామని రాష్ట్ర హక్కుల పరిరక్షణ ఏ పోరాటమైన చేయడానికి సిద్ధమని హెచ్చరించారు. డీలి మిటేషన్‌కు తాము వ్యతిరేకమని పేర్కొ న్నారు. రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని త్వరలోనే నగరంలో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామని తెలిపారు. పార్టీ నాయ కులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. కష్టపడిన వారికి కాస్త ఆలస్యమైన తగిన గుర్తింపు లభి స్తుందన్నారు. ఎవరు కూడా ఆదార్యపడవద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లాకు మంత్రిని నియమిస్తామని రంగారెడ్డి జిల్లా పై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసినందుకు ధన్య వాదాలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో గ్రామ, మున్సిపల్ స్థాయిలో కష్టపడి తమ సత్తా ఏంటో చూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సానం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ధనం జయ్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్య క్షులు నాగేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్‌లు, ప్రెసిడెంట్‌లు, తదితరులు

## వెంకన్న దర్శనానికి సిఫార్సు లేఖల ఒప్పకోలు అభినందనీయం: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించేందుకు చొరవ తీసుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సిఫారసు లేఖలను అనుమతిస్తున్న ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ ధన్యవాదములు తెలిపారు. టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడుకి కూడా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.




ప్లెక్సీని ఆవిష్కరించి మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులపై సర్కారు కఠినంగా వ్యవహరించాలి

### పిడి యాక్టు పెట్టి అరెస్టు చేయాలి: మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు బానిసలై ఎంతోమంది యువ త ప్రాణాలు కోల్పోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ నిషేధించాలని బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వ ర్యంలో అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన ప్లెక్సీని ఆవిష్కరించి ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. గతంలోనే కెసిఆర్ రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్స్‌ను నిషేధించారని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడంతో ఎంతో మంది యువత, విద్యార్థులు, ఉద్యోగస్తులు బెట్టింగ్ యాప్స్ బారినపడి చివరికి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలని బానిసలై విలువైన జీవితాలను బలి చేసుకొవద్దన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వహించే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహారించాలన్నారు. పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం : హరీశ్‌రావు**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వామని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ హయాంలో రైతు పండించిన ప్రతి పంటను పూర్తి స్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతు లను కంటికి రెప్పాల కాపాడున్న ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వామన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలన్నారు. పొద్దు తిరుగుడు పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిం చాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కాముని శ్రీనివాస్, రాధా కృష్ణశర్మ, ఉమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సు

## సాంకేతికతో పారదర్శకతను పెంపొందించుకోవచ్చు

### నేషనల్ వర్క్‌షాపులో టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం



**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఈ యేడాది డిసెంబర్‌లో .. పబ్లిక్ సర్వీస్ కమిషన్(పిఎస్‌సి) చైర్మన్ల జాతీయ స్థాయి సదస్సును నిర్వహించ నున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో .. కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన నేషనల్ వర్క్ షాప్ ఆన్ టెక్నాలజీలో ఆయన పాల్గొ న్నారు. ఛైర్మన్‌తో పాటు కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎన్.యాద య్య, పాల్వాయి రజినీకుమారి కూడా పాల్గొన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు నిర్వహించే రిక్రూట్ మెంట్‌లలో సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను పెంచ డంలో సాంకేతికత (టెక్నాలజీ) పాత్ర ముఖ్య మైందన్నారు. నియామక ప్రక్రియలలో అధునాతన సాంకేతిక పరిష్కా రాలను ఉపయోగించుకోవాలని సూచిం చారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) లను నిర్వహించే క్రమంలో ఎటువంటి సమస్యలు రాకుండా నిరోధించడానికి బయోమెట్రిక్ హాజరును ప్రామాణీకంగా తీసుకోవాలన్నారు. ప్రాసెసింగ్ వేగవంతంగా సాగడానికి ఆఫీస్ ఆటోమేషన్, డిజిటల్ మూల్యాంకనాన్ని ఉపయోగించాలన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు నిర్వ హించే రిక్రూట మెంట్‌లలో తలెత్తే చట్టపరమైన సవాళ్లను సమర్థవంతంగా పరిష్క రించడానికి, నల్సార్ సహకారంతో టిజిపిఎస్‌సి జూన్ 2025లో హైదరాబాద్‌లో వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు.
ఈ వర్క్‌షాప్‌లో పిఎస్‌సిలు ఎదుర్కొంటున్న చట్టపరమైన కేసులతోపాటు ఇతర న్యాయపరమైన విషయాలపై నిపుణులు మార్గదర్శకత్వాన్ని అందించనుందన్నారు. దాంతోపాటు ఈ యేడాది డిసెంబర్‌లో హైద రాబాద్‌లో ప్రతిష్ఠాత్మకమైన 'రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్‌ల జాతీయ స్థాయి సమావేశం'ను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.

## ప్రముఖ గాంధేయవాది పసల కృష్ణభారతి కన్నుమూత

### దళిత విద్యార్థుల అభివృద్ధికి అవిరళ కృషి

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), మార్చి 23, ప్రభాతవార్త:** స్వతంత్ర సమరయోధుల కుటుంబానికి చెందిన పసల కృష్ణభారతి ఆదివారం తెల్లవారుజామున కన్ను మూశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని ఆమె నివాసంలో కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ప్రముఖ స్వతంత్ర సమర యోధులు పసల కృష్ణమూర్తి అంజలక్ష్మి దంపతుల రెండోకుమార్తె కృష్ణ భారతి. జీవితాంతం గాంధేయవాదిగా ఉంటూ గాంధీజీ ప్రవ చించిన విలువలతోనే జీవించిన ఆమె పలు విద్యా సంస్థలకు నిధులు అందించడంతోపాటు దళితుల్లో విద్యావ్యాప్తికి కృషి చేశారు. గోశాలకు విరాళాలు సమ కూర్చారు. 2022 జూలైలో భీమవరంలో జరిగిన అల్లూరి సీతారామరాజు విగ్ర హావిష్కరణ కార్యక్రమంలో కృష్ణభారతిని ప్రధానమంత్రి నరేంద్రమోడీ సత్క రించడంతోపాటు ఆమెకు పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. కృష్ణభారతికి నలుగురు అన్న దమ్ములు, ముగ్గురు అక్కచెల్లెలు. బ్రిటిష్ ప్రభుత్వం పెట్టిన ఆంక్షలు ధిక్క రించి భీమవరం సబ్‌కలెక్టర్ కార్యాలయం పై జెండా ఎగరవేసిన ఘటనలో కృష్ణమూర్తి దంపతులకు 1932లో కఠిన కారాగారం విధించారు. జైలుశిక్ష విధించిన సమయంలో అంజలక్ష్మి ఆరు నెలల గర్భవతి అయినప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వం కనికరించలేదు. శిక్ష అనుభవిస్తున్న సమ యంలోనే జైలులో కృష్ణభారతి జన్మించారు. జైలులో జన్మించిన ఆమెకు కృష్ణ భారతి అని తల్లిదండ్రులు పేరు పెట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో గాంధీజీ పర్యటన సమయంలో కృష్ణమూర్తి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా కూడా పని చేశారు. సక్రమంలో దళితులకు ఇళ్ల పట్టాలు ఇప్పించడంతోపాటు జీవితాంతం కుష్టు రోగులకు అభాగ్యులకు సేవచేస్తూ గాంధీ విలువలతో జీవించారు. కృష్ణభారతి మరణం పట్ల పలువురు సంతాపం ప్రకటించారు.



గతంలో జరిగిన ఓ కార్యక్రమంలో కృష్ణభారతికి పాదాభివందనం చేస్తున్న ప్రధాని మోడీ (ఫైల్) ఇన్‌సెట్- కృష్ణభారతి

## అడవుల విస్తీర్ణంలో 3వ స్థానంలో తెలంగాణ

### వెల్లడించిన సోషియో ఎకనమిక్ సర్వే

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త :** రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అడవులు 24.69 శాతం ఉన్నాయని సామాజిక, ఆర్థిక సర్వే (సోషియో ఎకనామిక్ సర్వే)2024..25లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.దేశంలో అడవులు 23.59 శాతం ఉండగా, రాష్ట్రంలో అంతకంటే అధికంగానే ఉన్నట్లు పేర్కొంది.అడవుల సగటు విస్తీర్ణంలో దేశంలో తెలంగాణ మూడ్ స్థానంలో నిలిచింది.రాష్ట్రంలోని 2,939 కి పైగా వృక్ష, మొక్క జాతులున్నాయి. 365 పక్షి జాతులు, 131 ఇతర జంతువులు, మృగాల జాతులున్నాయని సర్వేలో తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం అడవులు 27,688 చ.కి.మీ మేర విస్తరించి ఉన్నాయి. మొత్తం 12 రక్షిత ప్రాంతాల్లో 9 శాంక్చురీలు, 3 జాతీయ పార్కులు ఉన్నాయి.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం వనమహోత్సవం, ప్రాజెక్ట్ టైగర్, అర్బన్ ఫారెస్ట్ బ్లాక్‌లకు చర్యలు చేపట్టింది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్)ను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ప్రకటించింది.దేశవ్యాప్తంగా ఉన్న అడవులు విస్తీర్ణనాన్ని పరిశీలిస్తే 44.25 శాతంతో చత్తీస్‌ఘడ్ మొదటి స్థానంలో ఉండగా 39.31 శాతంతో ఒడిశ్శా రెండో స్థానంలో 24.269 శాతంతో తెలంగాణ మూడవ స్థానంలో, 22.87 శాతంలో ఏపీలో నాల్గో స్థానంలో, 20.13 శాతంతో మహారాష్ట్ర 5వ స్థానంలో,19.96 శాతంతో కర్నాటక 6వ స్థానంలో, 17.83 శాతంతో తమిళనాడు ఏవ స్థానంలో ఉన్నాయని సోషియో ఎకనామిక్ సర్వే వెల్లడించింది. అదే విధంగా రాష్ట్రంలోని ములుగు జిల్లాలోలో 64.64 శాతం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 41.38 శాతం, జయశంకర్ భూపాల పల్లిలో 41.15 శాతం,కుమరం భీమ్ జిల్లాలో 40.24 శాతం, మంచిర్యాలో 41.09,కరీంనగర్ జిల్లాలో 2.29, జోగులాంబ గద్వాల్ 2.32 , హనుమకొండలో 3.40, వరంగల్‌ల్లో 3.53, జనగామలో 4.44 శాతం విస్తీర్ణంలో అడవులు ఉన్నట్లు తన నివేదికలో పేర్కొంది.

# బిఆర్ఎస్ దొంగ నోట్లను ముద్రించింది

### దేశ జిడిపికి, డీలిమిటేషన్‌కు ఏం సంబంధం?
### రుణమాఫీ పూర్తయిందని ప్రకటించడం సిగ్గుచేటు
### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

**కరీంనగర్‌టౌన్, ప్రభాతవార్త:** కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే, ఆప్, సీపీఎం పార్టీలపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. లిక్కర్ దొంగలంతా ఒకే చోట సమావేశమై డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. "స్టాలిన్ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల లిక్కర్ స్కాం చేసింది. కేరళలోనూ లిక్కర్ స్కాం బయటపడింది. ఆప్, బీఆర్ఎస్ నేతలు ఆల్రెడీ లిక్కర్ స్కాం చేసి జైలుకు పోయింది. వీళ్లంతా కలిసి డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతూ మోదీ ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారు"అని దుయ్యబట్టారు. వాళ్లంతా దేశ జీడీపీకి, పార్లమెంట్ లో ప్రాతినిధ్యానికి లింకు పెట్టడంపై మండిపడ్డారు. "నిన్న చెన్నైయ్‌లో స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లిక్కర్ దొంగల ముఠా ఒకే చోట సమావేశమై విచిత్రమైన తీర్మానం చేశారు. దేశ జీడీపీలో దక్షిణాది వాటా 36 శాతం ఉన్నందున పార్లమెంట్ లో కూడా దక్షిణాదికి 36 శాతందాకా వాటా ఇవ్వాలని అడుగుతున్నరు. ఇదేం విచిత్రం? దేశ జీడీపీకి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యానికి సంబంధమేంది? అట్లనుకుంటే తెలంగాణ జీడీపీలో వెనుకబడ్డ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ములుగు వంటి జిల్లాల ప్రాతినిధ్యం చాలా తక్కువ. అంత మాత్రాన అసెంబ్లీలో వాటికి ప్రాతినిధ్యం ఉండ కూడదా? ఇదెక్కడికి దిక్కుమాలిన ప్రతిపాద? దక్షిణాది పేరుతో రాజకీయాలు చేస్తూ డీలిమిటేషన్ ను అడ్డుకునే కుట్రలు చేయడమేంది?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదివారం కరీంనగర్‌లోని శుభం గార్డెన్ లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి సంజయ్ హాజరై ప్రసంగించారు. టీచర్ల దమ్మేందో, తపస్ అనే ఉపాధ్యాయ సంఘం తలుచుకుంటే ఏమైతదో మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపించారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులారా.... మీరంతా ఏ సంఘంవైపు చూడకండి. జాతీయవాద భావజాలం, టీచర్ల కోసం కొట్లాడే ఏకైక సంఘం తపస్. ఆ సంఘంలోనే చేరాలని కోరుతున్నా.

మీకోసం కొట్లాడేది, దెబ్బలు తినేది, జైలుకు కూడా పోయేందుకు వెనుకాడని నాయకులు తపస్ మాత్రమే. అందుకే తపస్ బలపర్చిన అభ్యర్థి మల్క కొమరయ్యకు టికెట్ ఇప్పించి సునాయాసంగా గెలిపించింది. తపస్ ను రాష్ట్రంలో నెంబర్ వన్ సంఘంగా మార్చి తీరుతాం.

తెలంగాణ సాధనలో టీచర్ల, ఉద్యోగుల పాత్ర మరువలేం. 42 రోజుల సకల జనుల సమ్మె చేసి తెగించి కొట్లాడి రాష్ట్రం సాధించుకున్నరు. కానీ 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనతో తెలంగాణ అప్పుల పాలైంది. కేసీఆర్ కుటుంబ పాలనతో సర్వ నాశనమైంది. గతంలో కేసీఆర్ మనుషులు బీదర్ లో ఒక ప్రింటింగ్ ప్రెస్ లో దొంగ నోట్లు ముద్రించారు. ఆ ప్రింటింగ్ ప్రెస్‌ను మూసి వేసేందుకు మన రాష్ట్ర పోలీసులు వెళితే... ఒత్తిడి తెచ్చి అక్కడికి వెళ్లకుండా చేశారు.ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో పంచిన నోట్లన్నీ దొంగ నోట్లే.

బీఆర్ఎస్ పాలన పీడ విరగడ కావాలని ఆ పార్టీని ఓడించి కాంగ్రెస్ కు అధికారం అప్పగిస్తే ఏం ఒరిగింది? కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పుల్లో మునిగిపోయిందని చెప్పిన రేవంత్ రెడ్డి అయినప్పటికీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను తీర్చడంతోపాటు 6 గ్యారంటీలను కూడా అమలు చేసి తీరుతామని ప్రకటించారు. కానీ ఏమైంది? 15 నెలలుగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ పార్టీ దారుణంగా వంచిస్తూనే ఉన్నడు. విద్యాశాఖకు అసలు మంత్రి కూడా లేదు. ఆయనే ఆ శాఖ మంత్రిగా ఉన్నా టీచర్లకు ఒరిగిందేమీ లేదు. కేంద్రం ప్రతి 6 నెలలకు ఒకసారి డీఏ ఇస్తోంది... నిత్యం మోదీపై విషం కక్కే కాంగ్రెస్ ప్రభుత్వం 5 డీఏలు ఎందుకు పెండింగ్ లో పెట్టారు? మరో 3 నెలలైతే జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని సంజయ్



ఆదివారం కరీంనగర్‌లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

# చేపాక్‌లో చెలరేగిన సిఎస్కే

### నాలుగు వికెట్ల తేడాతో ముంబయి ఓటమి



**చెన్నై, మార్చి 23:** ఐపిఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్‌కింగ్స్ 2025 ఐపిఎల్‌లో బోణీచేసింది. ఆదివారం చేపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో తన ప్రత్యర్థి ముంబయి ఇండియన్స్‌పై నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. 156 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో ఆరువికెట్లునష్టపోయి చెన్నైజట్టు ఛేదించి విజయం అందుకుంది. చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 26 బంతుల్లో ఆరుఫోర్లు, మూడు సిక్సర్లతో 53పరుగులు చేసాడు. చెన్నై గెలుపులో కీలకంగా నిలిచాడు. రచిన్‌రవీంద్ర 45 బంతుల్లో రెండు ఫోర్లు నాలుగు సిక్సర్లుచేసి 45 బంతుల్లో 65 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. చివరివరకూ క్రీజులో ఉండి చెన్నైని గెలిపించారు. ముంబై తరపున విగ్నేశ్‌పుత్తూర్ 3 వికెట్లతో మెరిసాడు. పిచ్‌స్లోగా ఉండటంతో సిఎస్కే లక్ష్యఛేదన తడబడుతూనే ఆరంభించింది. రాహుల్ త్రిపాఠి రెండు పరుగులతో నిరాశపరిచాడు. ఈ దశలోక్రీజులోకి వచ్చిన కెప్టెన్ రుతురాజ్‌గైక్వాడ్ ధాటిగా బ్యాటింగ్‌చేసాడు. ఫలితంగా చెన్నై సూపర్‌కింగ్స్ లక్ష్యంవైపు పరుగులుతీసింది. రచిన్‌రవీంద్ర ఒక ఎండ్‌లో ఆచితూచి ఆడితే మరో ఎండ్‌లో రుతురాజ్‌గైక్వాడ్‌మెరుపులు మెరిపించాడు. రుతురాజ్ ఔట్ అయిన తర్వాత చెన్నై వెంట వెంటనే వికెట్లను కోల్పోయింది. దూబే తొమినమది, దీపక్‌హూడా ఐదు, శ్యామకరణ్ నాలుగుపరుగులుచేసి ఘోరంగా విఫలం అయ్యారు. దాంతో చెన్నై ఐదు వికెట్లను నష్టపోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రవీంద్రజడేజా 18 బంతుల్లో 17 పరుగులుచేసి కొంత మెరుగనిపించాడు. చివరిలో ధోనీ క్రీజులోకి వచ్చినా రెండు బంతులను ఆడే అవకాశం మాత్రమే వచ్చింది. రచిన్‌రవీంద్ర విన్నింగ్‌షాట్‌తో మ్యాచ్‌ను ముగించాడు. తొలుత బ్యాటింగ్‌చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 155పరుగులుయమాత్రమేచేసింది. ఐపిఎల్ 2025 సీజన్‌లోభాగంగా వీరిద్దరికీ ఇదే తొలిమ్యాచ్‌కావడం గమనార్హం. చేపాక్‌స్టేడియంలో చెన్నై బౌలర్లు మరోసారి రాణించారు. నూర్ అహ్మద్ నాలుగు వికెట్లతోమెరిశాడు. ఖలీల్ అహ్మద్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఇద్దరి ధాటికి ముంబయి ఇండియన్స్ ఏదశలోనూ కోలుకోలేకపోయింది. తిలక్‌వర్మ 25 బంతుల్లో 31పరుగులుచేసాడు. ఆతడే టాప్‌స్కోరరుగా నిలిచాడు. తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్ 26 బంతుల్లో 29 పరుగులుచేసి నిరాశనే మిగిల్చాడు. చివరిలో దీపక్ చాహర్ 15 బంతుల్లో 29 పరుగులుచేసి నాటౌట్‌గానే నిలిచి ధాటిగా ఆడటంతో ముంబయి ఇండియన్స్ 155 మార్కుకు చేరింది.

## నేడే వెంకన్న వార్షిక బడ్జెట్

### రూ.5,400కోట్లరూపాయల అంచనాతో ప్రతిపాదనలు
### హుండీ ద్వారా రూ.1,800కోట్లు ఆదాయం దిశగా అడుగులు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అత్యంత సంపన్న వంతమైన హిందూ దేవుళ్ళలో తిరుమల శ్రీవేం కటేశ్వరస్వామికి సంబంధించిన 2025-26 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు 5,400కోట్ల రూపాయలపైమాటగానే అంచనాలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో రానున్న ఆర్థిక సంవత్సరంలో భక్తులు తమ మొక్కుబడుల్లో కానుకల రూపంలో 1,800కోట్ల రూపాయలు ఆదాయం రావచ్చనే అభిప్రాయంతో రూపొందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత టిటిడి పాలకమండలి ఆదాయాన్ని పెంచుకునే దిశగా, వ్యయాన్ని తగ్గించే మార్గాలను అనుసరిస్తోంది. టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడు సారథ్యంలోని పాలకమండలి, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరు మామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవేంకటేశ్వరస్వామికి ఆదాయం చేకూర్చేదిశగా కార్యాచరణ రూపొందించారు. సోమవారం తిరుమలలో జరగనున్న వార్షిక బడ్జెట్ పాలకమండలి సమావేశంలో దీన్ని ఆమోదించనున్నారు. గత ఏడాది మార్చినెల నుండి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి హుండీద్వారా రాబడిన ఆదాయాన్ని పరిగణనలోనికి తీసుకుని బడ్జెట్ తయారుచేయడం షరామామూలే. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత ఏడాది ఫిబ్రవరి ఆఖరులోనే వార్షిక బడ్జెట్‌ను 5,141.74కోట్ల రూపాయల అంచనాతో అప్పటి టిటిడి ధర్మకర్తలమండలి ఆమోదించిన విషయం విదితమే. ఈ ఏడాది అంతేస్థాయిలో కొంచెం ఇంచుమించుగా 5,400కోట్ల రూపాయల వరకు ఆదాయం సముపార్జన ఉండవచ్చనేది అంచనా . టిటిడి ఉన్నతాధికారులు వార్షిక గణాంకాలు ప్రాతిపదికన బడ్జెట్ రూపొందించి,తుది మెరుగులు దిద్దారు.దీన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు కూడా పరిశీలించారు. 2024-25 వార్షిక బడ్జెట్‌లో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు ,శ్రీవేంకటేశ్వరస్వామికి ఆదాయం 5,141కోట్లు సముపార్జించుకునే రీతిలో రూపొందించారు. వడ్డీకాసులవాని దర్శనానికి విచ్చేస్తున్న భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి సమర్పించే ఆదాయం రూపేణా 1,611కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. స్వామివారి ప్రసాదాల విక్రయం ద్వారా 600కోట్ల రూపాయలు, ఆర్జితసేవలు, విఐపి బ్రేక్ దర్శనాలు, ప్రత్యేకప్రవేశదర్శనాలు ద్వారా 338కోట్లు, ఆర్జితసేవల ద్వారానే 150కోట్లు, కల్యాణమండపాల అద్దెరూపంలో 147కోట్లు రూపాయలు, భక్తులు సమర్పించే తలనీలాల ద్వారా కల్యాణకట్టనుండి 151.50కోట్ల రూపాయలు, వివిధ బ్యాంకుల్లో దేవుని డిపాజిట్లు ద్వారా 1,167కోట్ల రూపాయలు వడ్డీరూపంలో ,ఇతరత్రా రూపేణా 129కోట్లు రూపాయలు ఇలా వరుసగా ఆదాయం 5,141 కోట్లు సముపార్జించుకునేలా అంచనా వేశారు.

# రెండేళ్లుగా పెండింగ్‌లో బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల బిల్లులు

### ఆందోళనలో 25వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బెస్ట్ అవెలబుల్ స్కూల్స్‌లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. గత రెండేళ్లుగా వారికి రావల్సిన పెండింగ్ బిల్స్ రావడం లేదు. సుమారు రూ. 200 కోట్లకిపైగా బిల్స్ పెండింగ్‌లో ఉండటంతో.. అటు బెస్ట్ అవెలబుల్ స్కూల్స్ యాజమాన్యాలతోపాటు ఇటు విద్యార్థులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత రెండేళ్లుగా బిల్స్ పెండింగ్‌లో ఉండగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పెండింగ్ బిల్స్‌లో కొంత మొత్తాని రిలీజ్ చేసింది. మిగిలిన పెండింగ్ బిల్స్‌ను కూడా రిలీజ్ చేయాలని బెస్ట్ అవెలబుల్ స్కూల్స్ కోరుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో సుమారు 180 బెస్ట్ అవెలబుల్ సూళ్లను ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ సూళ్లలో విద్య అభ్యాసం కొరకు నిర్వహిస్తున్నారు. వాటిలో మొత్తం 25వేల మంది చదువును కొనసాగిస్తున్నారు. వారిలో 18వేల మంది ఎస్సీ క్యాటగిరీ విద్యార్థులుండగా.. 7వేల మంది ఎస్టీ క్యాటగిరీ విద్యార్థులున్నారు. ఎస్సీ విద్యార్థుల్లో 12వేల హాస్టల్ సీట్లు కొనసాగుతుండగా.. డే స్కాలర్స్ 6వేల సీట్లు ఉన్నాయి. బెస్ట్ అవెలబుల్ స్కూల్స్ విధానం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించగా.. ఈ పథకంలో అణచివేతకు గురైన వర్గాలకు సంబంధించిన వారు, తమ కుటుంబాల్లో చదువుకుంటున్న తొలితరం వారు, ఎక్కువ మంది జోగిని వ్యవస్థకు గురైన వారి పిల్లలు, వ్యవసాయ కూలీల పిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ఏర్పడిన తరువాత మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఉమ్మడి ఏపిలో 8వేల ఉన్న సీట్లను కాస్త 17వేలు పెంచారు. రెండు సంవత్సరాల నుండి బెస్ట్ అవెలబుల్ స్కూల్స్‌కి సంబంధించిన ఫీజు బకాయి నిధులు, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని బెస్ట్ అవెలబుల్ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి యాదగిరి శేఖర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీనగర్ సోనామార్గ్ రోడ్డులో భారీ ప్రమాదం

### నలుగురు మృతి, 17 మందికి గాయాలు

**శ్రీనగర్, మార్చి 23:** శ్రీనగర్ సోనామార్గ్ రోడ్డులో ఒక బస్సు, టాక్సీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు చనిపోగా మరో 17 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గండేర్‌బాల్‌జిల్లాలో ఆదివారం ఈ ఘోరం జరిగింది. గుండ్ సమీపంలో ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో భారీస్థాయిలో దెబ్బతిన్నాయి. 21 మందికి ఈప్రమాదంలో గాయాలయ్యాయి. వీరిలో నలుగురు మృతిచెందగా 17 మందికి చికిత్స జరుగుతోంది. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్ నంబరుతో ఉన్న ట్యాక్సీలో వీరంతా ప్రయాణిస్తున్నారు. మృతులంతా కూడా పర్యాటకులుగా భావిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 72వ ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకిద్దాం!

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 23, ప్రభాతవార్త:** ప్రగతిశీల మహిళా సంఘం (పివోడబ్ల్యు) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో 72వ ప్రపంచ సుందరి అందాల పోటీలను వ్యతిరేకిస్తూ ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షురాలు జి అనసూయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పివోడబ్ల్యు జాతీయ నాయకు రాలు వి. సంధ్య మాట్లాడుతూ మిస్ వరల్డ్ ప్రపంచ సుందరి పోటీలను తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదులో మే నెలలో జరపనున్నట్లు మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు ప్రకటించారని, మే 7 న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం మే 31న గ్రాండ్ ఫినాలేతో ముగుస్తుందని, తెలం గాణ రాష్ట్రంలో ఈ వేడుకలు జరగడం సంతోష దాయకమని తెలంగాణ కళా సంస్కృతులు ప్రపంచానికి తెలియడానికి ఇది ఒక అవకాశమని మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లీ, తెలంగాణ ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక వారసత్వ, యువ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి స్మిత సబర్వాల్‌తో కలిసి ప్రకటించడాన్ని మహిళలందరూ వ్యతిరేకించాలని, పోటీలు జరగకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో 1996 లో బెంగళూరులో ,2024 లో ముంబై లో ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించారు. భారత్లో ఈ పోటీలు జరగడం ఇది మూడో సారి. హైదరాబాదుకు ఉన్న చారిత్రక నేపథ్యం వల్లనే ఈ పోటీలకు వేదికగా ఎంపిక చేసినట్లు చెప్తున్నారు . ఇది తెలంగాణ పర్యాటక రంగానికి గొప్ప అవకాశమని తెలంగాణ ఆహారం ,ఆతిథ్యం ,పర్యాటకం, చేనేత వస్త్రాలు పెట్టుబడులు ఇలా అన్ని రంగాలలో తెలంగాణ అభివృద్ధికి ఈ వేడుక ఒక అవకాశం అని స్మిత సబర్వాల్ చెప్పడం మహిళకు అవమానకరమని జాతీయ నాయకులు జి. ఝాన్సీ అన్నారు.

తెలంగాణ ప్రతిష్టను ఇనుమడింప చేయడానికి అనేక మార్గాలు ఉండగా మహిళలకు అవమానకరమైన అందాల పోటీలను ఎంచుకోడం సిగ్గుచేటని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ అన్నారు. స్త్రీల శరీరాలను ప్రదర్శన వస్తువుగా మార్చి సామ్రాజ్యవాద మార్కెట్ కు ప్రయోజనాలు చేకూర్చే ఈ పోటీలకు హైదరాబాదు వేదిక కావడం అందరూ వ్యతిరేకించవల్సిన విషయం అని రాష్ట్ర అధ్యక్షులు జి. అనసూయ అన్నారు.


ప్రసంగిస్తున్న పిఒడబ్ల్యు జాతీయ నాయకురాలు వి.సంధ్య

అనంతరం ఈ సమావేశంలో ఐద్వా అధ్యక్షులు అరుణ జ్యోతి, రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి, రచయిత్రులు కమల, బండారు విజయ, చైతన్య మహిళా సంఘం నాయకులు జయ, శ్రీదేవి తదితర మహిళా సంఘాల నేతలు పాల్గొని పోటీలను నిలిపివేసేంత వరకు ఉద్యమిద్దాం అని పిలుపునిచ్చారు.




## విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో ఎన్ఐటి ప్రొఫెసర్ అరెస్టు

**సిల్చార్,(అస్సాం), మార్చి 23:** అసోంలోని సిల్చార్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను లైంగిక వేధింపుల కేసులో పోలీసులు అరెస్టు చేసారు. ఒక విద్యార్థిని పట్ల ఆయన అనుచితంగా ప్రవర్తించారని ఆమె ఫిర్యాదు చేశారు. ఎస్పి నుమాల్ మహట్టా మాట్లాడుతూ ధేనుకొండ కోటేశ్వరరాజు నీట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడని, ఆతడిని క్యాంపస్ ఆవరణలోనే అరెస్టు చేసామని చెప్పారు. ఆమె కుటుంబంతోపాటు ఆ విద్యార్థిని కూడా వేరుగా ఫిర్యాదులు చేసారని అన్నారు. ముందు తన క్వార్టర్‌లో తలుపులు తాళం వేసుకుని దాక్కోవాలని ప్రయత్నించాడని, అయితే ఆతని మొబైల్‌ఫోన్ లొకేషన్ ట్రేస్‌చేసామని, సాయంత్రం 5.30 గంటలప్రాంతంలో అరెస్టుచేసినట్లు తెలిపారు. భారతీయ న్యాయసంహిత కింద వివిధసెక్షన్లపరిధిలో ఆయనపై కేసునమోదుచేసామని ఎస్పీతెలిపారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం బోధిస్తున్న ప్రొఫెసర్‌ను ఇన్‌స్టిట్యూట్ వెంటనే సస్పెండ్‌చేసింది. టెక్నాలజీ డిగ్రీచేస్తున్న విద్యార్థిని ఫిర్యాదుఆధారంగా సస్పెండ్‌చేసి విచారణకు ఆదేశించామని వరిసటీ అధికారులు తెలిపారు. విద్యార్థులుకూడా వెంటనే ఈఅసిస్టెంట్‌ప్రొఫెసర్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ అశీమ్‌రాయ్ మాట్లాడుతూ సంఘటన జరిగిన ఛాంబర్‌ను సీల్‌చేసామని, బాధితురాలికి అన్నివిధాలా అండగా ఉంటామని, ఆమె స్వేచ్ఛగా నిర్భయంగా ఉండవచ్చన్నారు. వర్సిటీలోని అంతర్గత ఫిర్యాదుల కమిటీకి పంపించామని విచారణ కొనసాగుతుందన్నారు. అరెస్టు అయిన ప్రొఫెసర్ ఈసంఘటనకు సంబంధించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

# భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం శ్రీకారం

### భూభారతి చట్టం-2025తో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
### రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో జెఎసి ఛైర్మన్ లచ్చిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త :** భూ సమస్యల పరిష్కారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసకు వచ్చిందని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం ఉమ్మడి కరీంనగర్‌లోని మంచిర్యాలలో జరిగిన రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు సేవలందిం చేందుకు అందుబాటులోకి 10,954 మంది గ్రామ పాలన అధికారులుప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే సైనికులుగా పని చేస్తామన్నారు.ప్రభుత్వ సహకారంతో ఎన్నో విజయాలు సాధించు కున్నామని,తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల ఏర్పాటు పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలను మాతృ సంస్థ లోకి తీసుకోవడం గొప్ప విజయంగా ఆయన అభివర్ణించారు. తహాశీల్దార్లు, ఆర్డీఓలు, జేసీలు కొల్పోయిన అధికారాలను భూభారతి చట్టంతో పునరుద్ధరించుకున్నామని తెలిపారు.రాష్ట్రంలో భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం త్వరలోనే గ్రామ పాలన అధికారులను అందుబాటులోకి తేనున్న ట్టుగా తెలిపారు.ప్రజా పాలనలో ప్రభుత్వం ఒకవైపు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేస్తూనే..మరోవైపు రైతులకు, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలను క్షేత్రస్థాయిలోనే అందించే విధంగా కృషి చేస్తుందన్నారు. నాడు రైతులకు, ప్రజలకు దూరా భారంగా ఉన్న రెవెన్యూ సేవలు సైతం నేడు అందుబాటులోకి వచ్చాయన్నారు.సిఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో పాటు, మంత్రివర్గం, రెవెన్యూ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ పెద్దల,ఉన్నతాధికారుల అందరి సహకారంతో అనతి కాలంలోనే అనేక చారిత్రిక విజయాలు సొంతం చేసుకుని తెలంగాణ ఉద్యోగ జేఏసీ రాష్ట్రంలోని ఉద్యోగులకు కొండంత అండగా నిలిచిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే సైనికులుగా రెవిన్యూ ఉద్యోగులుగా పనిచేస్తున్నామని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉద్యోగులకు అండగా నిలుస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సహకారంతో అనేక విజయాలు సాధించి ఉద్యోగులు ఆత్మాభిమానాన్ని రెట్టించిన ఉత్సాహంతో ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజా సంక్షేమానికి అవిశ్రాంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు.సిఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ అనతి కాలంలోనే ఎన్నో చారిత్రక విజయాలు సాధించుకున్నామని, ఇందులో భాగంగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాధించడం, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల సంఖ్యను పెంచడం, గ్రామ స్థాయిలో రెవెన్యూ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామానికో అధికారిగా 10,954 పోస్టుల ఏర్పాటు అతిపెద్ద విజయాలుగా లచ్చిరెడ్డి గుర్తు చేశారు. గత ప్రభుత్వం జీఓ నం.317తో రాష్ట్రంలో ఉద్యోగులను చిన్నాభిన్నం చేసిందన్నారు. ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలకు సైతం చెట్టుకొక్కరికి పుట్టకొక్కరికి పోస్టింగ్‌లు ఇచ్చారన్నారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా స్పౌజ్, మెడికల్, తదితర కోణాలలో ప్రభుత్వం బదిలీలను చేసిందన్నారు. రాష్ట్రంలో కొత్త డివిజన్లు, కొత్త మండలాలలో పోస్టుల మంజూరు, జూనియర్ అసిస్టెంట్ల నుంచి డిప్యూటీ కలెక్టర్లు వరకు పదోన్నతులు సాధించడం, తహాశీల్దార్లు, ఆర్డీఓలు, జేసీలు గతంలో కొల్పోయిన అధికారాలను భూభారతి చట్టం 2025తో పునరుద్ధరణ, పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలను ఆప్షన్ పద్ధతిలో తిరిగి మాతృశాఖలోకి తీసుకోవడం, పూర్వ వీఆర్‌ఏలు వేరువేరు జిల్లాలకు బదిలీ అయిన వారిని తిరిగి వారి సొంత జిల్లాకు తీసుకురావడం తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ సాధించిన విజయాలు అన్నారు. 10 ఏళ్ల తర్వాత 330 మందిని అధికారికంగా అవుట్ సోర్సింగ్ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా నియాకం చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లండ్ మహిళా జట్టు కెప్టెన్ గుడ్‌బై




**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్ హీథర్ నైట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కెప్టెన్సీ నుంచి హీథర్ నైట్ తప్పుకుంది. ఈ విషయాన్ని ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ధ్రువీకరించింది. ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్సీలో అద్భుతమైన విజయాలను అందించిందిన హీథర్ నైట్ పదవి నుంచి వైదొలిగింది. 9 ఏళ్ల పాటు కెప్టెన్‌గా సేవలు అందించినందుకు థాంక్యూ నైట్ అని ఈ సందర్భంగా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు పేర్కొంది. కాగా 2016లో కెప్టెన్‌గా ఎంపికైన హీథర్ నైట్ 199 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ ఉమెన్స్ టీమ్‌ను ముందుండి నడిపించింది. ఆమె సారథ్యంలోనే 2017 వన్డే ప్రపంచ కప్‌ను ఇంగ్లండ్ గెలుచుకుంది. అంతే కాకుండా ఇంగ్లండ్ జట్టును ఐసీసీ టోర్నమెంట్లలో ఫైనల్‌కు కూడా నైట్ చేర్చింది. ఆమె వరుసగా రికార్డు స్థాయిలో ఎనిమిది వన్డే సిరీస్‌లను ఇంగ్లండ్‌కు అందించింది. అయితే ఇటీవల కాలంలో మాత్రం నైట్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు దారుణ ప్రదర్శన కనబరిచింది. గత ఏడాది యూఏఈ వేదికగా జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో గ్రూపు స్టేజిలోనే ఇంగ్లీష్ జట్టు ఇంటి ముఖం పట్టింది. ఆ తర్వాత యాషెస్ సిరీస్‌లో కూడా అదే తీరును ఇంగ్లండ్ జట్టు కనబరిచింది. ఈ క్రమంలోనే ఇంగ్లండ్ జట్టు పగ్గాల నుంచి ఆమె తప్పుకుంది. ఇక ఇంగ్లండ్ కొత్త కెప్టెన్‌గా నాట్ స్కీవర్ బ్రంట్ ఎంపికయ్యే ఛాన్స్ ఉంది.

## వరల్డ్ కప్ ఫైనల్‌కు ప్రణతి



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ జిమ్నాస్టిక్ ఫెడరేషన్ (ఎఫ్ఐజీ) వరల్డ్ కప్ వాల్ట్ ఫైనల్‌కు ఇండియా జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ అర్హత సాధించింది. తాజాగా జరిగిన వాల్ట్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో ప్రణతి 13.317 పాయింట్లతో మూడో ప్లేస్‌లో నిలిచింది. అమెరికా జోడీ జైలా హాంగ్ (13.783), క్లైరీ పీస్ (13.584) వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. క్వాలిఫికేషన్‌లో ప్రణతి బాగా రాణించింది. అనుకున్న ప్లాన్‌ను వ్యూహాత్మకంగా, సమర్థంగా అమలు చేసింది. ఫైనల్లో మెడల్ గెలిచే పట్టుదలతో ముందుకు దూసుకువెళుతోంది. కాగా పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కైరోలో జరిగిన వరల్డ్ కప్ టోర్నమెంట్ విమెన్స్ వాల్ట్ ఈవెంట్‌లో ప్రణతి కాంస్యం మెడల్‌తో మెరిసింది. 2019లో ఉలెన్బార్, 2022 దోహా ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ ఆమె కాంస్యాలు సాధించింది.

# విదేశీ లీగ్స్‌లో భారత్‌కు నో ఎంట్రీ




### రిటైర్ అయిన తరువాతే ఎన్‌ఒసి
### ఐపిఎల్‌లో ఇతర కంట్రీ ప్లేయర్లు
### క్రికెట్ బోర్డు నిబంధనలు అడ్డు

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజను 18 ప్రారంభమై అప్పుడే మూడు మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ సీజన్‌లో 10 జట్లు పాల్గొంటుండగా వీటిల్లో వివిధ దేశాలకు చెందిన ప్లేయర్లు ఆడుతున్నారు. ఐపీఎల్‌లో ఆడేందుకు పలువురు విదేశీ ప్లేయర్లు క్యూ కడతారు. అయితే విదేశీ క్రికెట్ లీగ్ లలో భారత ప్లేయర్లు మాత్రం ఆడరు. దానికి ప్రధాన కారణం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నో అంటోంది. భారత క్రికెటర్లు విదేశీ క్రికెట్ లీగ్‌లలో ఆడకూడదని బీసీసీఐ స్పష్టమైన కొన్ని రూల్స్‌ను అమలు చేస్తోంది. ఐపీఎల్ లాగే వివిధ దేశాలు క్రికెట్ లీగ్ లను నిర్వహిస్తున్నాయి. వాటిలో బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్), ది హండ్రెడ్, కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్), ఎస్ఏ 20 వంటి చాలా క్రికెట్ లీగ్స్ ఉన్నాయి. వీటిలో ఐపీఎల్ ఆడుతున్న భారత క్రికెటర్లు ఆడరు. ఎందుకంటే భారత క్రికెటర్లు విదేశీలీగ్‌లలో ఆడితే ఐపీఎల్‌ను చూసేవారు తగ్గిపోతారు. దీంతో ఐపీఎల్ బ్రాండ్ వాల్యూ కూడా పడిపోతుంది. ఫలితంగా బీసీసీఐకి నష్టాలు వస్తాయి. ఇలాంటి చాలా కారణాలను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ ఐపీఎల్ ఆడే భారత ప్లేయర్ల కోసం రూల్స్ తీసుకువచ్చింది. విదేశీ క్రికెట్ లీగ్ లలో భారత ప్లేయర్లు ఆడాలంటే బీసీసీఐ నుంచి విధిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, యాక్టివ్ ఇండియన్ క్రికెటర్లు అంటే అంటే, అంతర్జాతీయ లేదా దేశవాళీ క్రికెట్ ఆడుతున్నవారికి విదేశీ లీగ్ లలో ఆడేందుకు బీసీసీఐ నో అబ్యక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఒసి) ఇవ్వదు. అయితే, భారత క్రికెటర్లు ఐపీఎల్, దేశవాళీ క్రికెట్, అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్ అయిన తర్వాత మాత్రమే ఇతర దేశాల క్రికెట్ లీగ్స్‌లో ఆడేందుకు అనుమతి ఉంటుంది. ఈ విధంగానే రోబిన్ ఊతప్ప రిటైర్మెంట్ తర్వాత ఇంటర్నేషనల్ లీగ్ టీ20 (ఐఎల్‌టీ20)లో ఆడాడు. సురేశ్ రైనా ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన అబుధాబి టీ10 లీగ్‌లో పాల్గొన్నాడు. అలాగే, దినేష్ కార్తీక్ గత సీజన్ తర్వాత ఐపీఎల్ కు రిటైర్మెంట్ ప్రకటించి సౌత్ ఆఫ్రికా ప్రీమియర్ టీ20 లీగ్ (ఎస్ఏ20 లీగ్)లో ఆడాడు. బీసీసీఐ ఇలా ఇతర లీగ్ లలో భారత ప్లేయర్లను ఆడకుండా రూల్ పెట్టడం వెనుక ఐపీఎల్ ప్రత్యేకతను కాపాడే ఉద్దేశం ఉంది. భారత ఆటగాళ్లు ఇతర లీగ్స్‌లో ఆడితే ఐపీఎల్ ప్రత్యేకత తగ్గిపోతుంది. భారత ఆటగాళ్లు కేవలం ఐపీఎల్‌లో మాత్రమే ఆడితే ఆర్థికంగా ఐపీఎల్ విలువ పెరుగుతుంది. అలాగే, టీమిండియా ప్లేయర్లు ఇప్పటికే బిజీ షెడ్యూల్ గడుపుతున్నారు. కొత్త లీగ్స్‌లో ఆడితే గాయాల ప్రమాదం ఎక్కువ అవుతుంది. అందుకే బీసీసీఐ ఇతర లీగ్ లను ఆడేందుకు భారత ఆటగాళ్లను అనుమతించదు.




### జాతీయ మహిళల చాలెంజర్ ట్రోఫీ..
# నాలుగు జట్లు ఖరారు

### కెప్టెన్లుగా మిన్ను, హార్లీన్, జెమీమా, స్నేహ
### తెలంగాణ అల్ రౌండర్ త్రిషకు చోటు
### 25 నుండి ఏప్రిల్ 8 వరకూ టోర్నీ

**న్యూఢిల్లీ:** జాతీయ సీనియర్ మహిళల చాలెంజర్ ట్రోఫీ-2025 కోసం జట్ల ఎంపిక ఖరారైంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) జట్లను ప్రకటించింది. డెహ్రాడూన్ వేదికగా ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 8 వరకు ఈ టోర్నీ నిర్వహించనున్నారు. మూడు రోజుల ఫార్మాట్‌లో ఈ మ్యాచ్‌లను నిర్వహిస్తుండగా, ఇందులో 4 జట్లు పాల్గొంటున్నాయి. స్టార్ ప్లేయర్లు హార్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన ఈ టోర్నీనికి దూరం కాగా, యంగ్ ప్లేయర్లకు అవకాశం దక్కింది. ఈ సీనియర్ మహిళల మల్టీ డే చాలెంజర్ ట్రోఫీ కోసం మహిళల సెలెక్షన్ కమిటీ 4 జట్లను ఎంపిక చేసింది. ఎర్రబంతితో జరగనున్న ఈ టోర్నీని డెహ్రాడూన్‌లోని రెండు వేదికల్లో నిర్వహిస్తోంది. మిన్ను మణి, హార్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, స్నేహ రాణా నాలుగు జట్లకు సారథ్యం వహించనున్నారు. అలాగే భారత మహిళల అండర్-19 జట్టుకు రెండో సారి ప్రపంచ కప్ అందించడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ ఆల్‌రౌండర్ గొంగడి త్రిషకు టీమ్ డిలో చోటు దక్కింది. ఖరారైన జట్లలో టీమ్ ఎలో మిన్ను మణి (కెప్టెన్), రిచా ఘోష్, శిప్రా గిరి, సుభ సతీశ్, శ్వేతా షెహ్రావత్, వృందా దినేశ్, ముక్తా మగ్రే, హెన్రిట్టా పెరీరా, తనూజ కన్వర్, వాసవి పావని, ప్రియా మిశ్రా, అరుంధతి, సయాలీ సత్‌ఘరే, అనాడీ తగ్డే, ప్రగతి సింగ్‌లు ఉన్నారు. అలాగే టీమ్ బి లో హార్లీన్ డియోల్ (కెప్టెన్), యస్తిక భాటియా, మమత, ప్రతీక రావల్, ఆయుశ్ సోని, ఆరుశీ గోయల్, కనిక అహూజా, మితా పాల్, శ్రీ చరణి, మమత పాస్వాన్, ప్రేమ రావత్, నందిని శర్మ, క్రాంతిగౌడ్, అక్షర, టిటాస్ సాధు, టీమ్ సి లో జెమీమా రోడ్రిగ్స్ (కెప్టెన్), ఉమా ఛెత్రి, రియా చౌదరి, షఫాలీ వర్మ, త్రిప్తి సింగ్, తనుశ్రీ సర్కార్, తేజల్ హసబ్నిస్, సుశ్రీ దివ్యదర్శిని, సుచి ఉపాధ్యాయ, రాజేశ్వరి గైక్వాడ్, శరణ్య గద్వాల్, జోషిత, శబ్నమ్, సైమా ఠాకూర్, గరిమా యాదవ్, టీమ్ డి లో స్నేహ రాణా (కెప్టెన్), నందిని కశ్యప్, శివంగి యాదవ్, గొంగడి త్రిష, జిన్సీ జార్జ్, రాఘవి, ధార గుజ్జర్, సంస్కృతి గుప్తా, యమున రాణా, వైష్ణవి శర్మ, కీర్తన, అమన్‌జ్యోత్ కౌర్, కాశ్వీ గౌతమ్, మనాలీ దక్షిణి, మోనిక పటేల్‌ను ఎంపిక చేసింది.

# ఐపిఎల్‌లో సన్‌రైజర్స్ ఘన విజయం

### ఊచకోతతో బద్దలైన పవర్ ప్లే రికార్డు
### పోరాడి 44 పరుగుల తేడాతో ఓడిన రాజస్థాన్




**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజనులో రెండో రోజు రాజస్థాన్ రాయల్స్‌పై సన్ రైజర్స్ హైదరాబాద్ 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఉప్పల్ వేదికగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేయగా, తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. ఇక ఈ మ్యాచ్‌లో సన్ రైజర్స్ దుమ్ము దులిపేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్ ఆకాశమే హద్దుగా చెలరేగింది. సన్ రైజర్స్ బ్యాటర్లు బౌండరీల వర్షం కురిపించారు. సన్ రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్ (106 పరుగులు 41బంతుల్లో 11 ఫోర్లు,6 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా, ట్రావిస్ హెడ్ (67) హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. చివర్లో హెన్రిచ్ క్లాసెన్ (34) మెరిపించాడు. రాజస్థాన్ బౌలర్లలో దేశ్ పాండే 3, తీక్షణ 2, సందీప్ శర్మ 1 వికెట్ పడగొట్టారు. సన్ రైజర్స్ బ్యాటర్ల బీభత్సానికి ప్రేక్షకులు బౌండరీల వర్షంలో తడిసి ముద్దయ్యారు. ట్రావిస్ హెడ్ (67), అభిషేక్ శర్మ (24) శుభారంభం ఇచ్చారు. 3 ఓవర్లలోకు స్కోర్ 45 పరుగులు వచ్చాయి. అయితే 3.1 ఓవర్ వద్ద తీక్షణ బౌలింగ్‌లో అభిషేక్ (24 పరుగులు, 11 బంతుల్లో) క్యాచౌట్ అయ్యాడు. వన్ డౌన్‌లో వచ్చిన ఇషాన్‌తో కలిసి స్కోర్ బోర్డును జెట్ స్పీడ్‌తో పరుగులు పెట్టించాడు. పవర్ ప్లే ముగిసేసరికి స్కోర్ 94/1కి చేరింది. ఈ క్రమంలోనే ఈ జంట 19 బంతుల్లోనే 50 పరుగులు భాగస్వామ్యం పూర్తి చేసింది. ఎడాపెడా బౌండరీలు బాదుతూ బౌలర్లను బెంబేలెత్తించారు. హెడ్ 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. తర్వాత హెడ్ ఔటైనా ఇషాన్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. నితీశ్ రెడ్డి (30 పరుగులు)తో కలిసి ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. తీక్షణ బౌలింగ్‌లో నితీశ్ ఔటయ్యాక, క్లాసెన్ (34) మెరుపులు మెరిపించాడు. ఈ ఇద్దరిలో ఒక్కరు క్రీజులో ఉన్నా జట్టు స్కోర్ 300 దాటేదే! చివర్లో ఇషాన్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఐపీఎల్‌లో అతడికి ఇదే తొలి శతకం కావడం విశేషం. ఫలితంగా 6 వికెట్లు కోల్పోయి 286 పరుగులు చేసింది. ఈ లక్ష్య ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ పోరాడి ఓడింది. 20 ఓవర్లలో 242/6 పరుగులు మాత్రమే చేయగలిగింది. రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ 1, సంజూ శాంసన్ 66, రియాన్ పరాగ్ 4, నితీశ్ రాణా 11, ధ్రువ్ జురెల్ 70, షిమ్రాన్ హెట్మెయర్ 42 పరుగులు, శుభం దుబే 34 పరుగులు తీశారు.

# దలాల్ స్ట్రీట్‌కు ఐపిఒల వెల్లువ..

**ముంబై, మార్చి 23:** దలాల్ స్ట్రీట్‌లో ఐపిఒల సందడి మళ్లీ మొదలైంది. ఈవారంలో ఏకంగా 4 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. అయితే ఈ అన్ని సంస్థలు ఎస్ఎంఇ విభాగం నుంచే రావడం విశేషం. ప్రధాన బోర్డు నుంచి ఒక్కటంటే ఒక్కటి కూడా ఐపిఒ లేదు. దీంతో పాటు ఇప్పటికే మార్కెట్ నుంచి నిధులు సమీకరణ పూర్తి చేసుకున్న ఐదు సంస్థలు, స్టాక్ మార్కెట్లో లిస్ట్ కానున్నాయి. శ్రీ అహింస నేచురల్స్ పబ్లిక్ ఇష్యూ మార్చి 25న ప్రారంభమై 27తో ముగుస్తుంది. మొత్తం రూ.73.81 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సేల్ ద్వారా 10.80 లక్షల షేర్లు జారీ చేయనుంది. సబ్‌స్క్రిప్షన్ మార్చి 25న ప్రారంభమైన 27తో ముగుస్తుంది. ధరల శ్రేణిని రూ.112-118గా కంపెనీ ప్రకటించింది. ఇంధన రంగంలోని ప్రముఖ కంపెనీలలో ఒకటైన ఎటిసి ఎనర్జీస్ సిస్టమ్, లిథియం-అయాన్ బ్యాటరీలను ఉత్పత్తి చేస్తోంది. ఎస్ఎంఇ విభాగం నుంచి డెస్కో ఇన్ఫ్రాటెక్ లిమిటెడ్ ఐపిఒకు వస్తోంది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్, రెన్యూవబుల్ ఎనర్జీ, వాటర్‌అండ్ పవర్ వంటి వివిధ రంగాలలో ఇంజినీరింగ్, ప్లానింగ్, కన్‌స్ట్రక్షన్ వంటి సర్వీసులని అంది జారీ చేయనున్నారు. ధరల శ్రేణి రూ.147-150గా కంపెనీ నిర్ణయించింది. దీని సబ్‌స్క్రిప్షన్ మార్చి 26తో ముగుస్తుంది. ఏప్రిల్ 1న షేర్లు స్టాక్ మార్కెట్లో లిస్ట్‌కానున్నాయి. రూ.16.63 కోట్లు సమీకరించాలనే లక్ష్యంతో ఐడింటిక్స్ వెబ్ ఐపిఒకు వస్తోంది. ధరల శ్రేణి రూ.51-54గా కంపెనీ ప్రకటించింది. సబ్‌స్క్రిప్షన్ మార్చి 26న మొదలై 28తో ముగుస్తుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 30.80 లక్షల షేర్లు జారీ చేయనుంది.




ఐపిఒలో భాగంగా 42.04 లక్షల తాజా షేర్లు జారీ చేయనున్నారు. 19.99 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ఏప్రిల్ 1న దలాల్ స్ట్రీట్‌లో లిస్ట్‌కానుంది. సమీకరించిన నిధుల్ని వ్యాపార విస్తరణకు ఉపయోగించనుంది. గ్రీన్ కాఫీ బీన్స్, గ్రీన్ టీ వంటి ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేస్తుందీ కంపెనీ. ఎస్ఎంఇ విభాగం నుంచి వస్తున్న మరో కంపెనీ ఎటిసి ఎనర్జీ సిస్టమ్. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.63.76 కోట్లు సమీకరించనుంది. 43.24 లక్షల తాజా షేర్లు, ఆఫర్ ఫర స్తోంది. సబ్‌స్క్రిప్షన్ మార్చి 24న ప్రారంభమవుతుంది. ఐపిఒ ద్వారా రూ.30.75 కోట్లు సమీకరిం చనుంది. ఈ ఇష్యూను తాజా షేర్ల జారీ ద్వారా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 20.50 లక్షల తాజా వాటాలను

## యుపిఐతో చిరు వ్యాపారులకు మరిన్ని ప్రోత్సాహకాలు

**ముంబై, మార్చి 23:** వీధి చివర బడ్డీ కొట్టు నుంచి పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వరకూ అంతా యూపీఐని వాడుతున్నారు. ప్రజలు కూడా ఆ విధంగా అప్ డేట్ అయ్యారు. దీనిని మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా చిరు వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా.. తక్కువ మొత్తాలలో లావాదేవీలు చేసే వారికి ప్రోత్సాహకాలను ఇవ్వాలని నిర్ణయించింది. రూ.2000కన్నా తక్కువ ఉండే యూపీఐ లావాదేవీలపై ఈ ప్రోత్సాహకాలు ఉంటాయని పేర్కొంది. అదే సమయంలో వినియోగదారులకు ఎలా ఫీజులు ఉండవని ప్రకటించింది. చిన్న వ్యాపారులే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వీరి వద్ద తక్కువ మొత్తాలలో జరిగే యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రోత్సాహకాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చిరు వ్యాపారులపై భారాన్ని తగ్గించే లక్ష్యంతో తక్కువ మొత్తంలో యూపీఐ లావాదేవీలు చేసే వారి కోసం రూ.1500కోట్లను కేటాయించింది. రూ.2,000 వరకూ పర్సన్ టు మర్చంట్(పీ2ఎం) యూపీఐ లావాదేవీలపై వీటిని అందించనుంది. అంటే ఒక్కో లావాదేవీకి 0.15శాతం చొప్పున చిరు వ్యాపారులు ప్రోత్సాహకం పొందుతారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి మధ్య జరిగిన లావాదేవీలకు ఇది వర్తిస్తుంది. రూ.2,000 పైన జరిగిన లావాదేవీలకు ఈ పథకం వర్తించదు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకారం నెలకు రూ.50,000 కన్నా తక్కువ బిజినెస్ చేసే వ్యాపారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. అయితే చిరు వ్యాపారులు దీనిని కోసం క్లయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకులు కూడా ఈ క్లెయిమ్‌లను ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ఆమోదించాలని కేంద్రం సూచించింది. 80శాతం క్లెయిమ్‌లు ఎలాంటి అభ్యంతరాలు, షరతులు లేకుండా ఆమెదించాలని పేర్కొంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల చిరు వ్యాపారులకు మంచి ప్రయోజనం చేకూరుతుంది. అంతేకాక వారిని యూపీఐ వైపు ప్రోత్సహించినట్లు అవుతుంది. అదే సమయంలో సాధారణ పౌరులకు కూడా ఎలాంటి చార్జీలు లేకుండా సజావుగా చెల్లింపు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. ఎందుకంటే ఎండీఆర్ రేటు కూడా ఏం ఉండదని కేంద్రం ప్రకటించింది.




## వాణిజ్యం

# ఫండ్స్ ద్వారా రుణపరపతి

**ముంబై, మార్చి 23:** ఇటీవల కాలంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం ద్వారా చాలా మంది అధిక రాబడిని ఆర్జిస్తున్నారు. అయితే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడితో ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయని నిపుణులు వివరిస్తున్నారు. పెట్టుబడిదారులు అనుకోని సందర్భంలో సొమ్ము అవసరం పడినప్పుడు ఎస్ఐపీను రీడీమ్ చేసుకుంటారు. అయితే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులు వాటిని అమ్మకుండా తనఖా పెట్టడం ద్వారా రుణం పొందవచ్చని పేర్కొంటున్నారు. భారతీయ మ్యూచువల్ ఫండ్ యూనిట్లలో పెట్టుబడి పెట్టిన ఏ భారతీయ నివాసి అయినా మ్యూచువల్ ఫండ్‌పై రుణం పొందవచ్చు. మ్యూచువల్ ఫండ్లను తనఖా పెట్టి రుణం తీసుకోవడం సురక్షితమైనదిగా పరిగణిస్తారు. మ్యూచువల్ ఫండ్స్ తనఖా పెట్టి తీసుకునే రుణాలపై వడ్డీ రేట్లు ఇతర రుణ ఉత్పత్తుల కంటే చౌకగా ఉంటాయి. అయితే రుణం తీసుకునే ముందు మీ పెట్టుబడి లక్ష్యం, కాలపరిమితిని అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే మీ ఆదాయం నుంచి ప్రతి నెలా ఈఎంఐ లేదా వడ్డీ మొత్తాన్ని చెల్లించగలరా? అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని పేర్కొంటున్నారు. మీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు ఇప్పటివరకు ఎలా ఉన్నాయి? వంటి విషయాలను పాటు మీరు తీసుకునే రుణం మీ స్వల్ప లేదా మధ్యకాలిక ఆర్థిక అవసరాలను తీర్చడంలో సహాయపడుతుందా? అనే విషయాన్ని పరిశీలించాలని పేర్కొంటున్నారు. మ్యూచువల్ ఫండ్స్ ద్వారా రుణం తీసుకునే ముందు వడ్డీ రేటు, రుణ కాలపరిమితి, పునరుద్ధరణ ఎంపిక, షార్ట్‌ఫాల్ మార్జిన్ వంటి విషయాలను పరిశీలించాలని నిపుణులు చెబుతున్నారు. మ్యూచువల్ ఫండ్స్ ద్వారా తీసుకునే రుణాలపై వడ్డీ తక్కువగా ఉంటుంది. సాధారణంగా వ్యక్తిగత రుణాలపై వడ్డీరేటు 14 నుంచి 22 శాతం మధ్య ఉంటుంది. కానీ మ్యూచువల్ ఫండ్ల పేరుతో పొందిన




రుణాలపై వడ్డీ రేటు 10.5 శాతం నుంచి 12 శాతం వరకు ఉంటుంది. అయితే ఇలా తీసుకున్న రుణాన్ని ముందుగా చెల్లిస్తే ప్రీ క్లోజర్ జరిమానా ఉండదు. అలాగే కస్టమర్ డబ్బు అందుకున్న తర్వాత, అతను ఎప్పుడైనా రుణాన్ని తిరిగి చెల్లించవచ్చు. ఈ కాలంలో మ్యూచువల్ ఫండ్ యూనిట్ల విలువ పెరుగుతూనే ఉంటుంది. ఈ రుణాలు లోన్‌టువాల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తి ఆధారంగా ఇస్తారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అయితే ఎన్ఏవీలో 50శాతం నుంచి 70శాతం వరకు రుణం పొందవచ్చు. డెట్ మ్యూచువల్ ఫండ్ అయితే ఎన్ఏవీలో 80శాతం వరకు రుణం పొందవచ్చు.

## బ్యాటరీలపైనే విద్యుత్ స్కూటర్ల లైఫ్

**న్యూఢిల్లీ, మార్చి 23:** సాధారణంగా 'ఇవి' స్కూటర్స్‌లో లిథియం అయాన్ బ్యాటరీలను ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఉపయోగిస్తారు. ఇవి ఎక్కువగా 3 నుంచి 5 సంవత్సరాల వరకు ఉంటాయి. అయితే, బ్యాటరీ జీవితం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీలను ఛార్జింగ్ సైకిల్స్ ఆధారంగా కొలుస్తారు. మంచి నాణ్యత ఉన్న లిథియంఅయాన్ బ్యాటరీ 800 నుండి 1,500 ఛార్జింగ్ సైకిల్స్ వరకు ఉంటుంది. ఒక వ్యక్తి రోజూ 3040కి.మీ. స్కూటర్ నడిపి బ్యాటరీని సరిగ్గా ఛార్జ్ చేస్తే, అది దాదాపు 45 సంవత్సరాలు పనిచేస్తుంది. పదే పదే పూర్తిగా ఛార్జ్ చేయడం, బ్యాటరీని సున్నా శాతానికి డిశ్చార్జ్ చేయడం వల్ల దాని జీవితకాలం తగ్గుతుంది. ఛార్జ్‌ను 20 శాతం నుంచి 80 శాతం మధ్య ఉంచడం ఎల్లప్పుడూ మంచిది. అలాగే అధిక వేడి లేదా చలి బ్యాటరీ పనితీరును ప్రభావితం చేస్తుంది. స్కూటర్‌పై అధిక లోడ్ పెట్టడం వల్ల బ్యాటరీ త్వరగా దెబ్బతింటుంది. తరచుగా వేగంగా స్కూటర్ నడపడం, ఆకస్మిక బ్రేకింగ్ బ్యాటరీపై అదనపు భారాన్ని మోపుతాయి. ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ వేగంగా డిశ్చార్జ్ కావడం ప్రారంభం కావడంతో ఛార్జ్ కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటే, లేదా దాని పనితీరు తగ్గితే, అది బ్యాటరీని మార్చాల్సిన సమయం వచ్చిందని అర్థం చేసుకోవాలి.



## సియెట్ నుంచి కొత్త టైర్లు..

**ముంబై, మార్చి 23:** సాధారణంగా ఏ వాహన వేగమైన దాని ఇంజిన్‌తో పాటు వాహనానికి వాడిన టైర్లపై ఆధారపడి ఉంటుందన్న విషయం అందరికి తెలిసిందే. ఏ వాహనానికి అయినా టైర్లు అనేవి కీలక పాత్ర పోషిస్తాయి. అయితే సియట్ తాజాగా ఆవిష్కరించిన టైర్లు ఏకంగా గంటకు 300 కి.మీ.ల వేగాన్ని తట్టుకుని సామర్థ్యంతో ఉన్నాయి. భారత్‌లో దిగ్గజటైర్ల తయారీ సంస్థ సియట్ తాజాగా తమ స్పోర్ట్‌డ్రైవ్ శ్రేణిలో మూడు అధునాతన ఉత్పత్తులను ఆవిష్కరించింది. అల్ట్రాహై పెర్ఫార్మెన్స్, లగ్జరీ ఫోర్‌వీలర్ సెగ్మెంట్లో కంపెనీ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. జర్మనీలోని అంతర్జాతీయ ఆటోమోటివ్ ప్లాంట్లలో ఎన్నో కఠినమైన పరీక్షలను నిర్వహించి అందుబాటులోకి తీసుకువచ్చింది కంపెనీ. రన్‌ఫ్లాట్ టైర్ల ఆవిష్కరణతో ప్రీమియం, టెక్నాలజీ ఆధారిత బ్రాండ్‌గా సియట్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోనుంది. ఫోర్ వీలర్ టైర్ల సెగ్మెంట్లో మా అగ్రస్థానాన్ని నిలబెట్టుకునేలా రన్ ఫ్లాట్ టైర్లను ప్రవేశపెట్టిన తొలి భారతీయ కంపెనీగా నిలవడం గర్వకారణం అని సియట్ ఎండీ, సీఈవో అర్ణబ్ బెనర్జీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా లగ్జరీ వాహనాల యజమానులు కోరుకునే ప్రమాణాలతో టైర్లను అందించాలనే నిబద్ధతకు అనుగుణంగా రన్‌ఫ్లాట్ టైర్లు, రేటెడ్ టైర్లతో స్పోర్ట్‌డ్రైవ్ సరికొత్త టైర్లను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. జర్మనీలోని ప్లాంట్‌లో అనేక పరీక్షలు జరిపిన తరువాతే మార్కెట్లోకి విడుదల చేస్తున్నామని సియట్ సీఎంవో లక్ష్మీ నారాయణన్ అన్నారు. సరికొత్త ప్రీమియం టైర్ల శ్రేణి ఏప్రిల్ నుంచి ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా, పుణె, చండీగఢ్, ఉత్తర్ ప్రదేశ్, బెంగళూరు, తమిళనాడు, కోయంబత్తూరు, మధురై, కేరళ, హైదరాబాద్, గువాహటి, అహ్మదాబాద్ లాంటి కీలక మార్కెట్లలో అందుబాటులో ఉంటాయన్నారు. రన్‌ఫ్లాట్ టైర్ల ధర రూ.15,000 నుంచి రూ.20,000 వరకు ఉంటాయని, అలాగే, 21 అంగుళాల జెడ్ఆర్ రేటెడ్ అల్ట్రాహైపెర్ఫార్మెన్స్ సిఎల్‌జి టెక్నాలజీ టైర్ల ధర రూ.25,000 నుంచి రూ.30,000 వరకు ఉంటుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.